UNIVERSAL
LIBRARY
OU_204755
UNIVERSAL
LIBRARY

శ్రీరస్తు.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పండితరాజము.

ఇది

## శ్రీ తిరుపతి వేంకటేశ్వరులచే

రచియింపఁబడి,

మదరాసు:

శ్రీ వైజయంతీ ముద్రాక్షరశాలలో

ముద్రింపించి ప్రచురింపఁబడియె.

మొదటికూర్పు 1,100.

దీనివెల రూ. 0-10-0.

కాపీరైటు రిజిస్టర్డు.

1909

# ఉపోద్ఘాతము.

ఈనాటకము మే మొనర్చిన నాటకములలో మొట్ట మొదటిది. కాని కొన్ని కారణములచే నింత కాలము వఱకు ముద్రింపఁబడదయ్యె. శ్రీ జగదేక కవితాధురంధరుండగు జగన్నాథ పండితరాయలు ఢిల్లీచక్రవర్తియగు షహాబుద్దీను కొమార్తెను వివాహమాడి పదపడి తత్కాలపు విద్వాంసులచేఁ గాశీపట్టణమున బహిష్కరింపఁబడి గంగకతనఁ బవిత్రుఁడయ్యెనని లోకులు చెప్పికొనెడి కథ తగుపాటిమార్పులతో వర్ణింపఁబడినది. ఈ విద్వత్కవి తెలుఁగుదేశపు వాఁడు. వేఁగినాటి శాఖవాఁడు. ఈతనికి సరస్వతీతైల పానవశమున నిట్టి విద్వత్కవితాధురంధరత్వ మలవడుటయే కాక యేకసంథాగ్రాహిత్వముకూడ సమకూరెనని వినికి. ఇయ్యనఘుఁడు యౌవన దశయందు ధనార్జనకై స్వదేశరాజులం గొందఱం జూచి వారిచ్చు నీవిచేఁ దనియక ఢిల్లీశ్వరు దర్శింపఁ బోయెనని వినికివలననే కాక ఈతఁ డొనర్చిన "శ్లో॥ ఢిల్లీశ్వరో వా జగదీశ్వరో వా మనోరథాన్ పూరయితుం సమర్థః। అన్యైర్నృపాలైః పరదీయమానం శాకాయ వా స్యా ల్లవణాయ వా స్యాత్." శ్లో॥ నయాచే పింఛందూకం పర్వణిదత్తైక డబ్బాకం। యాచే మొగల్లలూకం తృణీకృత సువర్ణసందూకం॥ ఇత్యాది శ్లోకముల వలనఁగూడ స్థిరపడుచున్నది. "శ్లో॥ ఆకుచదేశం పచరే గ్గాకురుపరవాది నిర్జయే శంకాం। స్వీకురువర మేకం మే వ్యాకురుభో వత్సశాస్త్రాణి" ఈ శ్లోకమువలన నితఁడు వరప్రసాది యనికూడ ధ్రువపడుచున్నది. ఇతఁడు యవనీ సహితముగ గంగలో నంతర్ధానము నందెనని వినికి మాత్ర మున్నది గాని అయ్యది విశ్వసింపఁ దగినది కాదు. ఏమన? రసగంగాధరములో గంగాలహరీ శ్లోకములు కనుపట్టుచుంటం జేసి. యాగ్రంథము లహరీరచనానంతరము నిర్మింపఁబడె ననుటకు సందియము లేదు కదా? అట్లయిన నితఁడు మఱికొంత కాలము జీవించి తీరవలెను. దీనింబట్టియె మేము గంగలో నంతర్ధానము చెందినట్లు వ్రాయలేదు. ఇందుస్వప్నవృత్తాంతము కేవల కల్పితము. ఉద్యానవనవిహారముగూడ నట్టిదే. తక్కిన విషయము కొంచెము గొప్ప నిజమే కాని యట్టిది కాదు. స్వప్నవృత్తాంతముచే నీ నాయికానాయకులు దివ్యులుగా సమర్థింపఁ బడుచున్నారు కాన నాటకనామము యథాకథంచిత్తుగా సమర్థింపఁబడుచున్నది. లేదా? ఈతఁడు పండితరాజు గనుక రాజైనను గావచ్చును. ఇప్పటికిని గాశిలో నీయనంగూర్చి యనేక మహాత్త్వములు చెప్పఁబడుచున్నవి. అవి

అన్నియును నిందుఁ జేర్చిన "గ్రంథవిస్తర మగునని యుపేక్షింపఁబడియె. ఈ చక్రవర్తి షాబుహానని కొందఱి వ్రాఁతలవలనఁ గనుపట్టుచున్నను రసగంగాధరములో నుదాహరించిన "భూమీనాథ శహాబదీన" అను శ్లోకములోని "శహాబదీన" అను పదము శహాబుద్దీన్ అను దానినుండి కైకొనినట్లు మాకుఁదోఁచుటచే నితఁడు శహాబుద్దీను కొమార్తను వివాహమాడినట్లు వ్రాసితిమి లేదా? ఈ రెండు నామములును నొకనికే యుండవలెను. ఈలవంగి చక్రవర్తికూఁతురు కానియట్లును మఱియెవ్వతెయో యయినట్లును గంగాధర పీఠికలో వ్రాయఁబడియున్నను మా మనస్సాక్షికి ననేకవిధముల నయ్యది యుక్తియుక్తముగాఁ గనుపట్టదు. ఎవ్వరో యవనిం గ్రహించుటకు "నయాచే" ఇత్యాది శ్లోకములచేఁ జక్రవర్తి నేల ప్రార్థింపవలెను? కానిండు. ఏది యెట్లైనను మేమంత స్తనశల్యపరీక్షకుఁ బోక యాంధ్రదేశప్రతీతి ననుసరించి యిద్దాని రచించితిమి. ఇందు 5వ యంకమున నితఁడు రచించిన గంగాలహరి దెలిగింపఁ బడినది. లహరీ శ్లోకములు 52ను గాక స్వకపోలకల్పిత పద్యములు గూడఁ గొన్నియందుఁ జేర్చితిమి. ప్రదర్శకు లయ్యెడ నన్నిపద్యములును గైకొనిన సభ్యులకు విసువు జనించునుగాన సమయోచితముగాఁ గొన్నిటిని మాత్రమే పఠించుచుందురుగాక. మఱియు గంగోపన్యాసము నందలి పద్యములుగూడ నిట్లే కైకొనఁదగు. అక్కడక్కడ నీతిని సంస్కృత శ్లోకములు తెనిఁగింపఁబడినవి. ఇందు షాబుషా మొదలైన కొన్ని తురుష్కపాత్రములకు నందఱితోఁబాటుగాఁ దెలుఁగే వాడఁబడినది. అయ్యెడఁ దత్తదుచితముగా భాషమార్చికొనఁ బ్రదర్శకులు హెచ్చరింపఁ బడుచున్నారు. ఇప్పటి వారనేకులకు మహాత్ములయందు విశ్వాసమును నాదరమును లేకపోయినను కాలనిర్ణయమందుఁ బరమాదరముండుటం బట్టి యీ విచారణమిందుఁ గొంత యావశ్యకమై యున్నది. కాని గంగాధరపీఠికలోనను మఱికొందఱి వ్రాఁతలయందును ఇక్కవిత్తల్లజుఁడు 17-వ శతాబ్దమున నున్నట్లు మాత్రమే తెలియవచ్చుచున్నది గాని యేసంవత్సరమున నేదినమున నేముహూర్తమున జన్మించెనో తెలియమికి మిగులఁ జింతిల్లుచున్నారము. ఇందలి రసము శృంగారము. గద్యములలో నచ్చటచ్చట రసోచితముగా గ్రామ్యములు వాడఁబడినవి. 2-వ యంకములోని వేంకటేశ్వర పదమునకుఁ దిరుపతి వేంకటేశ్వరుఁడని యర్థము చెప్పికొనక మేలుకోట చెల్లపిల్లరాయఁడను నర్థము చెప్పికొనవలెను. ముద్రాప్రమాదములు స్థూలదృష్టిగా దిద్దఁబడినవి. మఱియుంగలిన దిద్దికొనఁ బ్రార్థితులు.

తిరుపతి వేంకటేశ్వరులు.

# ఇందువచ్చు పాత్రములు.

## 1. అంకము.

1. సూత్రధారుఁడు.
2. నటి.
3. రాయలు.
4. శిష్యులు.

## 2. అంకము.

1. విదూషకుఁడు.
2. శిష్యులు.
3. రాయలు.

## 3. అంకము.

1. లవంగి.
2. మల్లిక.
3. రాయలు.
4. విదూషకుఁడు.
5. మాతంగి.

## 4. అంకము.

1. వైతాళికులు.
2. పాదుషా.
3. దేవి.
4. పరిచారిక.
5. లవంగి.
6. మల్లిక.
7. మాతంగి.
8. కవులు.
9. మంత్రులు.
10. ఉద్యోగులు.
11. రాయలు.
12. విదూషకుఁడు.

## 5 అంకము.

1. గోదావరి.
2. కంప.
3. రాయలు.
4. లవంగి.
5. భట్టోజిదీక్షితులు.
6. అప్పయ్యదీక్షితులు,
7. గంగ.

శ్రీమత్పరదేవతాయైనమః.

శుభమస్తు.

# పండితరాజము

## తిరుపతి వేంకటీయము.

## ప్రథమాంకము.

(నాంది)

ఉ. శ్రీయు యశంబు నున్నతియుఁ జెల్వ మిహమ్ముఁ బరమ్ము విద్యయై
యేయుగమందు నెల్లెడల నేయనఘాత్ముల కొప్పు నట్టివి
ద్యాయతనంబులై కవితకాస్పదులై ప్రళయాంతమందునున్
బాయనికీర్తి నొప్పెసఁగుపండితరాజుల కేను మ్రొక్కెదన్.

(నాంద్యంతమందు సూత్రధారుఁడు ప్రవేశించి తెరవంకఁ జూచి)

**సూత్ర**—ఆర్యురాలా! యేమి యీయాలస్యము ఇంతవఱకైన నీయలంకారము కాలేదు కాఁబోలును.

**నటి**—(ప్రవేశించి) ఆర్య! ఇదె వచ్చితి. అలంకారమున కేమున్నయది? కురులు దువ్వికొనుటయుఁ బూలు ముడిచికొనుటయుఁ గాటుక దిద్దికొనుటయుఁ దక్క నగలవలని వగలు దెచ్చికొనునంతటిభాగ్యమున కేను నోఁచినదానఁ గానుగదా?

**సూత్ర**—అహో! వంశపరంపరచే వచ్చుచున్న యీ నాట్యవిద్యచే జీవించుమనకు నెల్లరకుం బోలె, మణిభూషణంబులును, పట్టుపుట్టంబులును నెక్కడివి? అదిగాక, యీ ప్రపంచము పుట్టినయది మొదలిప్పటికి విద్యాజీవనుల కైశ్వర్య మెక్కడ వినఁబడ్డది?

**నటి**—(కోపముతో)

తే. మాతృగుప్తకవీంద్రునిమాట వినవొ?, కాళిదాసాదికవులసంగతులు వినవొ?
విద్య గలవారి కెల్ల నివ్విధముగా దరిద్రతయె నిక్క మన్న నేరికి హితంబు?

**సూత్ర**—సుప్రసిద్ధమగు విషయమే మఱచితివి. కాళిదాసాదుల కైశ్వర్యమున కేమిగాని విక్రమార్కునను గ్రహమ్మునఁ గాశ్మీరమండలమ్మున కేకచ్ఛత్రాధిపత్యము వహించిన మాతృగుప్తునివలె నెవరుల కైశ్వర్య మనుభవింపఁ జెల్లడినె?

నటి—ఆర్యా ! ఇవి యేటిమాటలు?

తే. నేల నాలుగుచెఱఁగులు నేలె నెవ్వఁ, డెవని కరిగాపు వైరి భూమీశు లెల్ల
నట్టిఁ డగుఢిల్లీశ్వరపాదుషా కల్లుఁ డైన, యట్టిపండితరాయలయశము వినవొ ?

సూత్ర—అవు నవును. కర్ణాకర్ణికగా నమ్మహానుభావునిచరిత్రము విను చున్నయదియే. చక్కనిప్రసంగములోనికి దింపితివి. అయిన నేమి, సభ్యులు నాటకారంభమున కెదురు చూచు చుందురు. పత్రిక పుచ్చుకొంచి చాలసే పైనది. (విప్పి చూచి) ఏమి నీ భావికార్యాభిజ్ఞత ? సభ్యులయనుశాసనమునకుఁ దగినప్రసక్తి దెచ్చితివి.

నటి—“ మాతృగుప్తునిచరిత్ర మాడుఁ ” డని యాజ్ఞాపించిరా యేమి?

సూత్ర—కాదు కాదు. “ సుప్రసిద్ధులును, న నేకగ్రంథవిధాతలును నగు వేదము వేంకటేశ్వరులచే నూత్నముగా రచింపఁ బడినపండితరాజ మను నాటకము ప్రయోగింపవలయు”నని,

కం. కృతికర్తలా ప్రకృష్టులు, కృతినాయకు నంతవారు లిల లేరిఁక ధీ
యుతులు ప్రయోక్తలు సభ్యులు, నతులితు లిటువంటిభాగ్య మబ్బుఁగ వలదొ ?

“ ఆలస్యా దమృతం విషమ్”మ్మనుటచే నయ్యది దేనికిని బనికిమాలినది, కావున వ్యాసమ యొక్కింత గాన మొనరింపుము.

నటి—ఏఋతువు ననుసరింతును?

సూత్ర—వెఱ్ఱిదానా! కనులకుఁ గట్టిన ట్లగపడునీవసంతముకన్న నన్య మెందులకు వెదకవలసి వచ్చెను ?

నటి—

సీ. పూలగుత్తులు చిన్నిపూఁపపిందెలు పొల్పు గల్పింప నామ్రములు కలిమి నలరె వానియాశ్రయణంబు నూని కోయిలలు పొగ డ్వట్టి రేయుంబగళ్లు కూసె నాశాజితములకత్యాశలత్వము నంది పథికు లెల్లరు నూరిబాటఁ బడిరి వచ్చినభర్తలఁ గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి ప్రోషితభర్తృకల్ ప్రోది నూఁది గక్కుత్తున మదనున కలంకారాని, యుత్సవము లెల్లెడల నొప్పె నొక్కఁ డేల? యలరెఁ బండితరాయలయశము వోలె, సకలలోకసుఖంబు వసంతుచేద్దు.

(తెరలో)

ఎవ డక్కడ? నారాక దాదాఁపగుట యెఱింగియుం బోలె వృథా మిథ్యాస్తవంబు గానరుప్పటకు మొదలు వెట్టిరి,

సీ. పరదేశములు దివ్యతరదేశములు గాఁగఁ బరులగ్రామములు కోఁపురము గాఁగఁ
బరగేహములు సౌఖ్యకరగేహములు గాఁగఁ బరులసంపదలు సంపదలు గాఁగఁ
బరసజ్జనావళుల్ పరమబంధులు గాఁగఁ బరులయన్నము పుష్టికరము గాఁగఁ
బరులుకష్టసుఖమ్ము లరయువారలు గాఁగఁ బరు లెల్ల కృతులనపరులు గాఁగ
సంతతప్రవాససంజాత ఖేదంబు, తనకె కాక శిష్యజనములకును
గలుగఁ జేసెనుఁ నట్టికష్టుండు పండిత,రాజు వానియశ మరమ్య మెందు.

నటి—(చెవి యొగ్గి) ఆర్యా! ఏఁదియో మేఘగంభీరనిస్వనంబున వినవచ్చుచున్నయది.

సూత్ర—నీతమ్ముఁడు మాధవుఁడు పండితరాయభూమికఁ ధరియించి సశిష్యుండై ప్రవేశించుచుండం బోలు. మన మనంతరవిధానమ్ములకుఁ బోవుదము రమ్ము. (నిష్క్రమింతురు)

(ప్రస్తావన)

(అనంతరము పండితరాయలును శిష్యులును బ్రవేశింతురు)

రాయ—(విసువుతో నిట్టూర్పు నిగిడ్చి)

మ. అతిసమ్మోన్నత మైనదేశముల బంప్లల్లాడి ప్రమ్మొగ్గంగఁ దా
మతుకుల్ వాసె శరీరసంధు లకటా! యాహారమా! నీరమా!
మెతుకుగ్గినఁ దక్రమా! శివశివా! మేనెల్ల శుష్కించెఁ "బం
డితరీతి పరదేశ" మన్నపలుకే నిక్కమ్ము ముమ్మాటికిన్.

శిష్య—గురువరా! ఇదివఱకెన్నండును లేనివిసువు మీ కీనాఁటఁ గన్పట్టె నేల? మేమేదేని యపచారం బొనరింపలేదు కదా? తమయశంబరమ్యమని సుగ్గడించుటయు శిష్యులకును ఖేదంబు గలుగఁ జేయుచుంటి మనుటయు మా కీయనుమానమ్ము గలిగించుచున్నయవి. తాము వచించినవాక్యములసత్యములెట్లయ్యెడి? నిజముగాఁ దమయశంబరమ్య మెందు.

రాయ—ఈసాంద్రపల్లవవేల్లితంబగు కానుగునీడకుఁ బోవుదము రండు. ఎండకిరణుండు తన తైక్ష్ణ్య మెల్లఁ బూర్వయామమ్మునన వినియోగించుచున్నవాఁడు.

శిష్య—గ్రీష్మర్తు వాసన్న మగుటంజేసి క్రమముగా నుదయించుటయె తడవుగా నెండ మెండగుచున్నయది.

(ఎల్లరును చెట్టునీడ నిలుతురు.)

రాయ—(స్పర్శసుఖము నిరూపించి)

ఉ. ఎక్కడి కేఁగెఁ దాప, మిఁక నెయ్యెడఁ బోయెఁ బథశ్రమం, బదే
చక్కని డాఁగె దప్పి, యెటు సాగెను యాఁకలి, స్వేదబిందువుల్

గ్రుక్కిళ్లు లారఁ గ్రోలుచు మరుచ్చిఖుపుల్ మెయి నిండఁ బ్రాఁకి యి
దిక్కునఁ జూడఁ దామ యయి తీఱని మోదము వెల్లి గొల్పెడిన్.

శిష్య— దేశికోత్తమా! ప్రవాసం బని కొందఱు నిందింతురే కాని నిజమ్మున కిట్టియఖండ సౌఖ్యమ్ములు కూపకూర్మములవలె నిండ్లఁ బ్రుగ్గడియుజ్ఞులకుఁ దటస్థించునా?

రాయ— సత్యమే, అయినను, ఇప్పటి కించుమించుగ నాలుగునెలలనుండి రేయి యనక పవ లనక యెండ యనక కొండ యనక పులి యనక ఘాత మనక యెడతెగని పయనంబుల బడలిన, "ఢిల్లీనగరం బొకటి రెండుదినంబులకుఁ జో నగు" నని యెడి వార్తమాత్రము విన వచ్చుచున్నయది.

శా. వేఁగీదేశమునన్ జనించితిని దేవీపాదసంసేవనో
ద్యోగంబున్ బొనరించి "విద్యలను నెంతేన్ వీనికిన్ దుల్యుఁ డే
భాగమ్మందును లేఁ" డటన్నయశముం బ్రాపించి పై నేకసం
ధాగ్రాహిత్వ మశేషభాషలను సంధానింపఁగా నేర్చితిన్.

చం. చను వటు లుండ నెల్లరప్రశంసకు నెక్కిన మేటిధాటి ను
ప్పిదముగఁ జెప్ప నేరుతుఁ గవిత్వ, మెవండును నన్నెదుర్ప లేఁ,
డెగరిన నోఁ బరాభవము యేర్పడు వానికి, నిట్టినాకునున్
గుఱుగు పొట్టకుం దగినకూడిహిహీ మఱి వేయు నేటికిన్?

(ఇంచుక యోజించి) ఓహో! యేమి యీదారిద్ర్యప్రభావము? మార్గాయాసమ్మునకుఁ దోడైన న్నాత్మశ్లాఘాపరాయణుం గా నొనరించుచున్నయది తప్పేమి!

ఉ. త్రిప్పున నేక దేశములు తీవ్రపుఁగోపము పుట్టఁ జేయుఁ జె
రప్పులపా లొనర్చుఁ బరమార్థమువంకకుఁ బోవ నీయ దే
గొప్పయు దక్కనీదు తనకుం గలమానము వమ్మొనర్చుఁ దా .
నుప్పున కేని మారఁ డెవఁ డొందు దరిద్రత వాఁడు శూన్యుఁ డై.

శిష్య— దేవా! యేల దేవర యాత్మశ్లాఘావోషదూషితు లయినట్లు కుంగుచున్నారు. తాము వచించువిశేషము లన్నియు నెంచుకయు స్వభావోక్తికి మించవు. తమ కేటి కెపరితాపము? కొలఁది కాలముక్రిందట నవరాత్రమహోమహమ్మునందలియట్టిమీదినమ్మున నర్ధరాత్రమ్మున నెల్లరిసముఖమ్మున వినఁబడినయాకాశవచనంబులు స్మరింపుఁడు.

మ. "కురుదేశమ్ములదాఁక నేగు మెదురై కోపించి నీతోడ నెం
డొరుఁ డెవ్వండును నిల్వఁ డింగులకు నీ వొక్కింతయున్ శంకచా

స్ఫురయం బోకు వరం బొసంగితిని వత్సా! సర్వశాస్త్రమ్ములన్

బరిశీలించి యొనర్పు వ్యాఖ్య" లని యంబాదేవి వాక్రుచ్చదే?

రాయ—అవును. మనయందు జగదీశ్వరయనుగ్రహం బట్టిదియ యైనను నిటుకొంత

తాండవం బేరు సంతసింపఁ దగినయది.

కం. విద్వత్తయు దారిద్ర్యము, నద్వైతమునం గుఁబోలె నాత్మేశ్వరులై

యీద్వీప మొక్కఁ డేల, న, వద్వీపము లేని దాఁటు వనములు దూఁటున్.

శిష్య—సత్యమే. అయినను, దూరస్థపర్వతన్యాయముగా మన మిట్లరుగుచుంటిమే

కాని మనమండలమున నేమి చుట్టుపట్టుల నేమి యఖండవదాన్యు లగురాజన్యు

లెందఱు లేరు?

రాయ—ఓహో! యేమి యీ వెఱ్ఱితనము. మన దేశపురాజుల నాశ్రయించెడిపండితుల

కిప్పుడే కాదు గదా, పరజన్మంబులందుని దారిద్ర్యభారమ్ము వాయదు.

శా. ఈఁగి స్నేరఁ డొకండు, నేర్చినను దా నీఁగిల్లు బోగాలకున్

రాగిన్ దక్కఁ గనీండ్రులన్ దనుప రీరాజ్యమ్ములం, దట్టియా

త్యాగం బనియుఁ బర్వకాలములఁ దీర్థాలందుఁ గన్పట్టు, నే

నేగంగావలె నియ్యఁగ వలసు డిల్లీశుండు నే యేటికిన్.

కం. డిల్లీశుఁడో జగదీశుఁడో, యుల్లమ్మునఁ బొడముకోర్కు లొడఁగూర్చెడ నీ

చిల్లరరాజు లొసంగుట, కల్ల యొసంగినను గూడకా? యుప్పునకా?

ఇంతియ కా దింకను వీరలయవ్యవస్థత లనేకములు గలవు చూడుము.

సీ. తమకు రాఁదగినయాదాయమ్ము నెఱుఁగరు; వ్యయ మెఱుంగరు; తమదయకుఁ బాత్రు

లగుమంత్రు లొనరించునన్యాయము తెఱుంగ; రాష్ట్రరాజ్యాభివృద్ధ్యాదికార

ణము లగు రైతు లన్నము లేక చచ్చుచున్నను సొంకింతయు వారిఁ గనరు; పన్ను

హెచ్చొనర్చినవాఁడె యిష్టుఁ డుద్యోగులం; దిట్టు లార్జించియు నేమిఫలము?

పండితుల కొక్కసంస్థానపదవియును వత్సరమున కొకకొంత యేని ద్రవ్యమును వ్యయింప

డదియునిట్లుండఁబయి పెచ్చుఋణము వీర, నెప్పటికి నప్పుడే క్రమింగ నెసఁగుచుండు.

ఔరా! వీరిదురవస్థ.

సీ. తప్పులెక్కలు వ్రాసి తమమంత్రు లందఱు నపహరింతురు కొంత యప్పుడపుడు

పై నిచ్చు లంచాలపాలగు మఱికొంత నౌకర్ల చౌర్యమ్మున హరియింత్రు

రాజబంధుగులమర్యాదల కొక్కింత వమ్మగుఁ గోడిపందెమ్ములకును

గొఱ్ఱెపందెమ్ములకును గొంత బూడిలోఁ బోసినయాజ్యమై పోవుఁ గుడకుఁ

ధమునఁ దండికి నున్న శుభము కానర్ప, బొత్తిగా నుండ దప్పు దప్పును బొనర్చు
రదియు నిప్పించువాని కం దర్ధ మేని, యీక మానగు బహుమాన మింత నిజము.

మన రాజుల జాగరూకతయు మనమంత్రుల స్వార్థతత్పరతయు నెవ్వ రెఱుఁగరు. మన మెట్టి యిక్కట్టులకేని యోర్చి డిల్లీచక్రవర్తిన్ దర్శించితి మేని నిక్కముగా నీ యకించినతి యకించిత్కరమ్ము గాఁ గలదు.

శిష్యు — చిత్తము, దేవర యానతిచ్చినవిధం బెల్ల నిక్కంబ యైనను జన వుండుటం బట్టి వినిన తెఱంగు విన్నవించికొనుట మన్నింపఁ దగు.

శా. హుక్కా ద్రావుచు రేయుఁ బవలు రాజ్యోద్యోగముల్ మాని కై
పెక్కింపన్ దగువస్తువుల్ మెసవుచున్ హేలావినోదమ్ముగా
నక్కల్ చక్కనిరోవెలందుకలకై యర్పించి తా మెవ్వరో
లెక్కింపన్ మఱి లేని యావనవిభుల్ సేవింపఁగా న్యాయ్యమే?

కం. మనకున్ గోబ్రాహ్మణపూజనమున్ విధియించు శ్రుతులు, చంపు మనుట గో
వ్వును గోవుల యావనమత, మనఘా! సరి పడుట యెట్లు లవ్వారలతోన్?

ఉ. ఇచ్చిన నీయకున్న మనయిచ్ఛకు నడ్డము రా రొకింతయు
నిచ్చటి రాజు; లాయవను లెప్పటికిన్ మనవిప్రు లన్నయో
మచ్చర మెక్కి పల్లకులు మానక మోయఁగఁ జేతు రంచుఁ బై
పెచ్చుగఁ జెప్పుచుందురు మన పెద్దలు; వార లసత్యవాక్కులే?

రాయ — ఈ చెప్పినదొప్పంతయు నిక్కంబ కాని,

తే.గీ. దుండగులు వారిలో గల రుండ వచ్చు, మనమతమ్మునఁ బెక్కు; రజ్జనులఁ బట్టి
మతము నెల్లను దూషింపమనకు నొరుల, కును దగ దుర్యోగ్యులగువారిఁ గనఁగవలయు.

నిష్పక్షపాతముగఁ బరిశీలించిన మనమతమ్మునను నిటుఁ గొన్ని దోషమ్ములు విద్వదాచారసమ్మతంబులై యున్నయవి.

ఉ. యాగములందుఁ ద్రావుట సురానాల వధించుట గ్రామ్యకర్మసం
యోగము దేవయోగ్య మని యొప్పుటయున్ మొద లెన్నియేనియున్
రోగులె యొప్పి రిట్టియవయోగము మాన్పఁగఁ జాలువారలున్
బాగన రోగునాఁ జనరు పై శ్రుతివాక్యము లట్టులుండుటన్.

కం. శ్రుతియేనియు నది బుధసమ్మతికిన్ వెలియేని దాని మానం దగు స
న్మతి కెక్కనియది శ్రుతికిన్, బ్రతియేనియుఁ గొనఁగ నొప్పఁ బ్రజ్ఞావంతుల్.

శ్రుతు లన్నియు మనము వ్యవహారమ్మునకుఁ దెచ్చికొంటి మేని మనకన్న నెవ్వ రేని యు మెఱుఁ గనకతీఱును సర్వజనసమ్మతం బగుశిష్టాచారం బొక్కటి మనలఁ గాపాడు చున్నయది. ఐన నేమి, యాయాచారమ్మును బరస్పరద్వేషదూషితు లగు పండితాభాసులచే ననేకమార్గమ్ములఁ బోవు చున్నయది.

తే. సాత్వికులు పిష్టపశువిశసన మొనర్తు,రని పురాణమ్ములందుఁ జెప్పినవిధమున
గొంత కొఱఁగ వేదముల్ సూలు ననుచు,నితరులాచరింత్రు ప్రత్యక్షహింసనంబు.

శ్రుతిస్మృతిపురాణేతిహాసమ్ములు నేఁడుఁ జూడ నతివిచిత్రమ్ములుగను దురూహమ్ములుగను గన్పడెడి. తురకలకును నిట్టివిపరీతార్థబోధకమ్ము లగువేదమ్ములును దత్తదంగమ్ములును గూడ నుండక మానవు. వానింబట్టియె వార లాచరించుకార్యములలో ననేకములు మనకుంబోలె సుసాధంబులు. ఏది యెట్లయినను,

సీ. మనకే మచ్యుల కేమి యావనవిభుల్ మన్నించి తా మిచ్చునా
ఘనవృత్తుల్ మఱియుఁ జమీనులును లెక్కన్ జూడఁగాఁ జేయుభో
జనమే వారల దంచుఁ జెప్ప నగు,రాజ్యం బెట్లు శాసించినన్
జను దాతృత్వమువారిసొమ్మయి ప్రశంసన్ జేయఁగాఁ జెల్లదే?

అది యునుంగాక,

శా. ఏసుగ్వృత్తులలో నునింగి మఱి యే దేరీతి వెచ్చించినన్
గా దాద్రవ్యము శూన్య మెంత యు నహీనంబౌట, హిందూవిభుల్
మీఁదున్ జూడక వెచ్చపెట్టినను, నామే యన్నవస్త్రాలకున్
లేదో మా కనునంత సేగి త్వరలో నే కొంతు రత్యల్పమై.

శిష్య—ఆర్యా! ఇది యంతయు నిక్కంబ, వారెంతతఱుఁగనిదాత లైనను,

శా. యోగం బొక్కటి మంచి దైనయెడ నేయూరేగినన్ జక్కఁగా
యోగించున్, విపరీత మైనయెడలన్ యోగింప, డింతేల, మీ
రెఱుగుం డంబుధిఁగాని కూపమునఁగానీ తుల్య మానీటి నే
తేఁ గల్గున్ గల్గం, బదృష్టవశముల్ దైవార్థసంపాదనల్.

గాయ—కార్యమ్మును నిక్కమే యగుఁ గాని,

మ. పయనం బైనదినంబునుండియును స్వప్నమ్ముల్ భుజస్పందముల్
నయనస్పందము లాదిగా మనకుఁ గానన్ వచ్చు;నీసూచనల్
హయవేదండమహోగ్రపోరబహుసూనాధక్యముఁ దెల్పు; నిం
తయు నిక్కం బగుఁ గాక; యోగమును నిమిత్తంబుల్ సుఖంబుల్ గదా.

శిష్యు — ఆర్యవర్యా! ప్రాకృతజనులంబోలె దేవర స్వప్నమ్ములనియు శకునమ్ములనియు విశ్వసించుట కరం బాశ్చర్యమ్ము కలిగించు చున్నయది.

తే. నిదురపట్టమి స్వప్నముల్ నెగడు నొక్క,కపుడు ప్రకృతివశమ్మున నదరుభుజమ్ము
లేమి నయనమ్ములేమి యొండేమి దీన, నగుఫలమ్మును లే దన్య మరయ రాగ.

రాయ — ఇయ్యది యుం గొంతవఱకు నొప్పుకొనం దగినదే కాని, చిరపరిచితానుభవమ్మునన కదా! పెద్ద లివ్వేడల శాస్త్రమ్ములం గల్పించి యుందురు. వాని నింతమాత్రన త్రోసి వేయం జెల్లునా? ఇది యిట్లుండనిచ్చి నిష్కళంకబుద్ధితో విశ్వసింపందగిన దింకొక్క రహస్యమ్ము వచించెద.

శా. నాకున్ జాతక మొప్ప వ్రాసి విధికన్నన్ మిన్న మాతండ్రి, యం
దేకచ్ఛత్రవిభుండు గూర్చి నిడు నం చింతంతె సూచించె, డి
ల్లీకాంతుండు బినాగం దాదృశవిభుల్ లే, రేమి కానున్నదో?
యేకాలమ్మున నేమి వచ్చునొ నరుం డెవ్వాండు దైవేచ్ఛకున్?

శిష్యు — ఇది మఱియు విచిత్రముగ నున్నయది. విశ్వసించుట యటుండనిండు. తురుష్క కన్యాపాణిగ్రహణంబు లగ్రజాత్యుద్భవుల కేయంగమ్మునం జెల్లెడిని;? అంగలాగం దమవంటి మహానుభావు లెట్లు కైకొందురు ?

రాయ — (ఇంచుక తడవూరకుండి) ఆచక్రవర్తికిం గూర్చు గున్నయదియో లేదో మన మెఱుంగముగదా? ఉండుటయే నిక్కం బేని,

మ. కొనకే మిచ్చిన నేటివర్ణములు లోకుల్ కట్టుంబాటిట్లు న
చ్చినయట్లున్ బొనరించి "యెయ్యదికడున్ శ్రీమంత మావస్తువే"
నని శ్రీకృష్ణుండు గీతల న్నుడువండే? యాతం డసత్యమ్ము వ
ల్కునె? లోకేశుండు భేదబుద్ధిగలండే? క్రూరుండె? దైరాత్ముండే?

ఉ. దేశము లెన్ని? యొక్కయెడ దేవుండు గల్గి మఱొక్కచోట లే
డే? శ్రుతు లబ్బహామహుని వే యయినన్ మఱి పక్షపాతని
ర్దేశము లేల కన్పడు? విదేశపువారికి ముక్తి లేదె? యీ
దేశపువారు ముక్తు లని తెల్పంగ నా? నటులేని చెప్పుమా.

శా. పాండిత్యం బనం దుల్యదృష్టి యగు సంభావించు నవ్వాండు వే
దండంబున్ శునకంబు నొక్కగతి, నీతాత్పర్య మొక్కింత నే
గం డేనిన్ మఱి వాని కెక్కుడిది సారజ్ఞత్వ? మిం తేటికిన్
"చండాలోఽస్తుసతుద్విజో" స్తనుచు నాచార్యుల్ ప్రశంసింపరే.

ఇంతవట్టును శాస్త్రవిషయం బగుటచే నుపన్యసించితింగాని, ప్రకృతప్రసంగమ్ము లోనిది కాదు,

ఉ. ఎంతయు రిక్తులైనమన మెక్కడ? మధ్యమలోకపుణ్యశచీ
కాంతునికూఁతు రెక్కడ? యఖండులబుద్ధులు సైత మెక్కడో
వింతవిధమ్ముగాంచు, నవివేకము చెడ్డది, దానిఁ బ్రోఁదును నే
ర్పెంతటివానికేని జనియింపదు, కోర్కులనన్ పిశాచముల్.

ఈప్రశంస యంతయుఁ బెట్టఁగలబచ్చలపాముసామెతవంటిది. (ఆకసమువంకఁ జూచి) సుఖముగ నున్నయదికదా? యని యియ్యెడఁ గూర్చుంటిమి. కాల మతిక్రమించుచున్నయది.

కం. అంబరమధ్యంబును జే, రెం బంకజవల్లభుం డరిగెఁజల్లఁదనం
బుం బహుదూరమ్ముగ నెం, డం బడి తాళంగలేక నగగుహాలుసారన్.

శా. క్రాఁగన్ జొచ్చెఁ దటాకనీరములు, వృక్షశ్రేణిమూలమ్ములన్
డాఁగె న్నీడలు, సూళి బి ట్టెగసె, గాఢం బయ్యె సంతాప, ము
ద్యోగమ్మున్ దిగఁద్రావి హాలికులు పోనూహించుచున్నారు, నే
వేగన్ డగ్గరపల్లె కేగఁ దగు నీవెట్ట న్నివారింపఁగన్.

(అందఱునునిష్క్రమింతురు)

ఇది...శ్రీ తిరుపతి వేంకటేశ్వరవిరచితంబగుపండితరాజమ్మునఁ
ప్రథమాంకము.

# ద్వితీయాంకము.

(తరువాత విదూషకుఁడు ప్రవేశించును.)

విదూ—(తనలో) రాయలవారితో స్నేహ మైనది మొదలు పాదుషాయొద్ద కేగుటయే యిష్టము లేకున్నయది. "రాజును జూచినకళ్ల మొగుణ్ణి చూస్తే మొత్తుకోబుద్ధి వేస్తుం" దన్నట్లున్నది. ఆహాహా! సౌందర్యవిశేష మట్లుండ నాయనవాఙ్మాధుర్యము! ఎంతసేపు వినినను తనివితీఱదు. దీనికేమి? ఆశక్తియెట్టిదో! ఒకసారి విన్నంతనే యేభాషయైనను తూ, చా తప్పకుండఁ జదువును. పాపము! ఈప్రజ్ఞచేత నేకదా మొన్న గుఱ్ఱపుఖాసుదారుఁడును నేనుఁగుమావటీఁడును బెట్టికొన్నకలహములో నిష్కారణ మాయనకు సాక్ష్యము వచ్చినది. దిక్కుమాలినవిధవలు నీళ్లకుఁ దోలికొనిపోయినవాళ్లొకదానిమీఁద నుండి యొకదానిని దాఁటించుకొనుట యెందునకో? గుఱ్ఱము లాఘవము కలది గనుక దాఁటును గాని, యేనుఁగెట్లు దాఁటు ననుకొన్నాఁడో? పోనీ యెవరును దొరకనట్లు లీపండితుని సాక్షిగా నెందుకు వేసికొనవలెనో? అయిన నేమి? అతనుఁ బ్రభుదర్శనాకాంక్షి యగునియ్యనఘునికి ఫలకారియే యయినది. ఇంతకుఁ గతనుఁ డైనను దండనాధకారి బహురసికుఁడు; తాఁ గనుఁగొన్న వెంటనే యీయనశక్తిని పాదుషాకుఁ దెలియఁబఱచినాఁడు. పరోపకారపారీణుల కీసాయము లెక్కవియేకదా? లేనిచో నితఁడు పండితుఁ డని యెంత కాలము చెప్పినను దర్శన మగునా? ఇప్పుడో! యెందుకో చెప్పినట్లుండినను విధిగా దర్శనము కాఁగలదు (కొంచెము సేపూరకొని) లవంగి కెట్లు తెలిసినదో యీతనిసంగతి? ఎట్లని యొకసారి తనయుద్యానవనమునకుఁ దీసికొని రమ్మని తన చెలికత్తెయ మల్లికచేఁ గబురు చేసినది. కొంపతీసి చూచినపిమ్మట మోహింపదు కదా! (స్మృతి నభినయించి) అయ్యో! నాముసలిబుద్ధి మాసినట్లే యున్నది. అప్పటి కప్పుడే మఱచితినే. ఆమెకలలో నెవరో పాదుకట్టియచ్చొత్తినట్లీయనవిగ్రహము నే చూపి పిలువని పేరంటముగా దూతకృత్య మొనరించి మోహము కలిగించినదఁట! యని కూడ నిన్న నాబానిసకూఁతురు నాకుఁ జెప్పియే యున్నది. ఇఁక నేమి? సర్వవిధముల చేతను నీబ్రాహ్మణునిగొట్టె నేతనే పడ్డది. అదృష్టకాలము వచ్చునప్పటి కన్నియు నిట్లనుకూలించును కాఁబోలును; కాని, యుగ్రకులజుండును నఖండపండి

తుండును నగునతం డీనీచురాలి నంగీకరించునా? అంగీకరింప కేమి? ఘాదుపాకూఁతు కన్న నెక్కుడుసంబంధము దొరకెడినా యేమి యీబ్రహ్మచారికి? ధారాళముగా వివాహము చేసికొనఁ డేమో కాని రహస్యమున కభ్యంతర ముండదు. ఏది యె ట్లయినను నియ్యది నాప్రాణముమీఁదికి వచ్చినది. ఘాకపాకుఁ దెలిసినచో నే నేమి యుత్తరము చెప్పఁగలుగుదును? "నందో రాజాభవిష్యతి" తల్లిగండ ముండవలెను పిల్లగండ ముండవలెను గాని మంత్రసానిగండ ముండదు కదా; ఎట్లయినను నొకసారి యుద్యానవనమునకు మాత్రము తీసికొనిపోవుట నాకుఁ దప్పదు. అట్లు చేయనిచో నిప్పుడే నా కాపెవలనఁ జిక్కు తటస్థించును "అటునుండి నరుక్కు ర"మ్మన్నట్లు, పయిదానికిఁ జూచుకోలేక పోదునా? పోయి యాయనతో నీవిషయమును గొంత ముచ్చటించెదను (కొంతనడిచి) అదుగో! రాయలవారిశిష్యులు అందఱును నొకసారియే బయలుదేరినారే (శిష్యులు ప్రవేశింతురు) వీరి నడిగెదను (ప్రకాశము) అయ్యవా రేమి చేయుచున్నారు? పాఠములు చెప్పుకొనుట లైనదికాఁబోలును.

శిష్యు—లేదు, గురువుగా రేదో యాలోచించుచుఁ బిలిచినను పరాయత్తచిత్తులై నిన్నటి సంధ్యాకాలమునుండియుఁ బ్రత్యుత్తరమే యీయరు.

విదూ—(తనలో) కారణ మేమయి యుండునో! (ప్రకాశము) మీ రిప్పు డెక్కడికి?

శిష్యు—యుగ్గురమును వేర్వేఱుగా పను లుండియే బయలుదేరితిమి. ఒకరు కూరలకును మఱియొకరు తండులములకును, వేఱొకరు స్వకార్యమునకును.

విదూ—మీకు రొక్కమే దినవెచ్చ మిచ్చుచున్నారు కాఁబోలును. సరే, ఇవి స్వకార్యములు కావా? "తృప్తాస్థ"గా మీరే భోజనము చేసెదరు, పేరుమాత్రము గురువుగారిది.

శిష్యు—పుస్తక మొకటి కావలసియున్నది. అదిస్వకార్య మన్నాను; అంతే అన్నియును స్వకార్యములే, కాకేమి?

విదూ—ఉత్తరగీతలా? రతిరహస్యమా? దాని పే రేమి?

శిష్యు—(నవ్వి) మహాపండితుఁడవు, నీ కన్ని పేరులును వచ్చునే! మేము త్వరగా వచ్చి వంటఁ జేయవలె మమ్మును విడిచిపెట్టుము.

విదూ—వెళ్లుదురుగాని "విధవానాంవితంతూనాం కాగతిః పురుషోత్తమ" తరువాత "అహంవిద్యార్థిరూపేణ" అనియా? లేక "సన్యాసిరూపేణ" అనియా పాఠము? కొంచెము చెప్పిపొండి.

శిష్యు—ఇది యెందులోనిది? మే మెన్నఁడును విన లేదు.

విదూ—(పెదవివిరచి)ఇదే మీపాండిత్యము ? ఉత్తరగీతలలోఁ గృష్ణమూర్తి నర్జునుఁ డడుగఁగా నమ్మహానుభావుఁడు చెప్పినసమాధానము.

శిష్య—సరే, మమ్మను పోనిమ్ము ప్రొద్దు పోవుచున్నది. (నిష్క్రమింతురు.)

విదూ—(తనలో) ఇప్పుడు నాకు మఱియు వీలుగ నుండును. "లంజెకుపిల్లతగులాట" మన్నట్లు వీళ్లు లేకపోవుటయే మేలు. త్వరగాఁ బోయి వీళ్లు వచ్చునంతలోఁగాఁ గార్యము నెఱవేర్పవలెను (ముందుకునడిచి) ఇదిగో! అయ్యవారు నివసించుమేడుగు (చెవియొగ్గి) లోపలనాయన యేదియో శ్రవణసుఖముగఁ జదువుచున్నట్టు లున్నది. అది యిక్కడనుండి వినుటయే మెఱుఁగు గాని దగ్గర కేగితి నేని యాయన మాని వేయునేమో! (ఒక్కడపొంచివినును) (యథానిర్దిష్టముగా రాయలు ప్రవేశించును)

రాయ—

తే. యవని నవనీతకోమల నహహ యొక్క, సారి శయ్యకు రాఁదీయఁ జాలువాఁడ
నేని నందనవన మేల? యితర మేల? యవనియే హెచ్చు దీని కేదైన లొచ్చు.

విదూ—(తనలో) వెదకఁ బోయినతీవ కాళ్లకుఁ దవిలిన ట్లీయన పడుచుఁదనపుబాధ వెళ్లఁబోయుచున్నట్టు లున్నదే. ఈయవని యేయవని యైయుండునో? (మరలవినును)

రాయ—

శా. ఏ దంతస్థులమేడపై కటిక తా నేహేతువో వచ్చె, నేఁ
జూడన్ గూడునె నిష్కళంకుఁ డగునజ్జుం బోలె బొట్టింతలే
కే డాల్గుక్కుడి దాని నెమ్మొగము?పోనీ న న్నొకింతేనిఁ దాఁ
జూడన్ జాలెనె ? చక్రవర్తిసుతచూచుం బాటియే మాదృశుల్.

విదూ—(తనలో) నిక్కముగ నీయయ్యవారిబుద్ధి పెడతలఁ బట్టుటకు మనచక్రవర్తి కూఁతురే కారణము. పాప మీయన "యామె నెన్నఁడుజూడలే" దని భ్రమించు చున్నాఁడు. స్వప్నదర్శనమే కాక ప్రత్యక్షదర్శనముకూడ నైనది. (మరలవినును)

రాయ—

శా. నన్నుం బోలెడివార లెందఱిల నుండన్ బోరు ? వా రెల్లరున్
దన్నే చూచెను దన్నె చూచె ననుచున్ దర్కింపఁగాఁ జెల్లునే ?
యన్నారీమణి చూచెనేనియును; నాయక్షిప్రసారంబు సం
పన్నాకూతమొ ? కాదొ ? యన్యులమతుల్ ప్రత్యక్షముల్ కావుగా.

తే. కవు లతిశయోక్తి వర్ణింత్రు కావ్యములన,టందు రెఱుఁగమిఁగొంద,ఱయ్యతిశయోక్తి
యిప్పురముచొప్ప నిక్కమై యొప్పఁగనిన,కవియలంకారములనుండి కడకుఁద్రోయు.

విదూ—(తనలో) ఇంక నే నెంతయుఁ గృతార్థుఁడనే, రాచకన్నియ ఛీవాట్లు నాకుఁ దప్పినవి, కానియితనింగొంత సేపు చమత్కరించి కిసరించెద (దగ్గరగాఁ జని ప్రకాశము) సాధు! సాధు! జగమ్మునఁ బెక్కండ్రు పండితశ్రేష్ఠు లుండినను బండితరాయ లనుబిరుదమ్ము నీకే యొప్పుఁ దగినది.

రాయ—(తత్తరపాటుతోఁ దేరఁజూచి) చెలికాఁడు కాఁబోలును ఏమి యీదిన మింత యాలస్య మొనరించితివి ?

విదూ—నే నిప్పుడే రాలేదు, వచ్చి చాలసే పైనది. మీ రెవ్వియో యొంటిపాటున శృంగారపద్యములు చదువుచుండుట విని యంతరాయం బగునని లోపలికి రా నొల్లక యాగవాక్షముదరిఁ గూర్చుంటిని.

రాయ—(తనలో) ఇఁక నీపరిహాసకునకు సర్వము నరఁటిపం డొలిచి చేతి కిచ్చిన ట్లయినది. "మన్త్రభేదం న ప్రకాశయేత్" అనుటవలన వీనితో మునుపటికన్న నెక్కుడు స్నేహ మొనరించు టట్లుండ, నీమనోరథంబు వీనివలన నెఱవేర్చికొనఁ బ్రయత్నింప వలయు. (ప్రకాశము) చేయి వట్టికొని

సఖా—శా. ఏ వైదేశికుఁడవె, చిరమ్మునకు నా కీవీట నీ వెట్టులో
దైవప్రేరణ మిత్ర మైతివి, సమత్వం బాపదన్ సంపదన్
భావింపన్ దగు మైత్రి యున్నయెడ, నాభావంబ నీభావ, మెం
దే వే ఱొకతి నూహచేసెదుసుమీ ? దేహం బొకండుఁ వినా.

విదూ—కవిశిఖామణీ! రహస్యగోపన మొండుదక్క, నావలన మీ కేకార్యమ్ము గానున్నను నయ్యది సాధ్యాసాధ్యవిచారమ్ములేకయే సమకూర్చెద. నిందులకుఁ బ్రమాణ పత్రికఁ గూడ నీయఁ గలను.

రాయ—చెలికాఁడా!

తే. తనరహస్యంబు నొరులు కైకొనక యుండ, డాఁచుగతి నెవ్వని దెవండు డాఁచునో? వి
ధాతృసృష్టిని వారలే తగుదు రయ్య, మూల్య మగుమిత్రశబ్దార్థమును వహింప.

విదూ—మహాభాగ! తమరు వచించినట్లు తనరహస్యముంబలెనె నితరుని రహస్యమును గాపాడువాఁడు వానికి మిత్రుఁడే యైనచో, నేను నారహస్యమువలెనే యితరుల రహస్యమును గాపాడ నేర్తు.

రాయ—(నవ్వి) "మరువవదశివరేషుజలం" అనునట్లు "నారహస్యమునుం గాపాడుకొననేర నే నొరులరహస్య మంతకంటెఁ గాపాడ నేర" ననియా యేమి నీయభిప్రాయము ?

విదూ—మీపాండిత్యము రేపు ఘోషాదర్శనమునకు వెళ్లినప్పుడు చూపుకొనుఁడు; నా యొద్ద మాత్రము ప్రకటింపకుఁడు. అంతగీర్వాణ మెందుకయ్యా మాటలాడునప్పుడు? తిన్నగా మాటాడ రాదాయేమి ?

రాయ—(తనలో)వీఁడిక నెంతవిసరికొట్టినను గొట్టినవాఁడే. అయిననేమి, "కోగ్యార్థినఃకుతో గర్వః" అనికదా మన మిప్పు డూహింపవలసినది (ప్రకాశము) గీర్వాణమైనను ఇది సర్వసాధారణమైనమాటయే, ఎడారులయందుం బలె నుశీవరదేశముల యందు జలము కలదు; అనఁగా, నక్కడను నిక్కడను గూడ లేదనియభిప్రాయము.

విదూ—ఇప్పుడు తెలిసినది. ఒకరిమాట కేమిగాని నామాటనైనను నితరులతోఁ జెప్పనుంకుట నేర్చికొనుటకుఁజిరకాలమునుండి యత్నించుచున్నాఁడను. ఇందునకై ప్రత్యేకించి మూఁడుసారులు కాశికి వెళ్లి వచ్చినాఁడను. ఎంతపరిశ్రమ చేసినను క్రియమాత్రము కట్టినది కాదు; ఇందునకేకదా, తమతో స్నేహము చేయుటకుఁ బ్రతిదినమును వచ్చుచున్నాఁడను? పోనిండు వృధకాలక్షేపము చేయించుచుంటిరి కాని నాకీ నువుగింజలో నోటి నానననీయలేని లోపమును వారించునుపాయమును దెల్పకపోతిరి గదా, అట్లయినచో నియ్యెడ మీ కెంత యుపయోగించును జెప్పుఁడు?

రాయ—(దైన్యముతో)

తే. హాస్యమున కిది వేళగా దని యెఱుఁగవు, వంతరంగమ్మునఁ గలచింత యెఱుఁగు
దేను వైదేశికుఁడ దిక్కు లేనివాఁడ, నని యెఱుంగుచు విటు లేఁచ నగునె నీకు.

విదూ—ఓహో! యిదిమతియుం బాగుగ నున్నది. ఘోషాసూఁతురఁట! బోడిబాపఁడఁట! యెక్కడి కెక్కడ! నక్కెక్కడ! దేవలోక మెక్కడ! యెవ్వరు విన్నను నోటితో నవ్వరు.

రాయ—(గడ్డముపట్టికొని) బిగ్గరగా నఱవకుము, ఇది యెవ్వరెందునను వినవలయును.

చ. కమలిని కర్కుఁ డెట్టిచెలికాఁడు? కుముద్వతి కబ్జుఁ డెట్టిచు
ట్టము? విరిదీవ కెక్కడికటాక్షము భృంగముపై? నొకొక్కచో
నమరు నొకొక్కచూ, పతివలైనను బూరుషులైన నెందుఁ బ్రే
మము గలచోట లేమి యనుమాటటు లుంచుము గాంచి రెడ్డియుక్.

తే. వంకరగుమాత్రఁ జందురువానికేమొ? చెఱకురుచి కణుపులకల్మిఁ జెడునె? శబ్ద
దోషమున గీతి కెందేని దోసఁగుగలదొ? దయితుదారిద్ర్యమున వచిత్తము విరచునె

విదూ—మీచదువున కంతకును ఫలితార్థము నేను సౌందర్యవంతుఁడగు పండితుఁడను కవిని గనుక నన్నాకన్నియ విధిగా వరింపఁగలదని తేలినది. తథాస్తు. అట్లే

కానిండు, మాటలకేమి? కొనితే నక్కఱలేదుకదా. వెఱ్ఱిచదువు చదువక నే నడుగు మాటకు సదుత్తరము చెప్పుఁడు. మీలో మీ రిట్లు సొలుత్రావుమాత్రమేనా ? లేక మీ కెక్కతమునకైన నప్పద్మాక్షియభిప్రాయంబు పొడకట్టెనా ?

రాయ—(కొంచెము ధైర్యముతో) అట్లడుగుము వృథాకోలాహలమ్మునకు మొదలుపెట్టి మిత్రకార్యవిఘాతుకుఁడవు కా నెంచకుము.

ఉ. మాడుగుమీఁద నుండి నను మానిని ప్రేమరసమ్ము చిల్కుచుఁ
జూడని దాడ్కెఁ జూచె నిది సూచనయౌఁగద ? యింతమాత్ర నే
నీడిగిలఁబడఁ ; విను మిదేగదు జాతకమందుఁ గొంత యీ
జాడ లిఖించెఁ దండ్రి ; యని సాయ మొనర్చెడి దీనికిఁ సఖా.

విదూ—అట్టిగట్టినమ్మికమీ కున్నదో నీనాఁ డొకపరి యానాతిదృక్పథమ్మున మిమ్ముం బడవైతునా? పిమ్మట మీయదృష్టము. నా చేయునుపకార మింతకు మించి యుండదు.

రాయ—(అభిలాషతో) సఖా ! అది యెట్లు సంఘటించెదవు ?

తే. మగల నొకపరి నాకు నమ్మగువమ్మిన్నఁ, గనెడిభాగ్యమ్ము ఘటియింపఁ గలిగె దేని
జాలుఁ దన్మాత్రమునన నాజన్మమునకుఁ, దగినఫల మందినంతసంతసము గాంతు.

విదూ—(నగుచు) ఇవి యేటిమాటలు ? దర్శన మైనపిమ్మట స్పర్శనము కావలయునందురు; అదియునైన మఱియొక్కటి లోటగును. ఎవ రెఱుగని వీమాటలు.

రాయ—చెలికాఁడా ! అంతవఱకేలగాని,

తే. యవనినవనీతసమతాపయమనిరమణి, శోహితుపింయనునమ్మతో క్తులొప్పులొలుకఁ
గమనుఁగా నెంచి యెవనియంకమునఁ గులుకు, సుఖము లెల్లను వాని నే సుము జగాన.

విదూ—ఁరే, ఇక్కడికిఁ దేలినది. "చల్లలేక పొమ్మన్న, పెరుగేని యువడ్డింపు" మన్నట్లున్నది. అప్పుడే యెంతవఱకు వేకినదో చూడుఁడు మీ కరాశాపిశాచము ?

రాయ—(సంశయముతో)

చ. ఎఱుఁగుదుఁ జక్రవర్తిసుత యెక్కడ! యెక్కడి నే నటంచు, మీ
రెఱుఁగుదు, మంచిచెడ్డ లవియెల్ల నెఱుంగుదు, నైన నేమి? నా
యెఱుక యడంచి కోరిక లనేకములై మన మత్తలోదరీ
పగ మొనరించె, నెట్లయినఁ బ్రాణము దక్కుట దుర్లభంబిఁకన్.

విదూ—(తత్తరపాటుతో) ఓవిశ్వస్తత్తేభమా ! మీప్రాణమునకు నాప్రాణ మడ్డునైచెద. మీ కింక నధైర్యమెందులకు?

రాయ—పరోపకారస్వభావముగల యోపిచ్చివాఁడా ! నాతాత్పర్యము చక్కఁగా దెలిసికొనుము.

తే. అత్తలోదరిపొందు కా, దయిన నగును, నుభయపక్షములను బ్రాణ మూడు నిజము
మస్తకుం డాద్యపక్షాన మరణహేతు, వన్యపక్షమ్మున నిమిత్త మవనిభర్త.

విదూ—(గర్వముతో) నాకు మీయభిప్రాయమునుం దెలిసికోలేకపోవుట యనునపయశం బొకటియా ? పిరికికవీశ్వరుఁడా ! నేనుండ ఘానుషాగాని గీదుషాగాని మస్తకుఁడుగాని గిస్తకుఁడుగాని నీమేన వ్రాలిన యీఁగకైన నపకృతి యొనర్పఁ గలుగునా ?

రాయ—(తనలో) ఏమి వీనిప్రాగల్భ్యము. పరిహాసస్వభావమున ననియెడిపిచ్చిమాటలు కావచ్చును. ఏమో ! అన్నియునునట్లుండు ననియును ననుకొనఁగూడదు; కాని నమ్మకము మాత్రము కుదురదు. "హాస్యగానికిఁ దేలుగుట్టి" నన్నట్లున్నది. కానిమ్ము. మాటలసందర్భముంబట్టి చూచిన నిజ మెంతో తెలియకుండెడినా ! (ప్రకాశము) ఘానుషాయొద్దఁ జనవుండుటంబట్టి యతనివలనం గాపాడినను గాపాడుదువుగాని మస్తకుఁడు నీకెట్లువశుఁడగును.

విదూ—(తనలో) ఇఁక నాయెఱిఁగినవిధమ్ము చెప్పి యితనిం గొంత యూరించెదఁ (ప్రకాశము) అపరమన్మథావతారుండ వనఁదగినయోపండితాఖండలా ? నిన్నొక సారి తనయుద్యానవనమ్మునకుఁ దీసికొనిరమ్మని నీమనఃప్రేయసి యిదివఱకే సఖీ ముఖమున నన్నుఁ బ్రార్థించుచున్నది.

రాయ—(తనలో) ఇతనిమాట లెంతవఱకు సత్యములో నిర్ణయించుట కడుఁ గష్టము కదా ? (ప్రకాశము) సంతతపరిహాసాదరముగలయోమిత్రమా ! నీమాటలు నేనే వనినమ్మ నేర్తును.

ఉ. ఇంతకుముందుఁ గొండొకయు నీవిషయమ్ము నెఱుంగ నట్లు నా
చెంతనటించుటే ? మిపుడు చెప్పెడిమాటలచంద మేమి ? యా
వంతయు నీనువాక్యములయందలియర్థ మెఱుంగఁజాల, న
న్నింతకుఁ బాల ముంచెదవొ ? యేటను ముంచెదొ ? నీయధీనుఁడన్.

(తన్నుద్దేశించుకొని)

ఉ. ఎక్కడివేఁగి దేశ ? మిట కేటికి వచ్చితి ? నెందుకోసమై
యక్కట ! యిప్పు డిక్కరణి యత్న మొనర్చుచునుంట ? ఘానుషా

యెక్కడ? కూఁతు రెక్కడ? మహీసురవంశకళంక మైన నే
నెక్కడ? నాదుపాండితి యదెక్కడ? మోహ మదెంతకున్ దగున్.

(నిట్టూర్పు నిగిడించి)

చ. కులము నతిక్రమించు టొకగొప్ప గదోఁచ దఖండపాండితిన్
గలిగిన తెల్విఁ బోనడఁపఁ గల్గుట కాదొకగొప్ప, మానమున్
దొలఁగుట కార ముందడుగు దూఁగెడిఁ బ్రాణము గడ్డిపోఁచకున్
జాలుకనయయ్యొ నిత్యయౌవనసుందరినిన్ దరమే నుతింపఁగన్.

విదూ—ఓహోహో! యివియేటిమాటలు? నాలుక చిగురునుండి వచ్చెడివో? లేక నాభీస్థానమునుండియే బయలు వెడలినవో? చతుస్సముద్రముద్రితధరావలయమ్ము నేకచ్ఛత్రమ్ముగా నేలు భూపాలకుఁడగు తనంతట పిలువనంపె నన్నమాట యీకులగోత్రములన్ దెచ్చిపెట్టినయది కాఁబోలును.

రాయ—మిత్రమా! మఱియొకలాగున నూహింపకుము.

చ. జప మడఁచున్ దప మ్మడఁచు సత్య మడంచు నడంచు యోగ్యతన్
జపలతఁ బెంచుఁ బెంచుఁ నలసత్వ మగర్హితమేని కామ మ
న్నపు, డగర్హిత మ్మయినయయ్యది యెయ్యది సేయ నోప, దే
వపుగను లైనకాంతలకె వంగుచుందురు యోగులందఱున్.

ఉ. కట్టియ లన్న బంగరువుకన్నను నెయ్యెడ మేటి, యింక నే
పట్టనమందు నేఁ డొకబ్రాహ్మణుఁ జూడరు నీటికన్న, ని
క్కట్టులకున్ నివాస మవఁగాఁదగు నిప్పురినుండి మున్న నే
నెట్టిప్రయత్నమున్ సలిపి యేమిప్రయోజన? మేగనైనఁగా.

విదూ—ఇంతమహైశ్వర్యమ్మునకు నోఁచి యందఱవలె వచ్చినత్రోవ నెట్టులేగను?

రాయ—(సిగ్గుతో) ఏ మట్టులంటివి? మన కిప్పుడబ్బిన మహైశ్వర్య మేమి?

విదూ—ఏమా? భగవంతున కైనను దుర్లభం బనఁదగు మాభాగ్యసాదర్శనంబు కానుండు టట్లుండ నేరికి నలభ్యమ్ము లగు నాయనకొమిరెచూపుగోపులను నభాగ్యగుండవై యిప్పుడో యిఁకనో యఖండసామ్రాజ్యపదవి నందనుంటివి. పైపెచ్చు మంచిమంచిపక్వాన్నములతో ఘృతకుల్యలును దధికుల్యలును నగునట్లు మునిఁగి తేలుచుంటివి. పుచ్చె పూసినదాయేమి? ఇంతకంటెఁగావలసిన దేమి?

రాయ—(చిఱునవ్వుతో) ఆద్యంతములు నీవు చెప్పినటులే కావచ్చును; కాని యొక యనుభవమును వచించుచున్నాఁడను. ఈజగత్స్వభావ మేమో! “ ఆకసమునఁబువ్వ

లున్నవా ?" యని యడుగ "లే" వనరు సరిక దా "అయ్యవి సర్వసామాన్యపుష్పముల వంటివి కా"వనియు "వానితావి యంతకన్న విలక్షణ" మనియును దేగ వర్ణించి పృచ్ఛకు నభినందింపఁ జేసి కొండ నెక్కింతురు. ఇయ్యెడ నొరులదోస మేముం డును ?

మ. తనయర్థించినదానికిఁ దగినచంద మ్మెవ్వఁడే నాడు వా
నిని నమ్మఁ మనసొప్ప దైనతఁడే నెమ్మిఁ జనింపంగ నే
ర్చు నొకం డెవ్వఁడుగాని దాని కతివైరుధ్యమ్ము మై నిక్కమై
నను జెప్పఁ బ్రతిమాలుఁడా మనసుకన్నఁ వక్ర మొం డున్నదే.

విదూ—నే నెంతపరిహాసస్వభావముకలవాఁడ నైనను నిప్పట్టున యథార్థపరిహాసకునిగా నన్నువిశ్వసింపుఁడు. మీ రిట్లు వెనుకకు ముందుకు నుయ్యెలలూఁగు చుంటిరి కాని నిష్కళంకహృదయుఁడైన మహానుభావుఁ డితఁ డొక్కఁడే యని నాయశస్సు జగములఁబడి వెలుగుచున్నయది. మీ కంతనమ్మిక లేనిచో నన్నుఁగుఱించి యెవరి నేని కొంచెము ప్రశంసించిచూడుఁడు. నాకుజ్యోతిశ్శాస్త్రమునఁ బూర్ణపాండిత్యము. అందులోఁ బ్రశ్నభాగము మఱియును ముఖ్యమైనది. విచారించిచూడఁగా నక్కన్ని యమిమ్ము మన్నించుననియు భోగసామూడఁ గిక్కురుమనక యంగులకంగీకరించునని యుం బొడకట్టినది.

రాయ—(నవ్వి) మిత్రమా ! నీవు ప్రశ్నశాస్త్రమునఁ బండితుఁడవు కదా. నేను ని న్నడుగనిదే యెట్లు విచారించితివి ?

విదూ—ఇది మఱియుఁ జక్కగానున్న దే. ఇంత సేపటినుండి వెల్లఁ బోసినసోదె యంత యు నేమాయె ? నన్నే నే నెఱుఁగను. ని న్నెల్లెఱుఁగుదు నన్నట్టు లున్నది.

రాయ—అది కాదు. ప్రశ్నకు దక్షిణాతాంబూలసహితముగా వచ్చి కదా పృచ్ఛ చేయ వలసినది.

విదూ—ఇదా ఇవి యన్నియును దానివలన జీవించుమీవంటికుక్షింభరులకుఁ గాని జగ దేకచక్రవర్తి యెవరో యెఱుఁగనివారు సహితము నన్నెఱుఁగునట్లు ప్రభుత్వ మా చరించుమహారాజను; నాకా ?

రాయ—ఎన్నివిధములఁ జూచిన నొకమాటయైనఁ బరిహాసములేక చెప్పవు కాఁబో లును, ఐన నేల కా దనవలయును. "మంచిమాటలకుఁ జెవు లొగ్గవలయు" నని కదా పెద్దలు చెప్పుదురు, కాని

క. జాతియు నొక్కటి కాదఁట, నీతియునున్ భిన్న మఁట గణింపఁగనతఁడే
కూఁతు న్నాకిడు నఁట యిది, యేతీరున నమ్మవచ్చు నెవరు నుడివినన్.

విదూ—ఓహో! యింత వెఱ్ఱివానిని నే నెందును జూడ లేదు. మీశాస్త్రిపాండిత్య మే మైనదయ్యా? మొదట స్త్రీపురుషులకుఁ బరస్పరజాతిభేద మున్నదా? లేదా? అట్టివారి కెట్లు నైక్యము ఘటించుచున్నదో?

రాయ—చెలికాఁడా? చక్కఁగాఁ జమత్కరించితివి. చను వుకొనిన ... నెంతబుద్ధి మంతుఁడవేని యగుదువు.

విదూ—చమత్కరించు టే యనుకొంటిరాయేమి? మనకు వారితో సంబంధముతగునా? యనిసంశయించుటకు మాని "వారు మనకుఁ గన్నియ నిచ్చుట కంగీకరింప" రనుట కేవలము పొరబాటు.

రాయ—అగును; నీవన్నమాట సత్యమె.

కం. మనలోన నన్యవర్ణమ్మునికికి నంగీకరింప, మొకఁడెల తమం
తన యెల్ల కులములను బ్రయ,తనమునఁ గలిపికొన నెంత్రు తారు తురుష్కుల్.

విదూ—వహ్వా! మీకును మంచిలోకజ్ఞానమే యున్నదే? మీదియంతయుఁ బురాతనపు ఛాందసపండితులవైఖరి కాదు.

రాయ—మన కనియు నంతదూష్యము కాదుసుమా.

తే. శూద్రకన్యకఁ దనుకనచూపె మనువు, వెంకటేశ్వరుఁ డంతటివేల్పు యవన
కన్యకను బెండ్లియాడి మార్గమ్ము వెట్టె, పుడమివేలుపు లంత కెక్కుడె తలంప.

విదూ—భేష్ ఇఁక నేమి? శాస్త్రముకన్న మనకుఁ గావలసినది శిష్టాచారమే కదా? ఇందు సందియ మెక్కడ?

రాయ—ఎక్కడనా?

తే. శాస్త్రములు నుండు నాచారసరణు లుండు, లేక యుండిన నిపుడు గల్పింప వచ్చు
మొదటఘటనంబు నిక్కమై మొన సె నేని, యడ్డు నేయవి ?యటసందియమ్ము గాని.

విదూ—ఘటనంబునకుం గాక యక్కన్నె ని న్నేల పిలువ నంపించెనో?

రాయ—మిత్రమా!

మ. పిలు పే సందియ మంత నిక్క మయినన్ వే ఱెవ్వరిం గూర్చియో
కలయే గంటినొ నాముదమ్మునకు బొంకన్ బూనితో మింటఁ బూ
వులు జన్మించునె? యొండమావుల జలంబున్ గల్గునే? గర్భరి
క్తుల కెల్లన్ దలమానికంబ నగు నాకుం గోర్కు లీడేఱునే.

తే. పుట్టు నంతంతన యడంగుఁ బొడము మరల, నంతలోనన నశియించు వింతకోర్కె
లల్పదరిద్రుల కెందు బాల్యమునఁ గురుల,కుం జెడినకులకాంతలకులుకు లట్లు.

విదూ—మీ రీసంశయము లిట్లు వెళ్లఁ బోయుచునే యుందురు. నాకు భుక్తికివేళ కావచ్చినది. “ఈనాఁటిసాయంకాలమునకు మిమ్ము వెంటఁ బెట్టుకొనివచ్చెద” నని రాకన్నియకు వార్త నంపించెదను, (తెరవంకఁ జూచి) మీశిష్యుఁడు మిమ్ముస్నానమునకు లెం డనుటకుఁ గాఁబోలును వచ్చుచున్నాఁడు.

(శిష్యుఁడుప్రవేశించి)

శిష్య—(తనలో) ప్రతిదినమును నీవేళకు నభ్యవహార మగుటయే కాక యొక్కింత విశ్రమించుట గూడ నయ్యెడిని. ఈదిన మీవఱకు స్నానమునకే లేవక ప్రచండమిశ్రునితో నేదియో యాలోచించుచుఁ గూర్చున్నారు. పోయి విన్నవింతునా? పదార్థములు చల్లనారిపోవుచున్నవి. ఇంకను పార్థివలింగార్చనము మిగిలియే యున్నది. (సమీపమునకు వెళ్లును)

రాయ—(విదూషకునితో) మావిద్యార్థి వచ్చుచున్నాఁడు. ఇఁక నీప్రసంగము మనకుచితము కాదు. అట్లే యొనరింపుము పొమ్ము. (శిష్యునిం జూచి) ఇదిగో వచ్చుచున్నాఁడను నివు రానక్కఱ లేదు. వెళ్లుము.

చి—శిష్యోత్తమా. ఇంకను దమరు యమునకు దయచేయవలయును గాఁబోలును. పార్థివలింగార్చనకుఁ బుష్పములు సిద్ధము చేసియుంచితిని.

(నిష్క్రమించును)

విదూ—(మెల్లఁగా) మీ రీవిద్యార్థుల నెందునకుఁ దీసికొనివచ్చినారు? వీండ్రు మీ సాయంకాలపుఁ బ్రయాణమునకు నంతరాయము గాకుండమాత్రము చేసికొనుఁడు. నేను బోవుచున్నాను (నిష్క్రమించును).

రాయ—(తనలో) నాకు స్నానమును దోఁచదు పానమును దోఁచదు. వీఁ డతివంచకుఁడు, అయినను గడునమ్మికగలవానివలెఁ జెప్పుచున్నాఁడు. ఏదో వీని యొద్దకుఁ గొంచము నావిషయమై వార్తమాత్రము వచ్చియుండుట తప్పదు. లేనిచో నంతఃపురజనులు సంచరించునుద్యానమ్మునకుఁ గొంపో నేర్చునే. కానిమ్ము “యద్భావి తద్భవత్యేవ” (నిట్టూర్పునించి)

ఉ. ఈవిషయమ్ము మానుకొనుటే కడుసౌఖ్య మటంచు నెంచి లో
నావిధి చేయ నిశ్చయము నందినయంతన మోహ మగ్గలం

బై వెనువెంట నంటు నటు లైనను జేయుదు నన్నఁ దోడనే
భావము వేనవేలు ప్రతిబంధకముల్ గనఁ జేయు నద్దిరా.

(నిష్క్రమించును).

గద్య.

ఇదిశ్రీ...తిరుపతివేంకటేశ్వరవిరచితంబగుపండితరాజమ్మున

ద్వితీయాంకము.

# తృతీయాంకము.

(తెరలో)

మ. అదె సంధ్యాసతి సానురాగ యయి తా నయ్యర్కు వెన్గొందె నె
మ్మది దానిన్ గుఱియించెనో? యనఁగ సంబంధించెఁ దాద్భృత్యుఁడై
యదనన్ వమ్మొనరింప కర్యముఁడు, తా నవ్వారిమోహంపుసం
పద సూచించెను నాఁగఁ జీఁకటియుఁ బర్వెన్ జొచ్చె నల్దిక్కులన్.

ఇదిమాలిక.

(అనంతర ముద్యానవనములో లవంగియును, జెలికత్తెయగు మల్లికయును, రాయలును విదూషకుఁడును వెనువెంబడి చెఱియొకచోటుగాఁ బ్రవేశింతురు.)

లవం—(తనలో) హృదయమా! కాల మతిక్రమించుచున్నయది. ఇఁక నీయాశ నిరాశ యగుటకేమి సందియము. (ప్రకాశము) చెలీ! మన మీపాటికి వెనుకకేల మరలఁ గూడదు?

మల్లి—ఏమి యీనాఁ డింతతత్తరపడియెదవు? మనప్రచండమిశ్రుఁ డప్పండితసార్వభౌము నియ్యెడకున్ దోడ్కొని వచ్చువేళ కావచ్చినది. ఇఁకఁ గొండొక తాళి పోవుదము.

రాయ—సఖా! అటు గనుఁగొనుము.

ఉ. చీఁకటి పోవుచున్నయది శీతకరుం డుదయించుచున్నవాఁ
డేకడఁ జూడ వెన్నెలలు హెచ్చఁ దొడంగె నిఁకేటిమాట యా
కోకకుచం గనుంగొనెడికోర్కె ఫలించునె? యింతసేపు తా
రాకెటు లూరకుండు ననురాగము గల్గుట నిక్కమేనియున్?

విదూ—మన మిప్పుడకదా! యిందులకు వచ్చితిమి. ఇంతలోనే యింతతత్తఱపాటా? ఎంతయనురాగము గలదైనను బ్రథమసమాగమమున "భర్త నెదుర్కొనవచ్చు" నని నేను విన లేదు. మీరు మహాకవీశ్వరులు మీ రెక్కడ నేని యట్లు చదివి యుందురేమో!

రాయ—సఖా! నాతాత్పర్యము చక్కఁగాఁ దెలిసికొనక యేల వృథాపరిహసించెదవు?

తే. సంజప్రొద్దున నిటకు నన్సకియ తోడి, తె మ్మనుచు నీకు వార్త నందించెనంటి
వదియ నిజమేని యబల దా నంతకన్న, మున్న రావలె నదియ ప్రేముడికిగుఱుతు.

విదూ—వచ్చియే యుండును గాని యెయ్యెడల నేవినోదమ్మునఁ బ్రొద్దుపుచ్చుచున్నదియో? నలుదెసలు పరికించినఁ గాని మన కేట్లు తెలిసెడిని?

రాయ—ఇంతవఱకుఁ ద్రిప్పినది చాలకా యేమి?

విదూ—ఇది యంతయు నాకే యుపకారముగా నున్నదే.

రాయ—(తనలో) వీని నూఁతఁ జేసికొని యిమ్మహావిషయమునఁ బ్రవర్తించుట గొఱ్ఱె తోఁక పట్టుకొని గోదావరి కడ్డపడిన ట్లున్నది. (ప్రకాశము) త్రోవ దీయుము నీవెంబడి వచ్చుచున్నాను.

విదూ—ఇదుగో యీసంపంగివృక్షములచాలు ననుసరించి పోవుదము (పరిక్రమింతురు)

లవం—(తనలో) ఓహో! యేమి యీవెన్నెలలు నాకు మిగుల నవశత గలిగించు చున్నవి. వీనికిఁ దోడు డీమలయానిలము లెందులకో (నిట్టూర్పుపుచ్చి ప్రకాశము) చెలీ! స్వప్నము నిజ మని యెంచికదా మన కీవెఱ్ఱియడియాస.

మల్లి—ఏ మట్లనుచున్నావు? ఇంతలో నసత్య మేల కావలయును?

లవం—నిశ్చయముగా నసత్యమే కాని స్వప్న మైనతత్క్షణము మాత్రము నిగుర లేచు లోపల నంతయుఁ బ్రత్యక్షానుభవమువలెఁ బొడకట్టెను.

మల్లి—అగునుజుమీ నాటకముగూడ నిదేమాదిరి; చూచు చున్నంతసేపు నిజ మైన కథానాయకులు సుఖదుఃఖము లనుభవించునట్లు యాత్మ తన్మయమై తదనుగుణ భావమ్ము లనుభవించును. పిమ్మట నిట్టులే క్రమముగాఁ బరిణమించెడిని.

లవం—నాటక మనిన వేలే యున్నదా మనబ్రతు కంతయు నిట్టిదే; ఐనను నేదో శాశ్వత మని వెఱ్ఱివెఱ్ఱిప్రయత్నములు సలుపు చుందుము. తనకు పైత్యభ్రమము గలిగి జగముదిరిగినట్లు బొడకట్టినను నిజమున కయ్యది నిశ్చలమే సుమా,

మల్లి—అట్లేల యనవలయును? ప్రాప్తికాలమునకుఁ గాక తాళీయమ్ము కాఁగూడదా? అది కాక నీవంటిజగదేకసుందరిచే స్వయముగ నాకాంక్షింపఁబడియు వికృతి నొంద కుండుటకు నాయన మనం బేమి శిలయా?

లవం—(కోపముతో) దుర్మార్గురాలా! అయ్యవకుు నట్లేల యనవలయును.

ఉ. జననము నందితేని గదుఁ బ్రశస్తము గాని తురుష్కజాతియం దనసుకులోద్భవుం డతఁ డహో! యెటు నాచపలాంతరంగన ర్తన కనుకూలుఁడౌ? నిది వృథాశ్రమ మింతకుఁ దారతమ్యముల్ మన మెఱుఁగంగ నీయ దనుమానము మాన దిఁ కేమి సేయుదున్.

మల్లి—సఖీ! యింకను గాలాతిక్రమణమ్ము కాలేదు. నీ వేల యిట్లుత్తలపాటు చెందెదవు. ఈవఱకే మనప్రచండమిశ్రుఁ డయ్యనఘుం దోడ్కొని వచ్చి యుండవలెను. నిన్నిదివఱకే యాతఁడు చూచి విరాళి గొని యున్నవాఁ డనికదా నాతో నాతఁడు చెప్పి యున్నాఁడు. నిన్నెందులకు వృథా నిందించికొనియెదవు. ఈక్రీడాసరోవరము నొద్దున నుండి నలుదెసలు నిరీక్షింతము రమ్ము (అట్లొనరింతురు)

రాయ—(విసువుతో) నన్నుఁ గుజనునిగా నూహించి కాఁబోలును మిన్నక యీకుజానులవెంటఁ ద్రిప్పుచున్నాఁడవు. నీవెంట వచ్చినందుల కీప్రాయశ్చిత్తము నాకుఁ గావలసినదియే.

విదూ—ఓహో! ఇది మఱియుం బాగుగ నున్నదే. వచ్చినది యుద్యానవనము కదా? ఎయ్యెడల నేక్రీడామృగమ్ములఁ గాంచుచు నేయేవినోదమ్ముల మసలుచున్నదియో యొక్కింత పరిశీలింపక యెట్లు కన్పట్టెడిని.

రాయ—ఇదివఱ కొకసారి యిట్లు పలికితివి. అప్పు డెందులకని యూరకుంటిని కాని యిపుడు నీరసవిహీనతకు నాకుఁ గోపము పుట్టుచున్నయది.

చ. దయితు నధీన మైనమదిఁ దాల్చు నెలంతల కెందు నెందుఁగో
ర్కె యుదయ మంద. దెయ్యెడలఁ బ్రీతి జనింపదు వేయు నేల? ని
శ్చయముగ స్వర్గలోకసుఖసంపద తా నెదు రేగుదెంచినన్
గయికొన నిచ్చపుట్ట, దొకకాంతునిసంస్మరణంబె సర్వమున్.

విదూ—అసత్యవాదు లగుమీవంటికవీశ్వరు లంతె వెఱ్ఱిగా వర్ణించుమాత్రమే కాని నిజమ్మున కంత యుం గన్పట్టను "ఇదిగో పులి యంటే, అదుగో తోఁక" యన్నట్లు ఒకరినిఁ జూచి యొకరు మఱింత యననుగుణముగ వ్రాయుదురు. కాని యవి యన్నియును ననుభవవిరుద్ధమ్ము లగుటం జేసి యనాదరణీయమ్ములు. పలువురు నెలంతలు కోరి యుండిరి కాని మీరు చెప్పినంత కాదుకదా అందులో శతాంశమేని వెఱ్ఱితనము నాకయ్యెడఁ గన్పట్టలేదు. ఇంత యేల? ఇట్లు చెప్పుచుంటిరి కదా మీ రీదినమ్మున సర్వసంగపరిత్యాగ మేల చేయలేదో?

రాయ—నన్ను నీ వేమి తెలిసికొంటివి?

ఉ. వచ్చినశిష్యులం గనియు వారికిఁ బాఠము సెప్ప నైతి లో
హెచ్చినతాపపుంగరిమ నించుకయున్ భుజియింప నైతి నా
పచ్చనివింటిజోదుపయి భారము వైచితి నంతలోన నీ
యిచ్చకము న్నిజం బనుచు నే నొనరించితి సంజ కంజలుల్.

విదూ—అవును. బీదబాపనయ్యకు రాచకన్నియ దొరకొన నున్నప్పుడు క్రోఁతికిఁ గొబ్బరికాయ సామెత గలిగినను "చూచినకళ్ల వెట్టి" యన్నట్లా పె మహారాజు పుత్రి. యేదో కారణమున నననుగుణానురాగమ్ము నందినను నయ్యది యేవినోదమ్మున నైనను మఱపుం గన వచ్చును.

రాయ—(కోపముతో) ఐనచో సమ్మతమే ఇంత యెఱిఁగి యుండియు న న్నేఁదుల కిక్కడికిఁ దోడ్కొని వచ్చితివి? కడచినదాని కేమి గాని నా కాకన్నియయు నక్కఱలేదు. మఱి యొండును వలదు నీపుణ్యమాయె నిక్కడ వేఱొండవమానమ్ము లేకుండ యథాస్థానమ్మున కైనఁ గొనిపొమ్ము.

తే. మొదలఁ బరిహాసమున కాదిమూర్తి వనుచు, ని న్నెఱింగియు నీవల నేను బడితి
దాని కేమి పురాకృత మైనకర్మ, ఫలము తప్పంగఁ జేయ నెవ్వరితరంబు.

విదూ—(వినుట యభినయించి) బ్రాహ్మణోత్తమా! ఇంచుక తడవు నైఁపుము. నే నిదె కొంచెము పోయి వచ్చెదను.

రాయ—(చేయి వట్టుకొని) చెట్టెక్కించి నిచ్చెన దీసిన ట్లిదికూడనా?

ఉ. కత్తులబోనుకన్న నధికమ్మిది న న్నిట డించి పోయి నే
వత్తు నటంచుఁ బల్కెదవు వైఖరియే యిది యెవ్వరేని న
న్నిత్తఱి నేవరుల్ గనిన నేమని యుత్తర మిచ్చువాఁడ నీ
పొత్తున ముప్పు మూఁడె సరిపో యిఁక బుద్ధిజనించె నాకొగిన్.

విదూ—(నవ్వుచు) తెలుఁగుదేశపు బ్రాహ్మణులు మిక్కిలి పిరికివాండ్రని వినుటయే కాని నేఁటికిఁ బ్రత్యక్షము కూడ నైనది. ఈఁగకైని చొరఁగ నశక్యమ్మగునంతిపురమ్మున జగదీశుపుత్రితోఁ గలయ నుంకించుచుంటివిక దా! నీ కట్టిమహాయోగము చేకూరినను "పిరికితనము తుద నెగ్గించెడినా" యని నాకు సందేహముగా నున్నయది. కొంచె మేదో అలుకుడు విన వచ్చుచున్నది చూచి వత్తు ననినఁ బోనీకున్న నే నెట్లు కార్యము పొసఁగింపఁ గలను?

రాయ—(చెవియొగ్గి) నీ కేమి విన నైనదో కాని నా కాయూతటాకమ్ములదరిన్ గూయుచున్న మండూకమ్ములును, గీమరాళ్లును దక్క వే రెయ్యదియుఁ గాన రాదు. వృథాగా న న్నిట డించి పోకుము

లవం—చెలీ? నిక్కముగా నాస్వప్నమునఁ జూపట్టిన మహానుభావుఁడు మనప్రచండమిత్రునికి మిత్రుఁ డనియేనా నీనమ్మకము?

మల్లి—సందియ మెందుకు? నిన్ను స్వప్నమున మరులుకొల్పిన యతఁడే సౌధమ్మున నుండఁగాఁ జూచి పరవశత్వము నందినట్లుకదా యాతఁడు నాతోఁ జెప్పి యున్నాఁడు.

లవం—(తనలో) ఇది యెంతవఱకు సత్య మైయుండునో! (స్మృతి నభినయించి) (ప్రకాశము) అవును మొన్న సంజప్రొద్దుల నేను సౌధాగ్రమ్మున నిలిచి యమునానదీ సౌభాగ్యమ్ము విలోకించుచుండ నెవ్వరో యొకరు మాత్ర మావీధిఁ జనుచుండిరి. నేను జూచులోపల నే నగరరక్షకు "లిది యంతఃపురపువీధి" గనుక నీ వియ్యెడ కేలకు వచ్చితివి? రాఁగూడ దని యవలకుఁ బంపిరి. ఆయన యమ్మహాను భావుఁడై యుండఁడు కదా!

తే. స్వప్నము నిజం బగుట పెద్ద సందియమ్ము, గాని నీమాట విశ్వాస మూనఁ జేయు నైన నేమి ఫల మ్మమ్మహామహుండు, సమ్మతించుట తెలియ దోసకియ మనకు.

మల్లి—స్వప్నమును నిజమే. పదపడి విన్నసంగతిం బట్టి నిన్నాయన కామించుట యును నిజమే, ఒక్కింత తాలిమివేని సమాగమానంద మనుభవింపఁ గలవు.

రాయ—ఏదో వినవచ్చిన దంటివి. అది యంతలో నేమి యడఁగి పోయినదా. మరల విన రాదేమి?

విదూ—విన రాదేమి? నా కింకను విన వచ్చుచు నే యున్నది. ఏదో పెద్ద ధ్యానము మనస్సులో నుండుటచే మీకుఁ గాన రాకున్నయది. నన్ను విడిచినచో దాని నిశ్చయము తేలఁ గలదు. లేనిచో మన మొకచోట వెదకిన వార లొకచోట వెదకుచుందురు. తుదకు కార్యము చెడిపోవును.

రాయ—ఏ మైననను సరే. నేను మాత్రము నిన్ను వదలను. నీవెంట నే వచ్చెదను. తీసికొని పొమ్ము.

విదూ—(తనలో) ఇతనికి పిరికితనమ్ము మఱింత హెచ్చించెద (ప్రకాశము) ఇది ఘాఁటుపా విహరించెడియుద్యానవనము కొంపతీసి యొకవేళ వచ్చి ఆయన విహార మొనర్చుచుండె నేమో? మిమ్ము నావెంటఁ దీసికొని పోయిన నాకునుం గూడ మెడ మీఁదికి రాదా?

రాయ—ఓహో! ఎంత మోసపోతిని "నర్థ్య త్యనాయకు కార్యం తత్కో వో నత్తి నాయకం" అన్న ట్లయినది. ఉన్నత్రప్రాయుఁడ వగు నీవలన నా కట్టియవ మానము వచ్చినను యుక్తమే. అయినను నియ్యెడ నీదోసమేమున్నది? నావిధి యి ట్లున్నది.

మ. శిరసే యూడెడినో? శిరోజములకే చేట్పాటు వాటిల్లునో?
మరియాదే చెడునో? మ ఱేమి యగునో? మానానకే మోసమో?
పరమే వోయెడినో? యిహంబె తెగునో? పాపంబె చేకూరునో?
పరకీయాసుఖవాంచలోన నను దూర్ప న్నేఁడు మేలే? విధీ.

విదూ—ఊరకే యన్నాను గాని మిమ్ముఁ జూచినను వారేమి యను నవరు. మీరనిన నెంతో ఘనుమహాగారికి గౌరవము. మీరె వారని యెఱుఁగకున్నలోటు తీర్చుటకు నేనుండియే యున్నాఁడను గదా

రాయ—ఛీ! అడుసుఁ ద్రొక్క నేల? కాలు కడుగ నేల? నీవు సంకేతము మఱి యొక్కచోట నెంచుక కేర్పాటు చేయఁ గూడదు.

ఉ. "స్త్రీలకుఁ దక్క వేఱొకరు చేరఁగ రాని ప్రదేశ మంచు నీ
వేల యెఱుంగ? వియ్యోడను నేటికి వచ్చితి" వంచు నెవ్వరే
దూలఁగ నాడ నుత్తరము దోఁపమిఁ గలిడి సిగ్గుకన్నఁ బ్రా
ణాలకు భంగ మన్నది ఘన మ్మగునే యభిమానశాలికిన్?

విదూ—అందుకే మొట్టమొదట నొక యాలోచన చేసినాఁడను; గాని చేయనిది యిప్పుడు చెప్పిన లాభ మేమున్నది, !

రాయ—అది యేమి యాలోచనము?

విదూ—చిన్నయుపాయము చేసినచో మీకును నాకునుం గూడ భయ ముండక పోవును. దానికే మంతవిశేషప్రయత్న మక్కఱయే లేదు. ఒక గాగిరాయును ఒక త్రైంకయుఁ గండువా యును ఉన్న సరిపోవును.

రాయ—అప్పుడు మాత్ర మియ్యంగన యెవ రన్న నేమి చెప్పఁ గలవు?

విదూ—ఇప్పుడు మీతో నేల చెప్పవలయును? ఏదో నాపాట్లు నేను పడఁ గలను "నాయుంపుడుకత్తె యొకసారి యిక్కడకుఁ దీసికొని పొ" మ్మని కోరిన దన్న న న్నేమి యనక పైపెచ్చు మనయిరువురం జూచి కొంతసే పెంతో యానం దించును. ఇది వఱకిట్టి గండము లిక్కడ నే నెన్ని తప్పించుకొనలేను?

రాయ—ఛీ! మూర్ఖుఁడా.

చ. గెలిచితి నెల్లపండితులఁ గీర్తి వహించితి నెల్లదిక్కులన్
గులమున వర్తనమ్మునను గొంకొకయించుక లేనివాఁడ ని
త్తలఁ పొకఁడే కళంకమును దార్చిన దార్చెడి నిట్టిన న్నిటుల్
పలుచఁగఁ జూచి చుల్కనకుఁ బాత్రునిఁ జేయఁగ నీకుఁ బాడియే.

విదూ—సర్వము నెఱింగినవారలయ్యు నిటేల కోపగించెదరు? కార్యావసరమ్ముల పట్ల నప్పటి కనుగుణమ్ముగ మెలఁగుట గౌరవభంజకమ్ము గానేరదు. వసుదేవుఁడు గాడిదకాళ్లు పట్టుకొనుట యెవ్వ రెఱుఁగనిది.

రాయ—(శాంతించి) అగును "భక్షితేపి లశునే న గోగశాంతిః" అన్నట్లిన్ని పాటులు పడినను ఫలకారి గాని యప్పు డెందుల కీయవమానములు?

చ. తురకది యంట విప్రుఁ డఁట దుర్జనుఁ డౌకవి యంట దానికై
పరు వెడసేసి తాఁబడనిపాటుల కెల్ల సహించె నంట త
త్తరపడుమాత్రమే తనకుఁ దా నదియుఁ గా లభియింప దంట యం
చఱతురు లోకు లిట్టియడియాసయుఁ జెల్లునె నన్నుఁబోటికిన్.

విదూ—(నవ్వి) ఆర్యవర్యా! నిక్కముగ నీయుద్యానము ఫాౘషా రాఁ దగినది యనియే నమ్మితిరి కదా అంతచక్రవర్తికి నెన్ని యుపవనము లుండునో మీరాలో చింప రైతిరి. అంతఃపురచారిణులకై యేర్పఱుపఁ బడినవి వేఱే తమకు వేఱే యుభయులకును వేఱే కూఁతులకు వేఱే కొమరులకు వేఱే మొత్తము చేసినచో నొక్క యంతఃపురమునకే కొన్నినూఱులు క్రీడావనమ్ము లుండును జూఁడీ!

రాయ—(ఆశ్చర్యముతో) అయిన నీప్రభువునకు భార్యలు వందలకొలఁది కాఁబోలును.

విదూ—లెక్కమిటి? కంటి కింపుగాఁ గనఁబడిన దేవర్లమైనను దీసికొని వచ్చుటయే వీరి యాచారము. ఏనాఁటి కానాఁడు వీరలసంఖ్యకు వృద్ధియేకాని క్షయములేదు.

రాయ—ఇందులోఁ గొందఱు బ్రాహ్మణస్త్రీలు గూడ నుందురు కాఁబోలును

తే. బలవిహీనుని కన్యసిభార్య యంచు, దనకళత్రం బటంచు భేదమ్ము గాని
సొగసుగల దెల్లఁ దనచేతిసొమ్మె కాక, బలము గలిగినవాని కేర్పాటు గలదె.

అని చంద్రుఁడు బృహస్పతిగారి భార్య నపహరించి తన్ను మందలింప నుంకించు నింద్రున కుత్తరము చెప్పిన ట్లున్నది. వీరికిఁ జంద్రుఁడు దైవము గనుక నతని సిద్ధాంతమునే యవలంబించి పరభార్యల నందఱిని స్వభార్యలుగఁ జేసికొనుట యాచారమైయుండును.

శా. ఆరాజేంద్రుఁడు రాత్రియుం బవలు కామాసక్తుఁడై యూరిలో
నీరేజేక్షణలన్ బలాత్కృతిగ నెంతే బాధపెట్టంగ నా
యూరన్ గాఁపురముండువార లొకనాఁ డొక్కొక్కఁ డాత్మీయయా
దారన్ బంపెద నన్న నొప్పె నఁట యాతం డెంతధర్మాత్ముఁడో.

ఇది వీరలచేతిక్రిందిచిన్నిచిన్నిజరానులు పాలించెడిరాజుం గూర్చి వెనుకటి కెవరో

చెప్పిన దఁట వారికిని నిట్టి దుర్వృత్తి వీరలవలననే యలవడియుండ నగు "యథా రాజా తథా ప్రజాః" "రాజానుమతో ధర్మః" అనుట కల్ల యెట్లగును?

విదూ—ఎవరో యన నేల? మీచే నిప్పుడు కోరఁబడెడికన్యక బ్రాహ్మణస్త్రీయందు జన్మించినదే యని చెప్పుదురు; కాని పాపము ఈపె గర్భమున నున్నయప్పుడే యేదో యొకయుద్ధపుటలజడిలో నాపెను జెఱఁ దీసికొని వచ్చుకతన నీమెయియ్యెడనే జన్మించుటచే నిది యంత స్పష్టముగా లోకు లెఱుఁగరు.

రాయ—(సంతోషముతో) చెలికాఁడా! నీమాట ముమ్మాటికిని నిక్కమే. ఏమనిన

చ. పరమపవిత్రుఁడై మిగులఁ బండితుఁడైతగు పేరుభోటకున్
వరగుణ మైనలక్ష్మము కపత్యము వీఁడెటు లంత్యజాతి యౌ
తురకవెలందిఁ గోరెడి విధుప్రతిమానన బ్రహ్మజాతియే
స్థిరమిది నమ్మనయ్యెడిని క్షేత్రమునుం దగు బ్రహ్మజాతియై.

ఇదివఱ కెన్నిసారులో యీప్రశంస వచ్చినను జెప్పవైతివి కారణమేమి?

విదూ—(వికవికనవ్వి) మీరు కల్లు ద్రావుటకు మడి గట్టుకొనుచందమ్మున నిట్లు సంతసించుచున్నారే కాని యీపె తల్లిని పాదుసా నిఖా చేసికొన్నాఁడు. ఏవర్ణమైనను నొకటే అగ్నిసైనపిమ్మట వీరిలోఁ జేరుట యాచారము.

రాయ—అంతకు మున్నే యీకన్నియను గన్నయట్లు కదా నీమాటలవలనఁ దేలినది, నా కంతే చాలును. దీని కేమి గాని "నే నిక్కడ నొంటిగా నున్నను భయము లే" దని జెప్పితివి గాన నీ వేగి త్వరలో వత్తువా!

విదూ—మీ రీమావిగున్నక్రింద నుండుఁడు. ఇంతలోఁ బోయి వారలు వచ్చి యెచ్చట నేని యుండిరా సరియే లేనిచో నంతఃపురమున కేనిపోయి వెంటఁ బెట్టుకొని వచ్చుచున్నాను. మీ కియ్యెడల నించుకయు భీతి లేదు.

రాయ—మాట లెక్కడనో విన వచ్చిన వని మరల నిట్లనియెద వేమి! దీనిలో నేదో మోస మున్న దని నాకు సంశయము, ఆకన్నియ యే యైనయపుడు నేను గూడ వచ్చిన నేమగును.

విదూ—రానే వచ్చును గాని, కామినులచిత్తములు క్షణక్షణము లని మీ రెఱుఁగ నిది కాదు. అంగులోఁ బ్రభుకన్యక, ఎటుపోయిన నెటు వచ్చునో! ముందుఁ బోయి చెప్పఁదగుసంగతులు చెప్పి వెంటఁ బెట్టికొని పోయెద!

రాయ—అట్లయిన నీయిష్టము వచ్చిన ట్లొనరింపుము పొమ్ము.

విదూ—(నిష్క్రమించును)

లవం—(నిట్టూర్పు విడిచి) చెలీ! యిఁక నెంత సేపు చూతుము, పోవుదము రమ్ము.

మల్లి—సఖీ! వచ్చెడివేళ యతిక్రమించ లేదు, ఇయ్యది యుపవన మని పేరు గాని మహారణ్య మంతయున్నది. యిక్కడికి వత్తు మనియే చెప్పితిని గాని స్థలనిర్ణయము చేయ మఱచితిని, వచ్చుట మాత్రము నిశ్చయము.

లవం—ఎవరు! ప్రచండమిశ్రుఁడా?

మల్లి—కాదు, ఇరువురును.

విదూ—ఇదుగో నేను వచ్చితిని (ప్రవేశించును)

లవం—(చూడనియట్లు నటించి తాపమునూచించి)

మ. అనురాగం బది కన్నుఁ గానను మనంబా! మిణ్ణుపల్లమ్ములన్
గన కెచ్చోటను నైన నేగు నిఁక వేడ్కల్ మంచియున్ జెడ్డయున్
మును పే నేరవు మన్మథుండు చపలాత్ముం డెంతయున్ మూర్ఖుఁ డం
గనలన్ లోకువఁ జేసి మీఁదఁ బడు శక్యంబే నివారింపఁగన్.

(మూర్ఛిల్లు)

విదూ—భర్తృదారికా! నాతోఁ జెప్పుముఁ వాఁ డెవఁడో యీదుడ్డుకఱ్ఱతోఁ బడ మోఁది వదలిపెట్టెదను.

మల్లి—(తత్తరపాటుతో) తరువాత మోదవచ్చును గాని రాజపుత్త్రి కతివ్యామోహ మ్మున నిట్టియవస్థ సంభవించినది. అదుగో ఆసరోవరము నొడ్డునదరి నున్న లేఁత తామర పాకులు రెండు తీసికొని రమ్ము.

విదూ—ఇదుగో వెళ్లి వచ్చుచున్నాను (నిష్క్రమించి ప్రవేశించును)

మల్లి—సఖీ! (అని పిల్చుచు మెల్లగా వీచును)

లవం—(కొంచెము మూర్ఛ దేలుచున్నది,)

మల్లి—(సంతోషముతో) చెలీ! అదుగో వచ్చినాఁడు చూచితివా! నే నసత్యమాడ లేదు కదా!

లవం—కను లఱవిప్పి మరల మూయుచున్నది.

విదూ—భర్తృదారికా! నీమనోహరుం గూడ వెంటఁ బెట్టికొనియే వచ్చినాఁడను.

లవం—(మరల కనులు విప్పి నలుదెసలు చూచి వైమనస్యము నభినయించును)

మల్లి—చెలీ! సంతాపము తగ్గినదా!

విదూ—చెటిరొయొక త్రోవ యగుటచే నెక్కింత యాలస్య మగుటకు సహింప వలయు, అదుగో ఆమావిగున్నక్రింద నీప్రియతముఁడు న్నవాఁడు.

లవం—(లజ్జయును ప్రేమమును సూచించుచున్నది)

మల్లి—ఆర్యా! మధ్య విడిది యేల చేసితివి! ఇయ్యెడకే తీసికొని రాక పోతివా!

విదూ—నీ కేమి! బానిసకూఁతురవు, చెప్పెదవు ఇది అంతఃపురపు వ్యాపారము "నిన్నుఁ జెప్పకుండనే యెవరు తీసికొని రమ్మన్నా" రనిన నేమి చేయుదును ఎఱుఁగనట్టు మాటాడితివి కాని, యెఱుఁగవా! ప్రతిదినము ఘోషాగూడ వార్త నంపి సెలవైనపిమ్మటనే యంతఃపురికిఁ బోవుట? అందులో నెన్నివార్తలు ఘోరా యొక్కంటికి సెలవులు మూఁడు కావలయును.

మల్లి—అవును. అదియును నిజమే.

లవం—(విసుకుతో) ఓహో! మీయిద్దరియుత్తర ప్రత్యుత్తరములు కడు రమ్యముగా నున్నవి. అతఁడు చెప్పుటయును నీవు వినుటయును సరిపోయినది. మన క్షీతురకసంప్రదాయమే కావలెను కాఁబోలును.

మల్లి—మన కాసంప్రదాయము కాక మఱియొక్కటి యెట్లు వచ్చెడిని. మనము మాత్ర మెవరము ?

విదూ—భర్తృదారికా? నీపుట్టువును గూర్చి నాయెఱిఁగినంత యాతనికిఁ జెప్పినాఁడను జుమీ.

లవం—(తనలో) జుగుప్సాకర మని యెఱుఁగక చెప్పినను నిక్కడ నిది గొంత యుపయోగమే అగును.

మల్లి—సఖీ! అది యేమిటి ఇతఁ డేదో చెప్పితి ననుచున్నాఁడు ?

లవం—ఏ మున్నది. నా సురవస్థయును, మాతల్లితలఁప్రాఁతయును పరిశుద్ధ మగు కాశ్మీర దేశమునకు నెక్కడిదే సచివుఁ డని పెంచుకొన్న కుమారభట్టునకు నపజయ మొదవించిన భగవంతుని కెంత యక్కటికము లేదో ?

విదూ— అయన పేరిదియా ? నే నిదిమాత్రము చెప్ప లేదు.

మల్లి—సరి తెలిసినది. అట్లయినచో నిక్కడ నందఱును బ్రాహ్మణకన్యకలే. ఎల్లరును మాతెతలే. ప్రకృతము చూచుకొన వలె మనము వెనుకజన్మమున నేమృగములమో యేపక్షులమో ఇప్పు డామాట యేటికి? దీని కేమి మనమే యమ్మహామహుని దర్శనమునకుఁ బోవుదమా ? ఈయపరాధమునకు క్షమార్పణగా నుండును.

లవం—(ఊరకుండును.)

మల్లి—ఆర్యా! అయ్యెడకు ముమ్ముం దీసికొని పొమ్ము,

విదూ—ఇదుగో ఈసురపొన్న చెట్టుల చాలు వెంబడిని పోవుదము రండు.

మల్లి—చెలీ! న న్నవలంబించి మెల్లగా నడుపుము

లవ—(అట్లొనరించుచున్నది) (అందఱును యథోచితముగా పరిక్రమింతురు)

రాయ—(విసుగుట సూచించి)

కం. చెలికాఁ డెచ్చటి కేగెను? చెలి యెయ్యెడ నాఁగురాక చిత్తమునంగు
మ్మలిక మెయిఁ గోరుచున్నదొ? కలుగునొకో? యింత నేరి కలికీ కనఁగన్.

(నలుదిక్కులు చూచి) ప్రియురాలా! నే నిక్కడఁబడెడియవస్థ యొకింతేని నీకుఁ దెలిసిన నింతయాలస్య మొనరింపవుకదా?

శా. రా నుద్యోగము చేయుచుంటివొ వడిన్ రాఁ బోయి రా లేక శం
కాసిర్విణ్ణత గాంచుచుంటివొ! యొరుల్ గామింపఁగా రాను త
ప్పౌనంచున్ మది నెంచుచుంటివొ? సగంబాయె న్నిశాభాగ మె
ల్లైనన్ ధైర్యము పొంగుకొల్పి యిటు రమ్మా! పూర్ణచంద్రాననా.

శా. ఏ నెన్నం డిటువంటికార్యములపై నిచ్చన్ బ్రవర్తింపఁగా
నీ నీమోహము నిక్కమే యనుచు నిట్లెంచితిన్ దీనిలో
నానందం బిసుమంత యింగులకు నాయాసంబు బల్మెండు మో
మైనన్ జూపుగాని వేగ నిటు రమ్మా! పూర్ణచంద్రాననా.

అయ్యో! మన్మథా! నీ వెంతనిర్దయుఁడవైతివి. రసాభాసానురాగము గల్పించుట నీకు మెప్పగునని యెంచితివా? ఇంతకు నీ వేమి చేసెదవు? నావంటి దరిద్రున కట్టియదృష్టమా? నాప్రియురాలు న న్ననుగ్రహించినచో నీలక్ష్య మెవరికి? నిన్నుఁ బరిమాలికొనుటకన్నఁ దాప మార్పఁగల యక్కలికిమిన్న నే స్మరించికొనియెదను.

శా. సంకేతమ్మునుజేరి యచ్చటఁ బ్రియాసాక్షాత్కృతిం గోరి యా
శంకన్ జెంగుచు లోనఁగుందుచుఁ దృషన్ జాలించుచున్నంత నా
రంకూద్యచ్చకితాయతాక్షీ యరుదేరం గాంచు భాగ్యమ్ము నూ
నాంకాశీర్వచనాభిషిక్తులకుఁ గాదా? కల్గు వల్గుస్తనీ.

(నలు దెసలు పరికించి)

ఆహా! యితఁ డేగి యెంతసేపైనది, ఎయ్యెడను నలుకు డైనను విన రాలేదు ప్రియురాలు రాలే దనుటయే నిక్కువము, అయినచో నితఁ డెందుకు రాకుండెడిని? అవును అంతఃపురమున కేని చని వెంటఁ గొట్టుకొని వచ్చె నని కదా?

అన్నాఁడు (పెదవి విరచి) ఇదియంతకంటె సంభవింపదు. ఎంతయంతఃపురములో రాకపోకలు గలవాని నైనను నర్ధరాత్రమున నడ్డక పోనిత్తురా? అక్కటా! యీచిగురుటాకులమధ్యనుండి ప్రసరించెడి వెన్నెల గూడ నింత వేఁడిగ నుండు టేమో? ఏ మైనను సరియే. ఇఁక నిక్కడ నుండినలాభము లేదు. ఈస్థలము విడిచి యింటికే పోయెదను (కొంచెము నడిచి) అయ్యో! వెనుకటిత్రోవ గాన గాదే! ఇది యేమో యింద్రజాలముగా నున్నది. (కొంతనిలిచి) కాదు, కాదు, నేను వచ్చినత్రోవ అది కావచ్చును. (మఱియొకవైపునకుఁజని) ఇదియును గానట్టు లున్నదే! (సూనముగాఁ జూపు నించి) అక్కడ నేదో యొకచిన్నిమిద్దె వలెఁగాన వచ్చుచున్నది. తటస్థించినచో నయ్యెడఁ బ్రియురాలే తటస్థింప వచ్చును. (ముంగునకు నడిచి) ఓహో! నిందుగాఁ జూచిన యీ పెద్దపొదరిల్లు పైపెచ్చు వెన్నెల సహాయము కాఁగా నావ్యామోహమునకుఁ బ్రచండమిత్రుని మోసము తోడయి చేసినపనినే చేసినది. (మరలఁజూచి) ఇక్కడ నేదో తటాకము గాన వచ్చుచున్నదే! పోయి చూచెదఁ గాక. ఆపొదరిల్లు దీనియావలియొడ్డున నున్నది. అవును, అక్కడికిఁ బోయి విశ్రమించెదం గాక. (నడచిఅంచుఁజొచ్చి) ఇదిగో! ఇ య్యెడల నళినీదళశ్రస్తులు పడఁబట్టుచున్నవి. కారణ మేమై యుండునో! (విచా రించుచుఁ గూర్చుండును).

లవం—(ఆయాసముతో) చెలీ! యింక నెంతదూర మున్నదో కనుఁగొమ్ము.

మల్లి—ఆర్యా! ఎక్కడ మనరాకన్నియమనోహరుఁ డుండుతావు?

విదూ—(వ్రేలుచాచి) అదిగో! ఆపొగడచెట్లచాలు దాఁటుపై నశోకపంక్తి కెడమ ప్రక్క నున్న దయ్యమావిగున్న.

మల్లి—దగ్గరకు వచ్చితిమి.

లవం—(అభిలాషముతోఁ జూచినట్లో) అదిగో! ఆర్యపుత్రుఁ డక్కడ నా కెదురు చూచుచున్నాఁడు. ఏర్పాటుగాఁ దెలియకున్నను గొంచెము తెలియవచ్చుచున్నది. (ప్రకాశము) చెలీ! యా రిసుపురుషు జనుఁడు (అక్కడనిలువఁబోవును).

మల్లి—పెండ్లికూఁతురు "పెండ్లికి నేనుఁ గూడ నఁదు" కన్నట్లు చేయుచున్నావు.

విదూ—(తొందరగాఁ జెట్టుక్రింది కేగి నలుదెసలు పరికించి డిల్లవడి చుట్టుపట్టుల వెదక మొదలు పెట్టును).

లవం—చెలీ! అమ్మహాత్మునియెదుటకు రాఁజాలక యున్నదానికింత సాహసాతి చెప్ప వలెనా?

మల్లి—సఖీ! వెనుక నీవంటిసిగ్గరి చేయఁబట్టిచే యిప్పుడని వాడుకగాఁ జెప్పుకొనుచున్నారు.

విదూ—(దైన్యముగా పరుగున వచ్చి కోపముతో) మీరు మెల్లగాఁ బెండ్లినడకలు నడువ మొదలుపెట్టినారు. సరే నాకేమి పెండ్లికొడుకును బిలి యెత్తుకొని పోయినది.

లవం—(తనలో) అయ్యో! దైవమా! నాకుఁ గనుపడుట భ్రాంతియే కాఁబోలును. ప్రత్యక్షముగా నాకుఁ బొడకట్టినది వట్టిమూరాశమే యైయుండునా? (ప్రకాశము) మల్లికా! నీవు పోయి చూచి రమ్ము. ఇతనిమాటను నమ్మఁ గూడదు.

మల్లి—(అల్లొనరించి) సఖీ! నిక్కమే చెప్పినాఁడు. సందియము లేదు.

లవం—అయ్యో మందభాగ్య నగు నాకతన నమ్మహామహున కెంతయవస్థ వచ్చినదో.

మల్లి—అవస్థ కేమున్నది? ఎక్కడనో నీకై వెదకుచుండునని తోఁచెడిని.

లవం—త్వరగాఁ బోయి చూచిరమ్మని యితనితోఁ జెప్పుము.

మల్లి—ఆర్యా! డిల్లపడి పులుసుకాయ న్నాగోఁ వలెనట్లు చూచెద వేమి? ఇదియుం జెప్పవలెనా? ఏమి నీ తెలివి! నేను వచ్చునంత వఱకు నేనిక్కడనే యుండఁ దగునని చెప్పి రాలేకపోతివా?

విదూ—నేను చెప్పకపోవుటచేతనే కాఁబోలు నతఁడు వెళ్లుట. ఏదో మదపిచ్చి యెత్తి తిరిగెడివాండ్రకు మనమాటలు జ్ఞాపకముండెడినా. నన్నాక్షేపించెదవు కాని నీ తెలివేమంత తగులఁబడినది. "ఫలానా తోట నుండు" మని మొదట నాతోఁ జెప్పినచో నీచిక్కులుండవు కదా. మీకేమి యిది యంతయు నాకుఁ బట్టుకొన్నది పోయివచ్చెదను ఇక్కడనే యుండుఁడు (నిష్క్రమించును).

లవం—(విదూషకునిపోయినమార్గమునే చూచుచు నుండును).

రాయ—ఆహా! యీపాదరేఖలు తనపుష్పములపరిమళి పట్లుండి నేదియో విలక్షణమైనయత్తరువుం గూడఁ బూసికొన్నట్లు తోఁచుచున్నదే. కాదు కాదు. ఈచిహ్నములంబట్టి నాకై ప్రియురాలియ్యెడల వేచి విసివి యెయ్యెడకేనియుఁ జనినట్లు లూహింప నయ్యెడిని. అంతివ్యక్తముగాఁ గాకున్నను నియ్యెడఁ గొంచెము పాదచిహ్నములు గూడఁ గానవచ్చుచున్నయవి. ఇఁక నెంతలకు నేనిచ్చట నుండవలయును.

శా. సంకేతమ్ము లటంచు నచ్చటఁ బ్రియా సాంగత్య మంచుఁ గవుల్
బొంకుల్ బొంకిరి గాని యెట్లుపొసఁగుఁ? బోరాడు పోఁగ్లినన్

బంకేజాస్య యొకింట నేగు నొకటన్ బ్రాణేశ్వరుం డేగు నా
తంకం బందుటకక్క నింక సుఖసంధానమ్మునన్ గల్గునే?

(విసుపు సూచించి)

చ. కవులకు బుద్ధి లేదు పలుగాకులఁ జేయుదు రెల్లరన్ మరుల్
దవులఁగఁ జేయుకబ్బములు తా నొనరింతు రవే నిజమ్ములం
చెవఁడు మదిన్ దలంచు నతఁ డెంగులకుం గొఱగాఁడు నాకు ని
య్యవిధకిఁ గారణం బటుల నాత్మఁ దలంచుట కాక యున్నదే.

పోనిమ్ము చెలికాఁడేనిఁ గానరాఁడే? పాపము! మోసము చేసె నని యనుకొంటిని గాని నాయదృష్టలోపమున కతఁ డేమి చేయును.

విదూ—ఇదిగో నేను వచ్చుచున్నాను (ప్రవేశించి) చక్కఁగఁ జేసితరయ్యా! ఏమి యింతలో మునిఁగిపోయినదని యయ్యెడ విడువవలయును?

రాయ—(అభిలాషముతో) ప్రియురాలు నీకుఁ బొడకట్టినదా? నీరాకకుఁ జూచి చూచి యింటి కేనియున్ బోవ నెంచి త్రోవఁ దప్పి యియ్యెడకుఁ జేరితిని.

విదూ—బాగుగ నే యున్నది "కుక్క దొరికితే బెడ్డదొరకదు. బెడ్డదొరికితే కుక్క దొరకదు రెండూ దొరకితే రాజుగారికుక్క" అను సామెతవలె నున్నది.

రాయ—(తనలో) ఏమి వీనివాక్పారుష్యము! శుద్ధనీచుఁడే. దిక్కుమాలిననీచోపమానములకు విధియు విరామమును లేదు. తప్పేమి? ఇదియంతయు జారులకు బుద్ధి చెప్పుట కాని మఱియొకటి కాదు.

ఉ. మానము పోవు స్వాంత మవమానమునున్ సహియించు రాగియే
గానికి మారివట్టి పలుగాకియు గౌరవపాత్రుఁడై తనున్
న్యూనతపాలు చేయు నొక నూతన చింతఘటిల్లు నెందునన్
దా నధముండు, దుర్లభపుఁదన్వికిఁ లోఁగు నెవం డధీరుఁడై.

(ప్రకాశము) ఇంతకు నిప్పుడు మన మెక్కడి కేగుదము?

విదూ—ఎక్కడి కన్నట్లే యున్నది. మునుపు మన మెక్కడనుంటిమో అక్కడికే పోవుదము.

(ఇరువురును యథోచితముగాఁ బరిక్రమింతురు.)

లవం—(తాపమును సూచించి) చెలీ! అక్కపిచంద్రుండు మనల నిట్లవమాన మొనర్ప నెంచెనేమో కదా. కానిచో నియ్యెడకుఁ దీసికొనివచ్చెద నని చెప్పినప్రచండమిత్రునిమాటఁ జెరికిం గొనక యేల యరిగెడిని?

తే. దుర్లభజనానురాగంబు దొడరు నాకు, నిదియ యొకయవమాన మంచెంచరాదు
ఇయ్యదియెటింగనేని మాయయ్యయేమి, సేయనున్నాఁడొ ? యే నేమి సేయుదాన.

(కొండొకయోజించి)

కం. పోనిమ్ము ప్రాణ మేనియుఁ, దా నిది శాశ్వతమె ? యెట్టిదశ వచ్చినను
రానిమ్ము నాకు నొకపరి, కాని మ్మయ్యనఘుఁ జూడఁగల భాగ్యమ్మున్.

మల్లి—భర్తృదారికా! అన్నిటికిని భగవంతుఁడే యున్నయది. ఏటికి భయపడియెదవు. స్వప్నమునఁ బొడకట్టి మీయిరువురికి వివాహ మగు నని చెప్పి పోవుసామి నంగీకార మేల కల్పింపదు?

లవం—(విసువుతో)

ఉ. ఎక్కడిదేవి స్వప్నమున నేటికిఁ దాఁ బొడకట్టు ? నంతఁ బో
కక్కవితల్లజున్ గెలిపి యాకృతి నేటికిఁ జూపెఁ ? జూపుఁగా
కక్కట నీ కితండు మగఁడౌనని చెప్పఁగ నేల ? చెప్పెఁ బో
యిక్కడి కాగతుండయిన యిష్టు మఱొక్కడ కంప నేటికిన్ ?

మల్లి—సఖీ! ఇట్లానర్చుట యంతయును మీశ్రేయస్సునకే. ఏమన నప్రయత్నలబ్ధమ్ము లగువస్తువులయందుఁ గదా యాదరాతిశయము చూపట్టుట.

లవం—న న్నానందింపఁజేయుటకు సమయోచితముగ నట్లాడెదవు. చింతితార్థసిద్ధి యెంతయదృష్టవంతులకుఁ జేకూరెడిని?

మల్లి—(దూరముగాఁజూచి) చెలీ! వచ్చుచున్నట్లు లున్నారు గాని యిప్పుడు మన మియ్యెడ నుండక కొంచెము తొలఁగి నిన్నుఁగూర్చి యాయన యెట్లు తలఁచునో యెట్లు పరితపించునో చూడవలయు.

లవం—(తనలో) అయ్యో! మరల నంతరాయ మొనర్చుచున్నదే వలదనినఁ జిన్నఁబోయెడిని. (ప్రకాశము) కానిమ్ము. నాకును నది సమ్మతమే.

మల్లి—అట్లయిన నీపొదరింటిచాటునకుఁ బోవుదముగమ్ము (అట్లొనరించుచున్నారు).

రాయ—(విదూషకుంజూచి) ఇదియేకదా? మనము గాఁ దగిన చోటు.

విదూ—(తేటిపాటుఁ జూచి తనలో) ఇది యేమి యాశ్చర్యము? కదలవల దనిగట్టిగఁ జెప్పియుంటినే. (ప్రకాశము) అగును. మనల వంచింప నిక్కడనే సమీపమున డాఁగియుందు రనితోఁచెడిని. (బిగ్గరగా) మల్లికా! మల్లికా (అని పిలుచును).

మల్లి—(లవంగితో) మనము మాటాడ వలదు. ఏమి జరుగునో చూతము.

లవం—జరిగెడిదేమిటి? పాపము. అతనిపై నమ్మహాత్మునకుఁ గోపమువచ్చును. నీకేమి? "పిల్లికి సెలగాటమును, నెలుకకుఁ బ్రాణసంకటమును" ననుటిట్టిదే.

రాయ—(తనలో) వీఁడు నిక్కముగా నన్ను మోసమే చేసెను. కానిమ్ము వీని నిఁక సహింపఁగూడదు. (ప్రకాశము కోపముతో)

ఉ. ఎంత యసత్యమాడునరుఁడేని యొకానొకవేళ నైనఁ గా
సంతయుఁ గాని సత్య మకటా పొరపాటునఁ జాఱనాడు నీ
వంత మదెట్టిదో యెఱుఁగఁ బల్కుచు నుంటివి పూసఁ గ్రుచ్చిన
ట్లంతయుఁ గల్లగాఁ గనిది యచ్చెరువైనవిశేష మెమ్మెయిన్.

విదూ—(వికృతముగా నవ్వుచున్నాఁడు)

మల్లి—(లవంగితో) అనుగో! నీ ప్రియుని వాగ్వైభవము.

లవం—(తదేకచిత్తయై వినుట నభినయించును)

రాయ—(విశేషకోపముతో) ఓరి దుర్మార్గుఁడా? నాయవస్థను నవ్వువచ్చుచున్నదేమి?

ఉ. పండితరాయలన్న నొకపాటిగఁ జూచితివేమొ? నేఁడు నీ
గండడఁగింతు శాపమిడి, కాదని దానిని ద్రిప్ప నీవు న
ట్లుండఁగ నిన్ను నేలెడిమహోన్నతుఁ డావిభుఁ డట్టులుండె బ్ర
హ్మాండము నేలునట్టి పరమాత్మతరమ్మగునేమొ చూడుమా.

విదూ—(నిరుత్తరుఁడై వడవడవడఁకును)

లవం—(తత్తఱపాటుతో) చెలీ! ఇఁక నాలస్య మొనరించితిమేని విరసముగా నుండును.

మల్లి—నేను పోయి ప్రచండమిశ్రుం గాపాడెద. నీవు నా వెంటన వచ్చి యయ్యనఘుని దర్శింపుము (అని యథోచితముగా నెదుటికి వచ్చుచున్నారు)

రాయ—(విస్మయంబుగాఁ జూచి తనలో) ఓహో! నిష్కారణముగా "నాకబలి నిష్ఠురమునకుఁ" గడంగితినే.

మల్లి—(వినయముగా వంగి) మహాత్మా! చతుస్సముద్రముద్రితధరావలయమ్మునేకచ్ఛత్రమ్ముగా నేలు పాదుషాకూఁతురు లవంగి నాముఖమ్మున నమస్కరించుచున్నది.

లవం—(లజ్జతో శిరమువంచి తనలో) నేను పాదుషాకూఁతురను గాను. అగుదుంగాక ఏపాదుషాలకును లేని నిరంకుశప్రాభవముగల యార్యపుత్రునియొద్ద నీవెట్టినుతి యొందులకు?

రాయ—(తనలో)

తే. ఎంతసోయగ మెంతటివింతతళుకు, కంతు నాఱవబాణమే కలికిమిన్న
యింతసొగసుండియంతఘూమిూశుకూఁతు,రెట్లయ్యె నెటు నేర్చె? నీవినయంపుగరిమ.

(స్మృతి నభినయించి) కోయిల కాకులచేఁ బెనుపఁబడినను స్వజాతియోగ్యత పోవ నేరదుకదా. ఇప్పటికేని ముని కిక్కిలికియొడ బ్రహ్మతేజ మ్మించుకయు నుడివోక చెన్నుమీఱుచున్నయది. (ప్రకాశము) అభీష్టావాప్తి ర్భూయాత్.

విదూ—(వికవికనవ్వుచు) మీయాశీర్వచనము మీకే ఫలించుచున్నయది. నన్ను శపించుట యేమిచేసితిరి. ఎందుకని యనుకొనున్నాఁడను, గాని మీమాత్రము శాపము నాకును జేతనగును. ఇది గో బ్రహ్మసూత్రము. (పెదవివిరిచి) ఇప్పటిబ్రాహ్మణుల యాశీర్వాదములును, ఇప్పటికవులశాపములును నే నెఱుఁగనివి కావు.

లవం—(విదూషకునివంక నివారించునట్లు చూచును)

రాయ—(నిరుత్తరుఁ డగుచున్నాఁడు)

మల్లి—ఇప్పుడేమిటి అప్పుడేమిటి వస్తువులయొక్క సహజస్థితి యెన్నటికిని మాఱవు.

విదూ—మల్లికా! అటుచూచితివా నేను నామిత్రు నెదిరియోయనిన మనరాకన్నియ కేంచుకో ?

లవం—(మఱింత తలవంచి దృష్టిమరలించుచున్నది)

మల్లి—ఇఁక నీమిత్రుఁ డాయన యుంగాఁడు నాసఖురాలి పెనిముం గాను. ఇంత వఱకే మన యావశ్యకత.

రాయ—(చిఱునవ్వు సూచించును)

లవం—(తనలో) కలలో నా కప్పరదేవత ప్రసాదించిన ప్రముకును నిమ్మహాత్మునకును లవమైన భేదము కన్పట్టదు.

విదూ—అవును "దూతికా సూతికా చైవ కార్యాంతే" అని మన మింతట నవలకుం బోదము రా.

లవం—(మెల్లగా) నీవు పోవలదు.

మల్లి—(చిఱునవ్వుతో) ఇఁక నే నెందుకు? నీ కతఁడు చెలియుం గాఁగలఁడు.

రాయ—(ఉత్కంఠతో)

కం. చెలిఁ జేసెదో? దాసునిఁ గాఁ, జలిపెదో? నీసఖికి నన్న సాధ్యప్రజ్ఞా
కలితమతి వైననీవే, గల పన్నిటి కింక మాకుఁ గళవళ మేలా?

విదూ—ఈబాలికసహూతురే కాఁబోలును చేసెడిని. నేను మన్నుగొట్టుకొని పోయెడి వాఁడనే?

రాయ—(చేయి పట్టికొని) నీవే నేను.

విదూ—(మల్లికకేసి చూపి) "త్వమేవాహం త్వమేవాహం త్వమేవాహం నసంశయః" (చేయిపట్టుకోఁబోవును)

మల్లి—(పరిహరించి) ఓహో! దుష్టబ్రాహ్మణా! ఏమి నీయాగడము.

విదూ—ఆగడ మేమిటి? మన మిద్దరమును మాతలమునిం బలుపుటకుఁ జదివితిని.

మల్లి—ఓహో! యెంత సుందరముగా నున్నది.

రాయ—మల్లికా! కోపగించుకొనకుము. ఈమహాబ్రాహ్మణునకువచ్చిన పరికలన్నియును నగ్నము తెలిసినవి కాకపోఁబట్టి "కుర్వీత బుధసోమయోః" అన్నట్లుపచరించుచుండును.

మల్లి—ఈతఁ డెప్పుడును మాయంతఃపురపరిచారికలచే మొట్టికాయలు పడుటకు సంశయింపఁడు కానిండు. సర్వజ్ఞులగుదేవరకు నీమూఢురాలొక విజ్ఞాపనమునకాజ్ఞ వేఁడుచున్నయది.

విదూ—(తన్నుఁగాదియట్లూరకుండును.)

రాయ—నీ వేమిచెప్పినను నంగీకరించువాఁడనే.

లవం—(తనలో) తెల్లవారునంతకు నేదో యిట్లు గొడవ పెంచును గాఁబోలును.

మల్లి—నేను చెప్పవలసిన దేమియును లేదు. స్వప్నమున మిమ్ముఁ జూచి పరశక్తి సంబంధనిశ్చయము చేసినదఁట. అది యెట్లునుం దప్పును గానఁ బిదప ఘోషాసా వివాహ మొనరింపఁబూనుచో మీరు పక్షభేద మొందఁగూడదనుచున్నది!

లవం—(తనలో) కాలయాపన మొనర్చినను మంచిప్రసక్తిఁ దెచ్చినది.

రాయ—(తనలో) ఓహో! నన్నీలతాంగి కలలోనా చూచినది! (ప్రకాశము) ఇది పునరుక్తి అంబికనే భ్రమపడుచున్నప్పుడు మన మెవరము?

లవం—(తనలో) హృదయమా! ఇక్కడికి నీవు సగము కృతార్థమవు. తక్కినది ఘోమసాయనుగ్రహమునఁ గావలయును.

మల్లి—ఊరక యట్లనుట కాదు. మాచెలిచేతిలోఁ జేయి వేయ వేఁడెదను.

రాయ—(సంభ్రమముతో) ఇదిగో వేసితిని (అనిస్పృశించి స్పర్శసుఖమును సూచించి)

తే. బ్రాహ్మణోత్తములెల్లను బంక్తిబాహ్యుఁ, డనుచు వెలిఁ బెట్టుదురుగాక యంతఁబోక
సరము చెడుఁగాక యేమైన వచ్చుఁగాక, అబలగో! నిన్ను నేను బెండ్లాడువాఁడ.

లవం—(లజ్జతో స్పర్శసుఖమును బ్రకటించును.)

విదూ—ఇదుగో నే నిక్కడ బ్రాహ్మణోత్తముఁడ నుండఁగా నామంత్రతంత్రములు లేకయే మీరు పాణిగ్రహణము నెట్లు నెఱవేర్చికొన్నారు. (పండితరాయల కండువాచెంగు మాత్రము పట్టుకొనును).

లవం—(కొంచెము దూరముగాఁ దొలఁగును)

మల్లి—నీకుం దగుబహుమానము నే నిప్పించెదఁ గాని యిఁక నిక్కడనుండి తొలఁగుము.

విదూ—నే నేకాఁ, నాకు నీవా యిప్పించెడిదానవు? బానిసముండతురా!

లవం—(మెల్లఁగా మల్లికతో) ఎవరో వచ్చుచున్నట్టు లున్నది.

(అంతట మాతంగియను వృద్ధపరిచారక ప్రవేశించును)

మాతం—(తనలో) దేవిగారు నా కాజ్ఞయిచ్చి యెంతసేపో కావచ్చినది. ఎక్కడ వెదకినను భర్తృదారికజాడ గానరాకున్నది. ఎప్పుడు నుండనిదియ్యెడ నీదిన మింతమసలునా? ఇదివఱకే వెళ్లియుండునా? లేక మఱియొక క్రీడావనమునకే వెళ్లినదా? (దెసలు పరికించును)

విదూ—(మెల్లగా) మల్లికా! ఇక్కడికిఁ గుదిరినదా మీజ్వరము?

మల్లి—(తేఱపాఱఁజూచి) చెలీ! మఱియేమియు నులేదు. మాచిరమ్మని మాతంగిని కాఁబోలును బంపినారు. అది మనల గుఱుతింపక మఱియొకప్రక్కకుఁ బోవుచున్నది ఇక్కడకుఁ దిరిగియువచ్చునాలో నార్యపుత్రునియొద్ద నిప్పటికి సెలవు వేఁడుకొనుము.

లవం—(తనలో) ప్రొద్దుపోయినది కాఁబోలును అయ్యో! శ్రేయస్సుల కన్నియు విఘ్నములే.

రాయ—(లవంగికైఁ జూచి) సఖీ! మరల నినుఁ గనుఁగొన్న మెప్పుడోకదా!

లవం—(విచారముతో నిరుత్తర యగుచున్నది.)

మల్లి—పరమాత్మునికృపవలన శీఘ్రముననే కాఁగలదు.

విదూ—తథాస్తు.

లవం—(తనలో) ఇతఁడెట్టివాఁడైనను నిప్పట్లు సత్యవచనుం డగుఁగాక.

మల్లి—చెలీ! మనము దానికెదురేగి తత్సహితముగా నగరికరిగి చూచెసి పిదప వీరు పోవుటకు వీలుగా నుండును. సెలవు తీసికొనినట్లే. పోవుదము రమ్ము (అని ముందుకు నడచును.)

మాతం—(సమీపించి) ఏ మమ్మా! యీనాఁడింతతడ వుంటిరి? కోళ్లు కూయుచుండుట యైసను వినఁబడుచున్నదా?

మల్లి—పోవుదము రా. త్రోవలోఁ జెప్పెదను. (నడచుచు) ఈవేళ మేమొక యుత్సవము చేసికొన్నాము తెలిసినదా! అది కోడికూఁతవఱకును గావలసినదని యీకొలపు బాలికల యేర్పాటు.

లవం—(తనలో) బొంకినను దడవికొనకుండ బొంకవలెను.

మాతం—ఏమో మానాఁ డీకర్మ మెఱుఁగము; మీవన్నియుఁ గ్రొత్తక్రొత్తయాటలు! క్రొత్తక్రొత్తపాటలు! పోనిండు త్వరగాఁ బోవుదము రండు దేవిగా రదురుచూచుచుందురు. (ముగ్గురును నిష్క్రమింతురు.)

రాయ—(వారలు పోవువైపునకు దృష్టి జొన్పి దైన్యముతో) చెలికాఁడా!

మ. తగుకాంతన్ దగుకాంతుతోఁ గలుపఁగా దాత్పర్యముల్ బూనఁ ద
త్తగు లెట్లో మది నొప్పికొన్న ప్రబంధమ్ముల్ శతమ్ముంనుఁ బు
ట్టఁగఁ జేయున్ సహియింపలేక విధి కట్టా! యిట్టినుర్గాగ్ర నే
మిగ భావించి పరాంబ లోకగురుఁగా మీఁదెన్నకే చేసెనో.

విదూ—రాజపుత్రి మచ్చుమందు చల్లినట్లు మీకు వశ్యమైనది. ఇఁక కెక్కడికిఁ బోవఁగలదు. అబ్బో! ఈపిల్లకు వివాహామునకై పోరుపా యెంతమంది యువరాజుల పటములు తెప్పించి చూపుచున్నాఁ డనుకొంటిరి. మీవంటి బీదబాపని కింతలో లోఁబడినది. మీయదృష్టము మంచిది. మీకు గొప్పజహాగీరు కూడఁ దొరకును. మన మీపాటికిఁ బోవుదము రండు.

రాయ—

తే. పాదుపాకూఁతుహస్తసంపర్కమునసె, కలిగెఁబో నాకు లోకాధికారగరిమ
అదియు నెడమైనయంత నే యదియు కాక, సకలమును లేకయున్నట్టి చందమయ్యె.

విదూ—అనుగో నే నేమిచెప్పేని. దర్శనమాత్రమున కదా సంతసించెద నంటిరి. స్పర్శనము గూడ సంఘటించిలిని. మీ రెంతపండితులైనను నేనను భవజ్ఞుఁడను.

రాయ—(అనాకర్ణితముగా)

తే. అందమటులుండఁ జందమ్మునట్టులుండ, సోయగమటుండ సొగసొక్కచోటనుండ
నహహ తనచెలితోఁడ నయ్యబల వల్కు, ప్రోడతనమంతయింతని పొగడఁదరమె.

విదూ—మనమ్మునకు నచ్చినపట్టున నన్నియును రమణీయములే యగును. మీరు వినుచుండఁగా నాపిల్ల యొక్కమాటయైనమాటాడక బెల్లముగొట్టినరాయివలె నుండెను

గదా. అదే కాఁబోలును; ప్రౌఢతన మని పెద్దగా వర్ణించుచున్నారు. అందము, చందము, సోయగము, సొగసు, అని నాల్గుపర్యాయపదముల నొక్కచోట మీరు ప్రయోగించి నామాటసహితము వినక వర్ణించినను మీప్రియురాలికొక్క చెవినున్న కుట్టుకాడలగుట్టు వర్ణనముకైనను నవి చాలవుకదా. అథమపక్షము రెండిఱువదులు నలుబది పదములైన నొకటే యర్థమునిచ్చునవి యుండకతప్పదు.

రాయ—ఓయి రసవిహీనుఁడా! ప్రౌఢతన మనఁగా మితభాషిత్వ మగుఁగాని నీవూహించినట్లు వటవట వాగుట కాదు. ఇఁకఁ గుట్టుకాడలఁగూర్చి పరిహసించుట పొత్తిగాఁ బొరబాటు. ద్రామిడాంగనల కతిస్థూలతాటంకములంబలె యవనాంగలకివి సామాన్యములు. తావన్మాత్రమున సహజలావణ్యగణ్యాలకు వికార మారోపింప నొప్పదు.

విదూ—అవును. ఆలాగు సంతోషింపవలెను. " తావలచినది రంభ, తా మునిఁగినది గంగ " పోనిందు రెండవకోడికూఁత వినవచ్చెడివేళ కావచ్చినది. మనమీపాటికిం బోయినిద్రింతము.

రాయ—సఖా! నీకు నిద్రపట్టినను బట్టుంగాక

చ. చెలి యరుదేరఁ గాంచితిని జే యొకభంగి స్పృశించితిన్ మరల్
నెలకొలుపంగఁ జాలునలనీరజలోచన ముద్దుఁగుల్కు పఁ
ల్కుల నొకకొన్ని వింటి సమకూరె సుఖం బనుకొంటినింతలోఁ
గలిగెను విఘ్న మొకట్టరణిఁ గాంచెద నిద్దుర? నెట్లునిల్చెదన్?

విదూ—(చేయిపట్టుకొని) పోవుదము రండు. మీకివ్వడే యచ్చేడియతో సఖ్యమ్ము గలిగించెద.

రాయ—(అభిలాషతో) ఇంతలో నెట్లు పొసఁగింతువు (ఇరువురును బరిక్రమింతురు.)

విదూ—దానికి సుళువైనయుపాయ మాలోచించితిని.

రాయ—సుళువే కానక్కఱలేదు.

శా. స్త్రీవేషమ్మును వేసికోవలయునో? సిగ్గింత యున్ లేక య
య్యావాసమ్మును జేరుపొంకె ఘనవప్ర ప్రాకారపుంగోడ నెం
తే వేగమ్మున దాఁటఁగావలయునో? నీచత్వమున్ జూడకే
యావాల్గంటియనుంగుదాసి నెవతెన్ బ్రార్థింతునో? తెల్పుమా.

విదూ—ఇంతవఱకు కక్కఱలేదు.

రాయ—ఇఁక నెయ్యది?

విదూ—మహాయోగు లీశ్వరుధ్యానించున ట్లమ్మగువ నంతరంగమ్మున నిడికొని కొంచము కనులుమూసికొని పర్న్ండవలయు.

రాయ—నిక్కమే! అయ్యదిచక్కనియుపాయమే యైనను "శ్లో. యద్దుష్కరం యద్దురాపం యద్దుర్గం యచ్చదుస్తరం। తత్సర్వం తపసా ప్రాప్యం తపోహి దురతిక్రమం." అన్నట్లున్నది. ఒక్కచో నట్టిదైనను సాధించితినేని యిం మందభాగ్యుడనగు నాకక్కన్నియ యప్పట్టునను బొడకట్టదు. పొడకట్టినను నేదియో యంతరాయము మూఁడక మానదు.

విదూ—సకలాంతరాయమ్ములను నివర్తించుటకు లంబోదరునంతవాఁడను నేనుండఁగా మీకేలోపమును రాదు. నాయుపాసనము మాత్రము మఱవక యుండవలె.

రాయ—అంతవాఁడ వననేల? సాక్షాత్తుగా లంబోదరుఁడవే కదా? "దూతీగహితా ఇవ తే న కామినీమనసి నివిశంతి" నీవు లేకున్నచో నా కియ్యెడగతియే లేదు.

విదూ—అదిగో! నన్నాఁడుదానిగాఁ జెప్పుటచేఁ గోపమువచ్చుచున్నది. యిప్పటి కొపుకొనెదను గాని యిఁక నెన్నఁడును నట్టిప్రసంగము పనికిరాదు.

రాయ—ఆఁడువారల కొఱకేకదా యిన్నిపాటులు పడుట?

విదూ—ఇఁక మీవెఱ్ఱిసమర్థనలు కట్టిపెట్టుఁడు "అయ్యవారేమిచేయుచున్నారంటే అబద్ధాలాడి దిద్దుకొనుచున్నారఁట". మీపండితులకున్న సల్లక్షణమే యిది. అదిగో తూర్పు తెల్లవాఱుచున్నది. పోవుదము రండు.

రాయ—(చూచి)

ఉ. నామనమందునుంబలె ఘనంబగురాగము దోఁచుచున్న దీ
యామిని నన్నుఁబోలెఁ గననయ్యెడు రిత్తగ, రిక్కలున్ జ్యోత
గ్రామములై నను బలె నొకొనొకఁడై కనుపట్టె, ఘూకవుల్
దామినభీతిఁ బోఁదొడఁగెఁ దద్దయు నీకవిఁ బోలెఁ గుంచుచున్.

(ఇరువురును నిష్క్రమింతురు.)

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర విరచితంబగు పండితరాజమ్మునందు
తృతీయాంకము.

# పండితరాజము - చతుర్థాంకము.

(అంతట నిరువురు వైతాళికులు ప్రవేశింతురు.)

ప్రథ—చెలికాఁడా మనకు వేళ కావచ్చినది. మన మీపాటికిఁ బోయి మనకృత్య మేల నెఱవేర్చికొనఁ గూడదు?

ద్వితీ—కావచ్చినదనుచున్నావేమి? అయినది (వినుటనభినయించి) అదుగో! గడియారము వినవచ్చెడిని; నాలుగుకాఁబోలును కొట్టుచున్నాఁడు.

ప్రథ—(తూర్పుకేసిచూచి) నాలుగేకాదు. సూర్యోదయమే యగుచున్నది. ఈపడమటి పైపునఁ గొంచెము వెలవెలఁ బోవుచంద్రునితేజ ముండుటంబట్టి రాత్రియున్నదనుకొన్నారము గాని యటుఁ జూచుము అయినదని తోఁచుచున్నది.

ద్వితీ—అయిన నేమియునిఁగిపోయినదిలే; త్వరగాఁబద; ఏవో రెండుపద్యములు చదివి వత్తము. వినువా రెవరు? మనకుఁ గాలాతిక్రమణశంక కవకాశముండదు.

ప్రథ—అవును. నీవనినట్లు తురకదర్బారు. మనలో మనమాట ఎవఁ డేమిచేసినను సరే. చూచువారే లేరు, ఇంతగ్రుడ్డిరాజ్యము మఱియొకటి యుండదుసుమా!

ద్వితీ—ఆసంగతి మనకెంతకుఁగాని అదియే మనము కూర్చుండుచోటు. పోయి యానౌబత్తు గొడవతో పాటు రెండుపద్యములు చదువుదము పద (యథోచితముగా పరిక్రమింతురు.)

ప్రథ—(కంఠముసవరించి)

సీ. అభిసారికాంగనా వ్యభిచారములుతగ్గఁ దమముతూరుపు పర్వతమ్ముడిగ్గె
కువలయమ్ములరంగు దవుదవ్వులముడింగె వెడవింటివానియాగడ మడంగె
పద్మినీకాంతకుఁ బ్రాయంబు నిండారె నంబుజారికి వైభవంబు తీఱె
నేకీభవించుచుఁ గోకముల్ చెలరేగె గుడ్లగూబలు కొండగుహలఁ డాఁగె
తే. రంగుమెయి మత్తువస్తువుల్ మ్రింగిమ్రింగి, యొడలెఱుంగని రతముల బడలిబడలి
తెలివి గనలేనిబలుసోమరులకుఁ దక్కఁ, దెల్లముగ నెల్లవారికిఁ దెల్లవాఱె.

ద్వితీ—ఇది యెక్కడిదో క్రొత్తపద్యములా గున్నదే? దీనిలోఁ గీతిలోనియర్థము పాదుషాగారు వినినచో మనకుఁ జక్కు దేఁగలదుసుమా.

ప్రధ—ఇది రాయలవారి నడిగి చేయించుకొన్నది. అవును నీ వన్నట్లు ఇది శుద్ధ తురుష్క చర్యను బోధించుచున్నది. అయినను గవులొకరికి మిత్రులును వేఱొకరికి శత్రువులును గారు. వారు లోకానుభవమునుబట్టి వచించుచుందురు. అయ్యది నిజముగాఁ దమకే యన్వయించినను వివేకులు పైఁబెట్టికొనరు. అటులైన భారతాను లెక్కడను జదువుటకే వీలుండదు.

ద్వితీ—మన కంతనిరాఘాటత కూడ . స్తుతిపద్యములు మాత్రమే చదువవలయును.

శా. నీరాజ్యమ్ము రమావిలాసవతికి న్నీరేజ మైయొప్ప నీ
పే రుద్యత్కవిరాజమండలి బహుప్రీతిన్ జపింపన్ మహా
వీరాగ్రేసరు లెల్ల నీబలిమిన్ వేనోళ్ల శ్లాఘింపఁగా
ధారాళమ్ముగ రాజ్య మేలెడినినున్ దైవంబు రక్షించెడిన్.

ప్రధ—

శా. ఆశానాధుల నెల్ల లోఁబఱచి లోకాలోక పర్యంత మై
నాశం బెన్నఁడులేని స్ఫై విమలమై నానాటికిన్ వృద్ధి నా
దేశింపం దగునీయశమ్మునకు నేదీ సాటి? యూహింప నా
కాశీసేతుధరాతలేశ్వర! తురష్కశ్రేష్ఠ చూడామణీ.

ద్వితీ—(చూపునిగిడ్చి) ఇఁకఁ జాలింపుము. మనము కాలాతిక్రమణముగా వచ్చినట్లే పాదుషాగారు పెందలకడ మేల్కాంచి నట్లున్నది. అదుగో అంతఃపురమునకు వెళ్లుచున్నారు. ఇక్కడ మన మెందుకు? పోదము రమ్ము (నిష్క్రమింతురు.)

(అంతఃపురము పాదుసాయును, దేవియు, లవంగియును, పరిచారికలును ప్రవేశింతురు).

పాదు—దేవి! ఇదివఱలో నే నంపినప్రతిమ లన్నియుఁ గొమిరెకుఁ జూపితివా?

దేవీ—చూపకేమి. ఎందును నాదర మున్నట్లు మాత్రము కనుపట్టదు.

లవం—(తనలో) ఈపాదుగడ్డాలును, బోడితలలే కావా యేమిటి? వీరలపైనాదర మెట్లుకలుగునో?

పాదు—అయినచో నిఁక సంబంధమే కుదురదుకదా? ఉన్నయువరాజుల వన్నియును వ్రాయించి తెప్పించితిని.

దేవి—అగును అయిననేమి యేదో వెఱ్ఱిగాఁ గూర్చుండి యాలోచించుటయే కాని ఏది చూపినను నిష్టమున్నట్లు కన్పట్టదు. పోనీ అనివిసువెత్తి నేను చాలదినముల క్రిందటనే యీగొడవఁ దలపెట్ట మానితిని.

ఫాదు—తనయక్కలను చెల్లెండ్రను జూచియైన నేర్చుకొనరాదు కాఁబోలును (కూఁతు నుద్దేశించి) నీరీతిఁజూడగా నీవు వివాహమే మానునట్లు తోఁచుచున్నదే.

లవం—(తనలో) నాకాతురక బీబీ లెక్కడి యక్కలు? (ఊరకుండును)

ఫాదు—(దగ్గరగాఁదీసికొని) తల్లీ! యెల్లలోకమ్ము లేలెడినాకుఁ గొమిరెవై యేదో యుల్లమ్మునఁ దీఱరానికోర్కె యున్నదానిం బోలె నట్లేల కృశించెదవు?

లవం—(తనలో) హృదయమా! నీలోనీవుగుందవలెఁ గాని నీవికారమును బైటికిఁ గూడ నేల సూచించెదవు? (ప్రకాశము) జగదీశు ననుగ్రహమ్మున నాకు సకలమ్మును గలను. తీఱరానికోర్కె యెట్లుండును?

ఫాదు—పోనీ యెవరిని బెండ్లాడవలెననియో నాకుఁ గొంచెము చెప్పుము. అతం డెవఁడైనను దెచ్చి యొసంగెదను.

లవం—(తనలో) నాకుఁ బరాంబికయే యనుగ్రహించి యున్నది. నీవు నిమిత్తమాత్రము కావలెను.

(అంతట నొకపరిచారికప్రవేశించి కాగితము చేతికిచ్చును.)

ఫాదు—(చదువుకొని స్మృత్యభినయించి) అవును. మఱచి పోయితిని. ఓసీ! నీవు పోయి నే నిప్పుడే వచ్చుచున్నాననియు నప్పండితకవీంద్రుని బిలిపింపుమనియును మంత్రితోఁ జెప్పుము

పరి—చిత్తము. (వెళ్లఁబోవును.)

దేవి—ఆర్యపుత్ర! యెవ రాపండితుఁడు?

ఫాదు—తెలుఁగుదేశమునుండి యొకపండితుఁడు కొన్నినెలలక్రిందటనే దర్శనార్థమై వచ్చియున్నాఁడు. ఆయనశక్తి మిగుల నద్భుతమని చెప్పుచున్నారు. ఒకసారిచదివినతోడనే తనకు రానిభాషయైనను దిరిగియు హెచ్చుతగ్గులు లేకుండఁజెప్పునఁట

దేవి—ఓసీ! కొంచెము నిలువుము పోవుదువు గాని (ఫాదుషావంకదిరిగి) ఆసభ నేఁడియ్యెడఁ గాఁ గూడదా?

పరి—(అగుచున్నది.)

లవం—(తనలో) ఈనాఁటిసభలో నామనోహరుఁడు తనశక్తికి బహుమానముగా నన్నే కోరుకొనుఁగాక (స్మృత్యభినయించి) నిన్న నీమాట చెప్ప మఱచితినిగా? అప్పుడు సిగ్గునాకేమియు నోటికి రానిచ్చినదికాదు.

ఫాదు—అట్లే కావచ్చును. ఓసీ! వారినందఱిని సభ యిచ్చటనే జరుగునని చెప్పి వచ్చునట్లు చేయుము.

పరి—చిత్తము (నిష్క్రమించును.)

లవం—(తనలో) ఇదియంతయు జగదంబ చేయుచున్న సంఘటనమే; లేనిచో సభ యంతఃపురమున నెందులకు జరగడిని?

పరి—(ప్రవేశించి) మహాప్రభూ! అందఱును వచ్చుచున్నారు.

ఘా॰సు—దేవీ నేను సభకుఁ బోదునా?

దేవి—చిత్తము (అందఱును నిలిచియుందురు.)

ఘా॰సు—(దగ్గఱనే యున్న సావడిలో నుచితాసనమునఁ గూర్చుండును.)

పరి—ఓసీ! మాతంగీ! యీ తెరను కొంచము పట్టుకొనుము.

(దేవికిని లవంగికిని ఘోషాగా సన్న తెర గట్టుచున్నారు.)

(అంతట మంత్రులును, కవులును, మఱికొంత ఉద్యోగులును ప్రవేశింతురు. అందఱును సలాములు చేయుచు కూర్చుందురు.)

ఘా॰సు—(కవులవంకఁ దిరిగి) పండితరాయలం గుఱించి మీయభిప్రాయ మేమి?

కవు—వారికి శాస్త్రము వచ్చునఁట. కవిత్వమునకుఁ బుట్టినపేరే కదా? ఏకసంధాగ్రాహిత్వ మన్నిటికంటె నత్యాశ్చర్యకరము.

మంత్రు—మనభాషలోఁ గూడఁ గొలఁది దినములలోఁ గవియగునని వాడుకగా నున్నదే?

కవు—కాకేమి? త్వరలోనే యభ్యాసము కావచ్చును. భాష వచ్చినపిమ్మట ధారయున్నవారికి నన్నిటిలో నొకటే రీతిగా నడచును.

దేవి—(కొమిరెం జూచి) అమ్మా! నీకీపండితరాయలను పెండ్లిచేయుదుమా?

లవం—(తనలో) "బుద్ధిః కర్మానుసారిణీ" అని యూరకే యన్నమాటయైనను నిది వ్యర్థము కాదు. (ప్రకాశము) నా కెవ్వరును నక్కఱలేదు.

దేవి—(మెల్లగా) మల్లికా! అందులోఁ బండితరాయ లెవరో యెఱుఁగుదువా?

మల్లి—అమ్మా! ఇంకను రాలేదని తోఁచుచున్నది. వీరందఱును నిక్కడివారే.

లవం—(తదేకదృష్టితోఁ జూచుచుండును.)

మల్లి—(లవంగి ప్రక్కనే కూర్చుండును.)

ఘా॰సు—మనలో ననాదిగాఁ గవులున్నారుకదా! ఇట్టిశక్తి గలవారున్నట్లు మీరు వినియున్నారా?

కవు—కవిత్వమున కేమి చెప్పువారున్నారు గాని ఏకసంధాగ్రాహిత్వమునకు మాత్ర మున్నట్లు వినము.

ఉద్యో—కవిత్వమునకైనను నంతవా రగుదురని నమ్మ వలనుపడదు. ఆయనప్రతిజ్ఞ వీరు విన్నట్లు తోఁచదు ఇదుగో!

చ. అమరగిరీంద్రమాది మలయాచలమంతముగాఁ జతుస్సము
ద్రములకు మధ్యఁ గల్గిన ధరాతలమందలి మేటిసత్కవుల్
గుమిగొని రండు నేనొకఁడ లోకమునన్ గవి నంటి నొప్పరే
ని మదిని దాఁప నేల? నను నెట్టన గెల్వఁడు వాదసంగతిన్.

చ. కవు లని పేరు పెట్టుకొని కంఠరుచూతలతోడఁ బద్దెముల్
చివుకనితాటియాకులను జెక్కుచుఁ దూరక, చెప్పఁగల్గినన్
జవి గలుగంగఁ జెప్పుఁ డటు సాగనిచోఁ దమయంతఁ జేయుపా
పవిధులు వోలె లోపల నె పాఁతఁబడవేయుట కొంత మేలగున్.

ఘాసు—ఓహో! ఇట్టిప్రతిజ్ఞతో నీతఁడు మనరాజధాని వఱకు నున్నకవుల నందఱిని జయించుకొనుచు నే వచ్చెను గాఁబోలును.

ఉద్యో—అట్లు చేయుటచేత నే కదా దేవరచేతిక్రింద నుండినక్షత్రియసంస్థానాధిపతులందఱును పండితరాయ లన బిరుదు నిచ్చియుండిరి.

కవు—(అసూయతో) అది స్వమతాభిమానముచేఁ జెప్పెడిసంగతియే కాని నిజమని దేవరవారు నమ్మఁదగియుండదు.

మంత్రి—విద్యకును మతమునకును సంబంధ మేమి? అయినఁ గావచ్చును. మనమతములో మాత్ర మిట్టివా రిదివఱలో లేకపోయినను ముందు బయలుదేరఁగూడదా?

ఘాసు—అవును విద్య యొకరిసొమ్ము కాదుకదా.

ఉద్యో—పనఁబోవుచు రుచులడుగ నేల? వీరు ప్రత్యక్షములో నే మాచి సత్కవులతో మనవిచేసికొందురు గాక.

(అంతలో నొకనౌకరు ప్రవేశించి సలాముచేసి)

నౌక—అయ్యా! ఎవరో యొకపండితుని వెంటఁబెట్టుకొని ప్రచండమిశ్రుఁడు వచ్చియున్నాఁడు.

ఘాసు—ప్రవేశింపఁ జేయుము.

లవం—(తనలో) ఆయన నామనోహరుఁడే యై యుండును. ప్రచండమిశ్రుఁ డెవరిని వెంటఁబెట్టుకొని వచ్చును? హృదయమా! ఒక్కింతలోనన పరాంబ నిన్నుఁ దదధీనునిగాఁ జేయుకాలము సమీప మగుచున్నది.

నౌక—(నిర్గమించి సహితముగాఁ బ్రవేశించును.)

(సభ యావత్తును లేచి గౌరవింతురు.)

లవం—(తెరలోనుండి తదేకదృష్టిగాఁ దలవంచుకొని చూడనియట్లు చూచును.)

మల్లి—(జనాంతికము) సఖీ! అదుగో నీమనోహరుఁడు, రాత్రి నిదురలేమిని సహజారుణమ్ములగు నేత్రములు మఱింత యెఱ్ఱఁబాఱ నెగిలినమేనితో సభ నలంకరించినాఁడు.

లవం—(వినన ట్లూరకుండును.)

(అందఱును కూర్చుందురు.)

ఘోట—(తనలో) ఆహా! ఏమి యీమూర్తివిశేషము! ఎవరో మహారాజున కుండఁదగిన లక్షణములన్నియు నియ్యెడనే పొడకట్టుచున్నయవి.

రాయ—(నిల్చి)

శ్లో. శ్రీ రస్తు శ్రితరక్షణక్షణగుణ శ్రీ రస్తు నిత్యోత్సవ
శ్రీ రస్తు ప్రసమానకీర్తిపిషవ శ్రీ రస్తు గీ రస్తు తే
శ్రీ రస్త్వ త్యవేలపండితవచ శ్శ్రీ రస్తు భూర స్త్వహో
శ్రీ జిల్లీశ మహాబదీన విపుల స్సామ్రాజ్య రామాకృతే.

(అందఱును కరతాళములనుగొట్టి యానందమును సూచింతురు.)

ఘోట—(తనలో) నా కీభాషలో స్వల్పజ్ఞానమున్నను ఈమహాకవిశైలి యానందమిచ్చుచున్నయది. పరిపూర్ణజ్ఞానముకలవారి కెట్టి సంతోష మొసంగెడినో?

విదూ—తథాస్తు.

మంత్రి—మహాపండితుఁడవు నీ వాశీర్వదింపవలసినదే.

రాయ—

శా. ఏభూమీంద్రునిఁ జూడఁ బోయినను నీవే పద్యముల్ సెప్పి నీ
వే భావమ్మును సెప్పికోవలయు నింకే విభుండైనఁ దా
నే భావమ్ము గ్రహించువాఁ డగుట నీ కీకష్టమే లేదె నా
హా! భో సత్కవిపూర్వజన్మసుకృతంబా! నీకు దీర్ఘాయువౌ.

(పుష్పము లొసఁగి యుచితాసనమునఁ గూర్చుండును.)

కవు—మహాప్రభూ! సంస్కృతమున నంతవిశేషపరిశ్రమము లేకపోయినను దానిమాధుర్యమున కితరభాషలు చాల వని మాయభిప్రాయము.

ఘోట—సంశయ మేమి? అన్నిభాషలును దానినుండియే కదా యుద్భవించినవి. ఏదైనను నాశ్రయముంబట్టి యెక్కుఁడు శోభించును.

విదూ—మీరు పెద్దకవీశ్వరులని పేరు పెట్టుకొని జహగీర్లనుభవించుచున్నారు కదా! రెల్లు కలములును, పీచు కాగితములును లేకుండ నిట్లు ఆశుగాఁ గవనము చెప్పఁగలరా.

మంత్రి—(సంజ్ఞచే వారించును.)

షాను—పండితాఖండలా! మీ రేభాషయైన నొకపరి వినినతోడనె చదువుదురఁట. నిజమేకదా?

రాయ—నాకట్టిశక్తి యింతకును మున్నున్నది లేదు దానికేమి? దేవరసాన్నిధ్యబలమున నైనఁ జదువఁగల నని మనవిచేసికొనుచున్నాఁడను.

కవు—వినయము విద్యకు భూషణమే కదా? అయినను దమ కట్టిప్రజ్ఞ నిరాఘాటముగా నున్నయెడల నే వచియింపుఁడు లేనిచో మీకు నిది విధియా యేమి?

లవం—(తనలో) వినయమును బ్రకటించుటకుఁ జెప్పినమాటయని యెఱిఁగియును గవినని పేరుపెట్టుకొని యీమూర్ఖుఁడేమో పానకములోని పుల్లవలె నడ్డువచ్చుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు.

రాయ—ప్రభు వగుటం బట్టి యట్లు మనవిచేసికొంటిని. ఇదుగో చెప్పుచున్నాఁడ నిరాఘాటముగా నేభాషయైనను నెన్నిపుటలైనను నొక్కపరి విని నిరాక్షేపముగా తూ, చా తప్పకుండఁ జదువఁజాలుదు. ఇందులకుఁ దప్పిన నా కున్న పండితరాజబిరుదము నిక్కడనే తీసివేసికొనియెదను.

లవం—(తనలో) అమంగళము శాంతించుఁగాక.

షాను—(వినయముగా) కవివరా! మీకు ఫార్సీగాని, ఉరుదుగాని, అరబ్బీగాని వచ్చునా?

రాయ—సంస్కృత మభ్యసించినభాషయే కదా. ఇఁకఁ దెలుఁగు దేశభాష. ఇక్కడికి వచ్చినది మొదలు తఱచు వినుచుండుటచే మీభాషయును దగుమాత్రము వచ్చెడిని.

మంత్రి—ఖురాను నరబ్బీభాషలో నున్నదికదా? దానిలోఁ గొంత వినిపింతమా?

షాదు—అవును దానికిని దేశభాషకును విశేషభేదమే యుండును. (రాయలవంకదిరిగి) పండితజీ! మేము విని చూచుటకే యీయడుగుటకాని పరీక్షార్థముగా భావింపకుఁడు.

లవం—(తనలో) ఆహా! తండ్రియును నీతనియెడ విధేయుఁ డైనాఁడే! ఇదియంతయును నా కనుకూలమే. జగదంబికా! బహుమాన మనుమాట వచ్చునప్పటికి నన్నే స్మృతికిఁ దెచ్చెదవుగాక.

రాయ—చిత్తము. సభాస్థలమున నేకదా! విద్వాంసులకు గౌరవాగౌరవములు రాఁదగినది. ఇంటఁగూర్చుండి యెన్ని ప్రతిజ్ఞలుకొట్టిన నెవరికిఁ గావలయును?

కవు—(పుస్తకమువిప్పి) ఇదిగో సావధానముగా వినుఁడు.

బిస్మిల్లా హిర్రహమాన్ హిర్రహీమ్ సబ్బిహిస్మారబ్బికల్ ఆలల్లజీ ఖలఖఫసౌవ్వా వల్లజి ఖద్దరఫహాద వల్లజీ అఖరజల్మగ ఆఫజీఅలహు గుసాఅన్ అహ్వాసన్నఖ్ రిజిక ఫలాతన్సా ఇల్లమాషా అల్లాహు ఇన్నహు యఅలముల్ జహార వమాయఖ్వవ నేయస్రాక లిల్ యుస్రా ఫజఖిర్ ఇన్ననఫఅజ్జికరా సయజ్జక్కరు మన్యఖ్ష వయతజన్నబొహాల్ అష్ఖల్లజీ యస్లన్ నారల్ కుబ్రా సుమ్మలాయెమూతొ హాఫీతలాయహాఫాకద్ ఫలహాతహామన్ తజక్కా వజకరస్మా రబ్బిహీఫసల్లా బల్తూసేరూనల్ హాయా త్తుద్ దున్యావలె ఆఖెరతు ఖయరున్ వ అఖయిన్నాహాజలఫీసాహుఫుల్ వూలా సాహుఫేయిబ్రాహీమా వో మూసా హిర్రహిమాన్ హిర్రహీమ్॥

బిస్మిల్లా హిర్రహామా నిర్రహీం.

అమ్మ యతసా అలున అనిన్నబయిల్ అజీమిల్లజిహుంఫీ హొముఖతలెఫూన్ కల్లాసయ అలమూనసుమ్మ కల్ల సయ అలమూన్ అలంనజ్ అలిల్ అరజమిహాదన్ వల్జిబాల అవుతాదన్ వఖలనాకుమ్ అజవాజ. వజఅల్నా నౌమకుంసుబాతన్ వజఅల్ వల్ల యిలలెబాసవజ అల్నన్నహారమ ఆష. వబనైనాఫవుఖకుం సబ్అన్ షిదాద వజఅల్నాసిరాజన్ వహాజ. వ అన్జల్నామినల్ మొ అసిరాతె మా అన్ సజ్జాజ. లెనుఖరిజబెహి హాబ్బన్ వనబాతన్ వజన్నాతిన్ అల్ పా పా. ఇన్నయోమల్ ఫసలె కౌనమీ ఖాతన్యోమ యున్పఖుస్సూరె. పతాతూన అపవాజ. నపుతెహాతిస్సమావొ వకౌనత్ అబ్వాబ వసుయ్యెరతిల్ జిబాలొ పకౌనత్ సరాబయిన్నజహాన్నమకౌనత్ మిర్సాద లిత్తాగీనమ అబ. లాబెసేనఫీహా అహాఖాబ. లాయజూఖూనఫీహాబర్దన్ వలాష రాబ యిల్లాహామీరున్ వగిస్సాఖజజాఅన్ వెపాక. యిన్నహుం కౌనులాయర్జూన హిసాబ వకజ్జబుబె ఆయాతెనాకిజ్జాబవకుల షైయిన్ అహాసైనాహుకితాబ.

చక్కగా వింటిరికదా?

రాయ— వినకేమి. మఱి కొంత చదువుఁడు. ఈకొంచెమునకు నేను చదువుట యెందుకు? మాదేశమున సామాన్యముగా బడులలోఁ జదివికొనెడిపిల్లలే వ్యస్తాక్షరియని ముక్కలమీఁద నంకెలువేసి యిచ్చినచోఁ జదువుచుందురు,

ఫాదు.— ఇంతే చాలును, మీ రేదో అంకెలు వేయవలయునని యంటిరికదా! వరుస వెంబడిగనా?

రాయ—అవును కాని ఇచ్చునప్పుడు వరుస అక్కఱలేదు. మీకు దైవము తోఁపించు నది యీావచ్చును.

ఫాదు—ఇదియును నాశ్చర్యమే. కానిందు పాపమునీకు వేఱుప్రసంగములవలన ధారణకు భంగము కల్గునేమో?

రాయ—(కన్నులు కొంచెము మూసికొని యోజించుచున్నాఁడు.)

కవు—(తమలో మెల్లగా) పైకి ధైర్యముగానే చెప్పినను మాటలా ఇది చదువుట? పేగు తెగును.

(అందఱును నొకరితో నొకరు గుసగుసలాడుదురు.)

లవం—(తనలో) అయ్యో! తప్పఁజదువునేమో గదా. జగజ్జననీ! నీసాహాయ్య మిప్పు డావశ్యకము.

రాయ—(కనులువిప్పి) ఇదిగో చదువుచున్నాఁడను. మీరు పుస్తకము చూచు చుండుఁడు.

కవు—(కడు శ్రద్ధగా వినుచుఁ బుస్తకము చూతురు.)

(అందఱును నిశ్శబ్దముగా విందురు.)

రాయ—బిస్మిల్లా......సైనాహుకితాబ. (మొదటినుండి చిగురువఱకును జదువును.)

(అందఱును విని కరతాళములు వైచుచున్నారు.)

లవం—(పరమానందమును బొందుచుఁ జూచును.)

మల్లి—సఖీ! యికఁ నిన్నుఁ గోరుకొనెడి వేళ వచ్చుచున్నయది.

రాయ—చేయెత్తి వారించి మరల వినుఁడు. దీని నే తలక్రిందుగాఁ జదివెదను.

(అని పదముల వెంబడిని గాక యక్షరముల వరుసగాఁ జదువును.)

ఫాదు—(పరమానందమును బొందుచు స్వయముగా లేచి వచ్చి కౌఁగిలించుకొని సింహాసనముమీఁదఁ గూర్చుండఁ బెట్టుకొనుచున్నాఁడు.)

(అందఱును కరతాళములు వైచి యానందింతురు.)

లవం—(పరవశయై తెరయెత్తును.)

మల్లి—(ఎఱుఁగనియట్లు మరల దాని సవరించును.)

రాయ—సింహాసనమునుండి లవంగిఁ జూచి (తనలో) నాప్రియురాలు సఖీసహితయై యిచ్చటనే యున్నదే! కానిమ్ము కోరుకొమ్మన్నచో మఱియొకటిఁ గోరుకొనక యీనిధానముం గోరెద.

ఘాదు—(రాయలవంక దిరిగి) మీ కింతకుమున్నే మా సామంతరాజు లొసంగిన పండితరాజబిరుదమును మరల నే నొసఁగుటకు సిగ్గిలుచున్నాఁడను.

మంత్రి—అట్లేల యనవలయును? బిరుదు లిచ్చుటకు వా రెవరు? ఒకవేళ నిచ్చినను అది యిక్కడ స్థిరపడవలయును. గనుక తాము స్థిరపఱచుట పునరుక్తము కాదు.

కవు—దేవరవారు మున్ను మమ్ము వర్ణింపుఁడని యాజ్ఞాపించిన విషయ మిమ్మహాకవివరున కిచ్చిన నెట్లు పూర్తి యగునో?

విదూ—ఇహిహీ ఇదే కదా! చిటికెలోఁ బూర్తి చేయించఁగలను. మీకు లక్ష్యము కాని మాకు లక్ష్యమా? అయ్యా! వినుఁడు స్త్రీలకు శృంగారరసోపకరణము లగు నవయవములెల్లఁ బురోభాగమం దున్నయవి కదా? జడకూడ నట్టిదియే యగుటచే నది వెనుక నుండుట కేమి కారణమని యడిగియున్నారు.

ఘాదు—(నవ్వి) మనప్రచండమిశ్రునకు సర్వమును హృద్గతమే. అందులో నిట్టిసంగతులు బొత్తిగా మఱవఁడు.

మంత్రి—(వారించి) నీ కేమి బుద్ధియున్నదా? లేదా? ఇయ్యది యెచ్చటనగుచున్న సభయని నీతాత్పర్యము?

ఘాదు—వీరి నడిగి తెలిసికొనఁ దగినదే యైనను నింక శ్రమ కలుగఁజేయుటకు నామనసొప్పకున్నయది.

కవు—శ్రమమైనను నియ్యది వారికి నాశుధారాశుద్ధికి గొప్పనిదర్శనముకదా?

రాయ—ఇదుగో వినుఁడు.

సీ. పురుషాయిత మొనర్పఁ బూఁబోడి కటిసీఁద నాట్యమ్ము నల్పు పుణ్యమ్ముకొఱకొ
ఘననితంబస్థల మ్మను పెన్నిధానంబు బహుళభద్రముగను గాపాడుకొఱకొ
తా నాశ్రయించు కాంతకు వెన్కభాగమ్మునను గూడ సౌందర్య మునుచుకొఱకొ
పదిమందిదృష్టులు పడినఁ గంటకమంచు నూహించి కనుపడ కుండుకొఱకొ
తే. వేణి కాంతల వెన్నంటి వ్రేలుచుండె లేక యుండిన నిధువనలీల కుపచ
రించు నంగమ్ము లెదుట నే సంచునించ దాని కట్లుండ నేయుపద్రవము వచ్చె.

(అందఱును సంతసించుచున్నారు.)

ఫాదు—పాపము వానికేమియుపద్రవము వచ్చినదో? మన మెట్లు గుర్తింతుము?

రాయ—(తనలో) అఖండరసికుఁడు గదా ప్రభువు! (ప్రకాశము) గుర్తింపకేమి?

మ. ఎదుటన్ వర్తిలునట్టి యంగముల కెంతేని న్నఖాదిక్షతా
పద పల్మారును గల్గుసంగతిని దాఁ బ్రత్యక్షమున్ జూచి నె
మ్మదిలో భీతిలి చాటు గోటనుచు సంభావించి వెన్నంటుచున్
బొదలన్ బోలును వేణి లేకునికిఁ దాముంగుండ కట్లుండునే?

(అందఱును మఱింత సంతసింతురు.)

ఫాదు—(సింహాసనమునుండి లేచి) పండితరాయా! నీవు మనుష్యమాత్రులలోఁ బరిగణింపఁ దగినవాఁడవు కావు. నన్ను నీ వేమికోరుకొనినను నిచ్చుటకు సిద్ధముగా నున్నాఁడను.

(అంగఱును లేచి నిల్తురు.)

లవం—(తనలో) దేవీ! నీ వియ్యెడల నన్నుఁ బ్రతికింపుము.

రాయ(లేచి)నే నేమి యడిగినను మీ రిచ్చువారే కదా?

లవం—(తనలో) అవును ఇట్లు ముమ్మాటికి ననిపించుకొనవలసినదే!

ఫాదు—ఈసార్వభౌమపదవి యిమ్మన్నను నిచ్చుటకు నాకు సంశయము లేదు.

రాయ—

చ. గజముల నెల్ల మేటితురగమ్ముల నెల్లఁ బురమ్ము లెల్ల నీ
భుజపరిపాలితం బఖిలభూమియు నెల్ల మఱొండు నెల్ల భూ
భుజ! విను మాడియెన్నఁటికిఁ బొంకనివాఁడవయే నొసంగుమ
య్యా! జగదతీతమైన సొబగంది చెలంగు లవంగి నీసుతన్.

ఫాదు—(ఆశ్చర్యమును నొకింతకోపముం గూడ సూచించును.)

(ఎల్లరును విస్మయాకులులగుచున్నారు.)

లవం—(భయసంతోషములతోఁ తండ్రివంకఁ జూచుచున్నది.)

రాయ—

చ. నరవరులెల్ల నెవ్వనికనత్పదపీఠము నాశ్రయింతు రే
ధరణిపుఁ జూచు మాత్రమునఁ దాఁజనులేమి దివంబునేలు నా
సురపతి యెవ్వనిన్ వినినచోఁ దలయూఁచు నతండు మామయై
పరఁగుటకన్ననున్ గలదె? భాగ్యము భోగ్యము లేక యోగ్యమున్.

ఫాను—(చిఱునవ్వు నవ్వుచున్నాఁడు.)

రాయ—

శా. ఢిల్లీ యేలెడిరాజధానియఁట! ధాటిన్ విన్నమాత్రమ్మునన్
గొల్లల్ వోలె నృపాలకుల్ దలఁకుచున్ గోటానకోట్లర్బుదాల్
సల్లాభమ్ములు తెచ్చికూర్తురఁట! యీసామ్రాజ్యమున్ గాదునీ
యిల్లుం డన్నపదమ్ములతోడసరి నాయాహ్లాదమట్లుండుటన్.

సీ. అన్నమాటకుఁ దప్ప కఖిలమిచ్చిన హరిశ్చంద్రభూపాలుతో సాటి గనుము
అడితప్పక భూమి నఖిలమ్ము నొసఁగిన బలిచక్రవర్తితోఁ గులకుఁజనుము
కొంకక దేహమ్ము కోసిత్రాసునఁదూచి మాంసమిచ్చిన శిబిమాద్రిఁ బడుము
వెనుకదీయక తనవెన్నెమ్మునిచ్చిన యలదధీచిప్రశస్తి నందుకొనుము

తే. అన్నిటను వారినెల్లఱ నవలఁద్రోయఁ జాలియిప్పట్టునందు నీసాహసంబు
జితము గాదని యెంచి గోరితినిజమ్ము యనుపమితమానదాన! శహాబదీన!

సీ. పరదేశసంపాదనరతి మీకు నరేంద్ర! పరదేశసంపాదనరతి మాకు
లసదుత్తమపదాభిలాష మీకు నరేంద్ర! లసదుత్తమపదాభిలాష మాకు
సకలనుత్యశ్లోకసక్తి మీకు నరేంద్ర! సకలనుత్యశ్లోకసక్తి మాకు
మనుమార్గవర్తనం బనువు మీకు నరేంద్ర! మనుమార్గవర్తనం బనువు మాకు

తే. మీకు రాజపదము మాకును గవిరాజపదము గల దిఁకెంతుఁ గొదువ లేదు
గాన సామ్య మిచ్చి మానించు టొప్పదే! యమితదాన! యోశహాబదీన!

సీ. ఒకరాజు మున్నిచ్చె నకలంకచరితయౌ కన్నెమిన్నను మాయగస్త్యమునికి
మఱియొక్కరాజిచ్చె మహిళాశిరోవతంసము నాత్మజాత మాచ్యవనమునికి
నింక నొక్కరాజిచ్చె నిందిరాసుందరాకృతిఁ గూఁతు మాఋశ్యశృంగమునికి
వేఱొక్కరాజిచ్చె వెలలేనిచెలువ మింపగుకూఁతు మాజమదగ్నిమునికి

తే. మొన్నమనాదభిరాముఁడన్ భూపుఁడొసఁగె నాఁదనకూఁతుమాబిల్హణకవిమణికి
ద్విజుల కిలఁజక్రవర్తులాత్మజల నిడుట అప్పుడు గల దిప్పుగలను శహాబదీన.

ఫాను—కవిసార్వభౌమా! నీకుఁ గన్నియనిచ్చుటకు సందియము మాకెంతకుఁ గలుగ
వలదును. ఇదిగో యిచ్చితిని.

మంత్రి—పరిగ్రహించుటలో వారికి సంశయ ముండనిచో నియ్యది సర్వోత్తమమే.

క. రూపమున నిస్తులుండు గదా! పాండితి నసదృశుండు తరుణవయస్కుం
డీపురుషోత్తముఁ డేమిఁట లోపం బక్కన్నెయైన లోశంకింపన్.

T. 1117

లవం—(తనలో) మంత్రి చక్కఁగాఁ బలికినాఁడు నన్నిదివఱకే యిచ్చుకొంటిని. వీరు నిమిత్తమాత్రులు.

మల్లి—(జనాంతికము) ఇక్కడికి నీకోర్కె ఫలించినదికదా? పెండ్లియాడుట కొప్పుదువో లేదో యని మీతండ్రిగారికి సంశయము బాధించుచున్నదేమో అది నేను పోయి తీర్తునా?

లవం—(చురచుర చూచుచున్నది.)

రాయ—(కూర్చుండును.)

ఘాసు—(ప్రక్కనే కూర్చుండును.) (అందఱును గూర్చుందురు.)

విదూ—(లేచి) అయ్యా! వరుఁడు మాజాతివాఁడు గనుక వివాహము మామతాను సారముగా జరగవలెను జుమీ! (అందఱును నవ్వుదురు.)

లవం—(తనలో) ఈవెడఁగుబాపఁడీమాటలలో గుట్టుబయలఁ బెట్టఁడుకదా!

విదూ—అయ్యా! నవ్వకుఁడు. నాదొక్క చిన్నమనవి; ఈయన మీపిల్లను బెండ్లాడుచున్నాఁడు కదా! పెండ్లిలో మీరు పులావు చేయించినప్పుడు వద్దనునేమో!

కవు—మాకన్యను పెండ్లాడునపుడు దానినిమాత్ర మేలుకైకొనఁగూడదు?

మంత్రి—ఎవఁడురా అక్కడ?

ప్రతిహారి—(ప్రవేశించి) ఆజ్ఞాపింపుఁడు.

మంత్రి—

మ. నిలువన్ జేయుఁడనంటికంబములు పన్నీరత్తరుల్ కోటలోఁ
గలయన్ జల్లుఁడు తోరణమ్ములను వేగట్టుండొగిన్ దోరణాల్
పిలువన్ బంపుఁడమీరులన్ గురుమునన్ వేత్వేఱ సాటింపుఁడే
కలిగె న్నేఁటికిఁ జక్రవర్తితనుజాకళ్యాణమున్ జూడఁగన్.

ఇట్లు నేవానఁజెప్పితి నని యాయా సముద్యోగులకు వేర్వేఱుగాఁ జెప్పుము.

ప్రతి—చిత్తము. (నిష్క్రమించును)

విదూ—సరే! మీ రప్పుడే మాహిందూమతములోఁ జేరుచున్నారే. ఇంతకుమున్న మమ్ము మీలోఁ గలిపికొనుటయే కాని మీరు మాలోఁ గలియుట లేదు.

మంత్రి—ఇది హిందువులకును దురకలకును జరగువివాహ మని తెలియుటకే యిట్లేర్పఱచితిని.

(తెరలో.)

కం. ఇటుకై యెత్తగు మేడల, వరుసల నలగారు సందుపట్టులఁ గూడన్
సరసిజబాంధవకిరణో,త్కర మది వాహ్యాళిఁ జేయఁగాఁ దొరకొనియెన్.

ఘాదు—(చూచి) మధ్యాహ్నముగూడ నతిక్రమించుచున్నదే, ఇఁకనిప్పటికిఁ గచ్చేరి చాలింతము.

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ...గురుపతి వేంకటేశ్వర విరచితంబగు పండితరాజమ్మునందుఁ

జతుర్థాంకము.

# పండితరాజము - పంచమాంకము.

(అంతట గోదావరియుఁ గంపయుఁ బ్రవేశింతురు.)

గోదా—సఖీ! కంపా! మీ అప్పయ్యదీక్షితులును, భాగీరథిగారి భట్టోజిదీక్షితులును గలిసి మా జగన్నాథపండితరాయలను వెలిఁబెట్టినారఁట.

కంప—మా నాఁడేమి విని నెఱుఁగనఁట, భట్టోజిదీక్షితులే దీనికి ముఖ్యకారకుఁడు.

గోదా—పోనీ యెవరు కారకులైననేమి? వంశపరంపరగా నా యొద్దనుండి స్వతఃపవిత్రతఁ గాంచిన నుప్పెడికులమ్మునఁ బుట్టి యేమో చిన్నతనముచే నొక్కింత లోపము చేసినంతమాత్రమున నా మొగమైనఁ జూడక వెలిఁబెట్టించుట భాగీరథికి నంగీకారముగా నున్నదికదా!

కంప—అయినను గాకపోయినను మనవానిని మన మనుకొనఁగూడదుగని ముట్టుకొని నేఁ దనువు గోసికొనఁ దగు పతులపిల్ల నేమనికట్టుకొనవలెను? ఆబిడ్డయైనను మనకన్నఁ గొంచె మెక్కుడుమహాత్త్వము గలదికాని, యట్టిపాపాత్మునిఁ బవిత్రునిఁ జేయఁగలిగినదా? అదిగాక, యీయుగమందు నదులయందేమి, దేవతలయందేమి మహాత్త్వము తగ్గునని విశేషజ్ఞులు చెప్పుచున్నారు.

గోదా—ఆసంగతిలో గంగను వదలి వేయవలెను జుమా.

కంప—పోనిమ్ము. ఆలాగైనను నొకరా? యిద్దరా? అందఱును నపాత్రులే బయలుదేఱుచుండుట నీ వెఱుఁగనిది కాదుగదా? ఎంతవారిని పవిత్రులఁ జేయఁగలదు. పాపము! అదిగాక నీవిట్లు చెప్పుచున్నావు కాని భాగీరథినిఁ గూడ పెలటితోఁ బాటుగానే తలఁచువారు నీయొద్దనే యున్నారని విన్నాను.

గోదా—ఇఁక నా యవస్థ తలపెట్టకుము. "కడుపు చింపుకొంటే కాళ్లమీదఁ బడుతుంద" న్నట్లున్నది, ఏమి చేయుదును. అంతలో నీమధ్య నొక కొందఱు గుండగులు బయలు దేఱినారు. మడిలేదు, మైల లేదు. గ్రహణపుణ్యకాలములలోఁ గూడఁ దాము మునుఁగరు సరికద, పూర్వాచారపరాయణులు లెవరేని యొక్కడివారుగాని దూరదేశస్థులుగాని వచ్చుటకు యత్నించిన నేదో యొక ప్రతిబంధము కల్పింతురు మనకును నూతినీటికిని భేదమే లేదని వారలవాదము.

కంప—అట్లయినచో నిప్పుడు నీయుపయోగమే వారలకు లేనట్లున్నది.

గోదా—లే కేమి నేను లేకపోయిన నేని మాఁడి చత్తురు. విశేషించి ప్రవహించినప్పుడు చెరువులలోఁ బెట్టుకొని పంటలు పండించుకొందురు. కొన్ని మెఱకభూములు నా సంపర్కమున బలమెక్కి మిక్కిలిగా ఫలించును. వంటచెఱకు తీసికొని నిలువచేసి కొందురు. బ్రతుకే నాతోనున్నది. భక్తివిశ్వాసములు మాత్రము లేవు.

కంప—"రోలొచ్చి మద్దెలతో మొఱపెట్టుకొంది." అన్నట్లు నేను జెప్పినచో నాశ్చర్యపడవలసివచ్చును. నాయొద్దనను నిదియె కష్టము. మొన్నఁగా వేరయుఁ, గృష్ణయు నొకదినమున నిదే సంగతిని గుఱించి మాటలాడికొన్నారు. ఇందులో నిప్పటికి మనమే మెఱుఁగు. కావేరిపని మఱియుఁ దేలికగా నున్నదఁట. అక్కడివాండ్రందఱును సకలకష్టములును దనలోనే కలుపుదురని విచారింప మొదలుపెట్టినది.

గోదా—అభిమానముచేత దాచిపెట్టుచున్నావుగాని యీ యనాచారము నిన్ను మొదలుకొని యే ప్రారంభము. భాగిరథికి మాత్ర మీకష్టమిప్పటికి లేదు; సరికదా మంచిదై ననుండెడు వారలకు భక్తియెక్కువ, మునుపు లేదుగాని యిప్పుడు నాకును, గృష్ణకునుగూడ నిట్టిదురవస్థ వచ్చినది.

కంప—బాగుగ నెఱుఁగవుగాని కాశిలోఁ జూడవలెను గంగదురవస్థ! తలఁచుకొనినచో నొడలు పులకరించెడిని. ఏమైనను నీవన్నట్లు వారలకు భక్తియెక్కువ. అభక్తి మావైపు వాండ్రకును గలదు. కావేరివాండ్రకుఁ జెప్పనే యక్కఱలేదు. అడుగ మఱచితిని నీయొద్దననిప్పుడు యజ్ఞశాల లేమైన నున్నవా?

గోదా—"కరిపోసినను నుట్టివంకకే చూచిన" ట్లున్నది. ఎక్కడనో యొకయజ్ఞము జరిగిన నేమిలెక్క; నాయవస్థయడుగకు. సిగ్గుపొడముచున్నది.

కంప—అట్లయినచో నీవు మావలె నసమర్థురాలవు కావుగదా ఎందు కూరకుంటివి?

గోదా—అనాదిసుప్రసిద్ధలమగు మనకు వీరల యాదరానాదరములతో నేమిపని? ఊరక యట్లంటినిగాని పట్టణములలోఁ దప్ప పల్లెలలో నింకను నాయెడల మునుపటివలె భక్తి గలవారనేకు లున్నారు. కొందఱు మూర్ఖు లున్నంతమాత్రన తక్కినవారి మొగము చూడవలదా? ఇఁకఁ గొంతకాలమునకు మాత్రము సర్వసామాన్యమగునని తోఁచుచున్నది.

కంప—ఈ యనాచారములు సహింపలేకయే కాఁబోలుఁ గృష్ణ యొకసారి నాథునితోఁ జెప్పినదఁట. అప్పుడు లోలోపల మండిపడి దానియొద్దనున్న యూళ్లు కొన్ని దిబ్బచేసెనఁట.

గోదా—వెఱ్ఱిపని చేసినది. మనమే కొంచెము బెదరించవలెను గాని అట్లు చేయవచ్చునా? తల్లియున్నంతయోరుపు పిల్లలయెడఁ దండ్రి కుండునా? నేనప్పుడప్పుడు కొంచె ముద్రేకము చూపఁగా నంతకే సకలమైన చిక్కులును బడియెదరు. అట్టిసంగతిలో నాథుని యుద్రేకముసహింప వీరలెంతవారలు.

కంప—మన మెంతదాచిపెట్టినను నుదకాయనకుఁ దెలియకపోవునా అప్పుడెట్లును బ్రపంచము నశించును.

గోదా—పోనీ, అంతవఱకుండునుకదా. అది యింతలో జరగనులే. పండ్రెండు వత్సరము లేకరీతిగా వేదశాస్త్రప్రచారము బొత్తిగా లేకయుండవలయునని కదా పురాణములు చెప్పుచున్నవి. దీనికేమి, అంతగాఁ జిక్కియున్నావేమి?

కంప—“ఏనుఁగు లేటఁ గొట్టుకపోగా నక్కపాటు రే వడిగిందఁట” మీవంటిస్త్రీల నిగ్రహాలే చిక్కితిప్పలఁ బడెడియీమందు వేసవిని మామాటయడుగవలయునా.

గోదా—మనమాట కేమిగాని పుట్టింటిచలువను బట్టి కాఁబోలును గంగమాత్ర మింతశుష్కింపదు. ఈపాటి కప్పుడే తండ్రి మంచిమంచుగడ్డ పంపించుచుండునఁట. నాలుగడుగులు పోయివత్తమురా. భాగీరథితో మారాయలను గుఱించి కొంచెము మాటలాడవలసియున్నది.

కంప—నేనును బోయిచాలకాలమైనదివచ్చెదను. బహిష్కారావమానమునుసహింపక తనలోఁ బడఁబోయినప్పుడేనిఁ గరుణింపుమనియేగా నీవుచెప్పవలసినది.

గోదా—అంతపని చేయఁడు గాని, యేదో విధముగాస్తుతిచేసి ప్రసన్నురాలనుజేసి కొనఁగలదు. నేను వేఱే చెప్పనే అక్కఱలేదు. ఎందుకేనియు నొకసారి పోవలె ననియున్నది. తెల్లవారుజాము కావచ్చినది. స్నానసమయమునకు బోఁగలుగుదుమా?

కంప—పోకేమి పద. (అనినిష్క్రమింతురు) (ఇది విష్కంభము.)

(అంతటరాయలు లవంగితో సౌధసమీపమున సోపానములపైఁ గూర్చుండి ప్రవేశించును.)

రాయ—తరువాత. తరువాత.

లవం—వెనుకఁ దమతోఁ జెప్పినచొప్పుననే యంబిక పొడకట్టినది.

రాయ—పునరుక్తిగా భావింపక యాపెరూపమును విస్తరించివచింపుము.

లవం—(తనలో) ఏమో ఈనాఁ డిట్లడిగినదేయడుగుట (ప్రకాశము) ఆజగజ్జనని రూప మిట్లున్నదని నేను వివరింపఁ జాలను చూచుమాత్రముననె నాకుఁ గనులుమిఱుమిట్లు గొల్పినవి.

రాయ— పోనిమ్ము నాలుగుబాహువులున్నవి కదా.

లవం—అంతవఱకుఁ జూచితిని. ఒకచేత మీప్రతిమధరించినది. దానిలోనే పద్మము కూడనున్నట్లున్నది. తక్కిన చేతులలో నాయుధాదులున్నవి.

రాయ—అట్లయిన నాపె ప్రతిమూర్తిజననియగుట కించుకయు సందియముండదు. కానిమ్ము స్త్రీపుంనపుంసక భేదశూన్యయగు య్యొ లోకప్రవాదమ్ము ననుసరించి కాఁబోలు నీ యెడఁ బక్షపాతము గనఁజేసినది. ఇంతకు నాపె చెప్పినముఖ్యాంశమేమి?

లవం—నీవు హీనజాతియందుఁ గారణమాత్రజన్మవనియు, నియ్యదియేని యపరాధ మాత్రమే యనియు నీకు నగ్రవర్ణసంజాతుండును, నఖండరూపయౌవనోపేతుం డును, సకలవిద్యాసాగరుండును నగునొక మహాపురుషుండు కొలఁదికాల మ్మునఁబతి కాఁదగి యిప్పట్టనమ్మునకు వచ్చియున్నవాఁడు అతనిరూపరేఖావిలాసమ్ము లిట్టివి యనియు మీప్రతిమఁ జూపెను.

రాయ—తరువాత. తరువాత.

లవం—నే నంతమూర్ఛవడి కొంతవడికిఁదెలిసి నాపూర్వజన్మ వృత్తాంతము సాంత ముగా నెఱుఁగుదుమనియు నాకాప్రతిమ నిమ్మనియు నెంతప్రార్థించినను నంగీకరింపక తుదకు రెంటనొక్కవరంబు ప్రసాదించెదఁ గోరుకొమ్మనియెను.

రాయ—నీ వేదికోరితివి?

లవం—ఆర్యపుత్రునియందొకమొక్కసారి చూచుమాత్రమున నాకుమనోగతమగుకతన నిఁక నీపరమరహస్య మెవరులవలనఁ దెలియఁబడఁదనియెంచి యదియే కోరితి.

రాయ—ఆసంగతియే యిప్పుడు మనకుఁ గావలసినది. యామె యేమని యానతిచ్చినది?

లవం—పూర్వమునసీవు సరస్వతివనియును నాపె యొకనాఁడు తనభర్తఁ జూచి "లక్ష్మి కింతయైశ్వర్యమేల నా కేలలే" దని యడుగుడు నాచతురాననుఁడు హేలగా "నీ కట్టి యిచ్చయేని తురుష్కకులమ్మునఁ బొడమెదవా"యని యడుగ, నందులకాపె స్త్రీస్వభావసులభమ్మగుచాపలమ్మున నొడఁబడియును,"ఆజన్మమునను నీవ నాకుఁ బతిగాకతీఱ దనుడు నతఁడు తనకుఁ "దురుష్కకన్యాసమాగమము దొడరుఁగదా" యని చింతించి దాని కిదివఱలోఁ బ్రచండమిశ్రునివలనఁ దాము వినినవిధమ్ముగ నే సంఘటింపఁజేసెననియును జెప్పి యంతర్హిత యయ్యె.

రాయ—(తనలో)ఇందు సందియమే ముండును(ప్రకాశము)చెలీ! నే నిప్పుడు నీకు వేఱే చెప్పనక్కఱలేదు గాని మనయాథార్థ్యము ప్రపంచమునకు వెల్లడించి వచ్చిన యపయశముం బోఁగొట్టుకొన నేనీగంగామహాదేవిని సాక్షిగాఁగోరుచున్నాఁడను.

ఆ పెయొక వేళఁ గలుగఁజేసికొననిచోఁ బ్రాణత్యాగంబొనరించెదను. ఇందులకు నీకును నంగీకారమే కదా.

లవం—నేననివేలుగ నున్నచోఁ దమ రట్లు సెలవీఁ దగును. సూర్యుని విడిచి కాంతి యెచ్చట నుండును.

రాయ—(తెరతీసి చూచి) అదిగో, భట్టోజిదీక్షితులును, అప్పయ్యదీక్షితులును, శిష్యులును, మఱికొందఱు మహావిద్వాంసులును స్నానార్థమరుదెంచుచున్నారు. దీని కిదియే సుసమయము.

(అంతట పైవారు ప్రవేశించుచున్నారు.)

లవం—నాథా! వేసవియగుట చేఁ గాఁబోలుఁ గంగ కడుఁజిక్కియున్నయది.

రాయ—జలోపమే యిప్పుడు నేను దీర్పఁబూనినది. ఏకాగ్రచిత్తురాలవై యమ్మహాదేవిని స్మరించుచుఁ గూర్చుండుము. (అని బిగ్గరగా)

శా. గంగాతీరనివాసు లెల్లరుఁ బ్రజ్ఞన్ జక్కన్ నాలింపుచున్
శృంగారాంగిఁ దురుష్కకన్యకను నే నిల్లాలిఁగాఁ గొంటినం
చుం గాలుష్యము నిర్ణయించి నను శిష్టుల్ బాహ్యుఁగాఁ జేసినా
రంగీకారమె నాకు స్వర్ధునికి రాదా? లోప మిప్పట్టునన్.

(అందఱును వినివారివంక చూతురు.)

భట్టో—(అప్పయ్యదీక్షితులతో) అదిగో, రాయలు సిగ్గులేక తానే కాక యాతురక దానిన్ గూడఁ దగుదునంచు దగ్గరఁ గూర్చుండఁ బెట్టుకొనియున్నాఁడు.

అప్ప—ఆహాహా! బ్రాహ్మణ్యమున కేమి గాని, ఈయనను వ్రతము చెడినను ఫలముమాత్రము దక్కినదనుట కించుకయును సందియము లేదు. ఏమియీ చక్కఁదనము.

రాయ—(దోసిలిఘటించి)

(1) తే. అవనిపాలిటిభాగ్యంబు శివునిరేఖ, ఆగమఘనంబు కవులభాగ్యోదయము
సుఘనుఁ బుట్టిల్లు నీనీటిసోయగంబు, తల్లి! నాయశుభంబుల ద్రోల్లఁ జేయు.

(2) తే. అతిదరిద్రుల పాపమ్ము పతితజనుల, తాపము నొకింతలోఁ బాపుత్వాత్ప్రవాహ
మనుపమాజ్ఞానవృక్షభంజనసధాయి, నాకొసంగుఁగాక పరమానంద మంబ.

(3) క. హరునిశిరమ్మున గౌరీ, తరుణాయణద్దృష్టిశిఖలతాఁకున శోధం
బొరయుచు మెఱసెడినీదగు, తరఁగలు జగదంబ! జగము దనుపుం గాతన్.

(4) క. ఈ పుంటివ నెడిగర్వము, చే విష్ణ్వాదులను లెక్కఁజేసియెఱుఁగ నో
దేవి! యిపు డడ్డపడవే, నే వారికి మ్రొక్కలిడుచు నెవ్వరుపింగర్.

(5) క. స్మరియించినంతనే దు,ష్కరితాత్ముల నకృతసుకృతసంబంధుల ను
ద్ధరణ మొనరించునీ చల,హరి నాతాపత్రయమ్ము నడఁచుకొ దల్లీ!

(6) తే. ప్రాజ్య మగు రాజ్యమును గడ్డిపరక వోలె, నొక టద్యజించి నీతీర మొగి భజించి
కడుపు నిండఁగ నినుఁ ద్రోలఁగలుగువారి, మోదమంబరో! ముక్తికి మూఁడు రెట్లు.

(7) తే. రాచరమణులు స్నానమ్ము లాచరించు, నెడల మృగమద మదినిన్ను నెనసియుంత
దనుక నుండు నెయ్యంబ! యందనుక నామృ,గములు నందనవనమునఁ గాంచు సుఖము.

(8) క. స్మరణమున నశించు పాపో,త్తరణం బొకమాఱు వలుక, దక్కించెడి యు
క్కరములు "గంగా"యనునివి, మరణమ్మున నంబ! వదనమండలి నుండుఁగా.

(9) క. ఏ నీదరకాకమ్ముల, కేనిఁగా స్వర్గచ్ఛలేమి యె నిక్కమొ నా
కానీతీరము జనిమగ, దానంత్యహరమ్ము ప్రేమను నడఁపదె జననీ.

(10) క. శ్రుతివాక్యాతీతమ్మై, మతికి నగోచరమునై స్వమహిమ మహాత్యతమో
గతమై శుద్ధంబగు నా,త్మతత్త్వమననీవ యింతతధ్యము జననీ!

భట్టో—(ఆశ్చర్యముతో) ఇది యేమో! గంగ నేఁడు కొలమ్మున నింత వృద్ధి చెందుచున్నది.

అప్ప—ఈ వేసవిరోజులను హిమగిరినుండు మంచుగడ్డలు కరగి యిట్లగుట కలుగుకదా?

భట్టో—అదియే యైనచో నింతలో నింత వృద్ధికిఁ గారణము కొలఁ. మాడుఁడు ఒక టియా! రెండా! అప్పుడే పదిమెట్లెక్కినది.

అప్ప—అగును. క్షణమేమై యుండునో.

(అందఱును క్రిందిమెట్లనుండి పైకితప్పుకొనుట నభినయింతురు.)

గాయ—

(11) తే. జన్నములు చేసి, తపములు సలిపి, దాన,ములు పొనర్చియుఁ బడయని ముక్తిపదము
సర్వసాధారణముగా నొసంగు నిన్ను, నెవరితో బోల్ప నేర్తు లోకైక జనని!

(12) క. ఏనిన్నుద్ధాంగికొకిం, తేనిఁ దలఁచుకొనక నెత్తి విడుకొనె హరుఁడేఁ
ఖానాశితకల్మష నం,బా! నీమూర్తి మహిమ మది వాచ్యంబగునే.

(13) తే. వ్రాత్యులకును పాతులులకుఁ బతితులకును, బిశునులకుఁ గూడ నేవమ్ము పెంచుపాత
కము లొనర్చునీచులఁ బ్రోవఁగా నొకప్డు, విసువు గాంచని దానవీవే యదంబ!

(14) తే. జనులతాపంబు హరియింప జగతి కురుకు, నిన్ను బంధించె జడలలో నీలకంఠు
డంబ! యది నీదుగుణములయందుఁ గలుగు, దోసమే కాక లోభియే యీసవారి.

(15) తే. జడులు మొదలగువారల కీర్తిహీను,లగుచు సుర లూరకున్న నయ్యెదనుఁ జూచి
నరకమునఁ బడకుండ గ్రన్నన సుగతికి, ననుచుపరమార్థంబ వోయంబ! నీవు.

(16) తే. సహజశీతలమును శుద్ధిబహుళమునగు, నీజలంపు మహత్వ మనీదృశంబు
దీని నేకద! సగరజుల్ దివినుతింతు, రిప్పటికి మేనఁబులకము లెసక మెసఁగ.

(17) ఉ. ఇంతలు నంతలుఁగా న్దొసఁగు లేవరులే నొనరించి యేనదీ
ప్రాంతము జేరి యేనియును బావనతఁ గనవచ్చు నంబరో
యెంతకు నెంతలో దొసఁగు లెట్టిప్రతిక్రియకు న్నశింపకు
న్నంతటి వాచరించుఖలులందఱి కీ నొకయీవ ప్రోవఁగన్.

(18) తే. ధర్మనిధి, మోదదాయి, తీర్థమణి, ప్రభువ, నీసరికి వెల్లచీర, మనీష తెలవు
ముక్తవి నాశకాలంబు, మూతసిరికి, నంబఁ నాతాప మడఁచు నీయంగకంబు.

(19) తే. ధనసురాపానమత్తుల ధరణిపతుల, నాశ్రయించుచు నిను వీడి యఖిలవిధము
లైన ఖేదమ్ము లందుచు నాత్మహితము, నెఱుఁగనిజడుండు దీనిసహింపు మమ్మ!

(20) తే. గాలిచేఁ దూఁగుతరఁగలఁ గదలుతమ్మి, పుష్పాదుల నొప్పి యచ్చగపూవుఁబోండ్ల
గుబ్బలందలియగురున గుబురుకొనెడి, నీజలము నాజననబాధ నీఱుసేయు.

అప్ప—(పరమాశ్చర్యముతో) దీక్షితులు గారూ! చూచుచున్నారా యెంతలో నిరువది
మైళ్లెక్కైనదో పర్వతములలో నొకప్పు డకాలవర్షము గురియుటచేతఁ
జామండీ యిట్లు తటస్థించుట.

భట్టా—అకాలమే కాదు. తొలకరి సమీపించినదికదా కొంచెము మించుమించుగా
ఋతుధర్మములు పూర్వులు వ్రాసియున్నారు గాని, అంతులోఁ గొన్ని వెనుకముందు
ఋతువులలోఁ గూడఁ గన్పట్టుచునే యుండును. కానినీటియందుఁ గాలుష్య మించు
కయుఁ గన్పట్టదు.

అప్ప—అవును. తా మనినట్లు బహుస్వచ్ఛముగా నున్నయది. ఇదియేదో విచిత్రముగా
నున్నదే!

లవం—(మెల్లఁగా) నాథా! అప్పుడే గంగ యెన్నిమైళ్లెక్కైనదో చూడుఁడు. జను
లందఱును బైకిఁ బరుగులెత్తుచున్నారు.

రాయ—(వినక తదేకదృష్టితో.)

(21) ఉ. పుట్టినపుట్టువా! జలధిభూధవపాదనఖాగ్రసీమ, పై
మెట్టినచోటు సాంబునియమేయజటాభవనంబు! వర్తనం
బెట్టియఘమ్ములేని హరియించి సురాత్ములప్రోపు నీకు నె
ప్పట్టున గొప్పలే దఖిలపావని! దేవనివాసధావనీ!

(22) చ. నగములనుండి తా మనుదినమ్మును బాఱునదీగణమ్ము తె
న్నిగలవు సాంబుశీర్షమున నిల్వఁగ నేర్చెనె శ్రీశుపాదప
ద్మగతరజంబు వోఁ గడుగుధన్యత గాంచెనె? యొక్కఁడేని, నిన్
బొగడినవోట నేనదిని బోలు నుతింప? నదీశిరోమణీ.

(23) తే. అజునిఁ దపమాచరింపని మ్మహీశయమని, నిద్రఁ బోనిమ్ము హరు నాడనీ ప్రకృతి
యటను దానయజ్ఞాసులు నడుగుఁబట్ట, నిమ్మఖల మిచ్చు నీవ మాయమ్మ! చాలు.

(24) సీ. అనదలలోన నే నగ్రగణ్యుండ నీహృదయంబు ప్రేమసంపదకుఁ దావు
ఎంచను గతి లేనిహీనుండ నేను దివ్యగతిప్రదంబు నీదైనపట్టు
పఠించు లేమను నున్నవాఁడ నే నీవు విశ్వోద్ధారణమ్మున బద్ధదీక్ష
వాధిబాధాభగ్నశాంతమనుండను నేను సిద్ధౌషధంబు నీసేవనంబు

తే. తృష్ణచేఁ బీడితుండ నే నమృతమ వీవు, నేను బుత్రుండఁ దల్లివి నీవు నిన్నుఁ
జేర వచ్చి నెటు సేయఁ జెల్లు నట్లొ, నర్పఁగద వమ్మ! దేవి! జాహ్నవి! మదంబ!

(25) తే. అణఁగెఁగోలాహలమ్ము యమాలయమున, నెంచుఁబోచ్చిరో భటులు దుష్కృతుల
వెదక, నీకకృ తనూమి నెప్పుడు పాపుకొనియె, నష్టయిలుకయ్యెనంబ! స్వర్గపురవీధి.

(26) క. కామక్రోధజ్వరముల, చే మలమల మఱుఁగుమమ్ము శీతలవాయు
శ్రీమహితము గంగాజల, మోముల్ సంతాపమెల్ల నుక్కడఁచి కృపన్.

(27) తే. అఖిలభువనమ్ములుండుబ్రహ్మాండ మెచటఁ, దుమికిపండునుబోలెభంగములనడుమఁ
బొరలు శ్రీకంఠుజడల నొప్పగను నాప్ర, వాహముహరించు నాదుతాపంబునంబ!

(28) మ. ఎవనిన్ వైశిమ పూతుఁ జేయమికిఁ దీర్థేంద్రమ్ములెల్లన్ ద్రపా
భవనం బయ్యె భవాదిదేవత "లహో! పాపాత్ముఁ డె" ట్లంచుఁ గేల్
చెవి సంధించిరి దేవలోకధుని! యీచెట్ట న్ననున్ శుద్ధుఁ జే
సి విదారించెను వారివారియశువిచ్ఛేదంపుదర్పమ్ములన్.

(29) ఉ. మక్కలఁజంపి భక్షణము గొంకక చేయఁగ రోయ రెవ్వ రా
పక్కణవాసులున్ సలుపఁ బాల్పడలేని యఘమ్ములెల్ల నే
నొక్కటిఁ దక్కకే సలిపి యుంటి ననున్ బరిశుద్ధుఁ జేయ నీ
వెక్కటిఁ గట్టుచుంటి నడు మీ పశువంబ! నిను న్నుతించు నే.

(30) ఉ. "మాంచుచునుంటి నెన్నఁడును జొప్పడఁ డెవ్వఁడు పాపశాలి యే
నీచునిఁ బ్రోచి యీజగము నేను బళీ! యనిమెచ్చఁ జేతు నం"

చే చిర మున్న నీమనసు నిచ్చ ఫలింపఁగ వచ్చినాఁడ నన్
బ్రోచుట నీకుఁ బెద్దయశ మోజగదంబ! బహూక్తు లేటికిన్.

భట్టో—(వినుట యభినయించి) అప్పయ్యదీక్షితులుగారూ! ఆప్రవాహధ్వని వినుచున్నారుకదా! యేమి యీపరమవిరుద్ధము, కలియం దెల్లరన్ బోలె నదులును గట్టునకుం దప్పటకోఁబోలును.

అప్ప—బహుసంరంభముమీఁద వచ్చుచున్నయది. ఆదరినిఁ బైకినీడ్చి బాగుచేయఁబడుపడవలన్నియుఁ గొట్టుకొని పోవుచున్నవి. మనమింకను బైకిఁ బోవుదము రండు. (లెక్కించి) అప్పుడే ముప్పదిమెట్లు మునిఁగినవి. (అట్లొనరింతురు.)

రాయ—

(31) మ. శునకమ్మున్ బలెఁ బొట్ట కేడ్చుట దయాశూన్యత్వమున్ సూనృతం
బునకున్ దక్కుటయున్ గుతర్కములతోఁ బోరాట సద్గ్రంథవ
ర్తనమున్ నాగుణంబు లియ్యవి చెవిన్ దాఁకించి నిన్ దక్క నె
క్కనిమేషమ్మును నామొగమ్ము గనఁ డొక్కండు న్నిజం బంబరో!

(32) తే. కన్ను లెంతలు గల్గినఁ గార్య మేమి, నిన్నొకప్డైనఁ జూడఁగ నేరవేని
నీదుకలకలమును విననేరకుంట, చెవుల కగు వంచనం బంబ! సిద్ధ మింత.

(33) చ. సుకృతమొనర్చువారు చనుచోటు దివం బఘముల్ పొనర్చువా
రికి నరకం బటంట యురరీకృతమాట ప్రవృత్తిచారనా
స్తికమగుదేశమందు నినుఁ జెందినదోసము లీపిభాగ మొ
ప్పక యచరించుఁ బాపములు వాపెడిత్రోవి నీవు గల్గుటన్.

(34) తే. విప్రులను గాంచి గురుసతీవిటత మించి, కల్లు చెవ గ్రోలి కనకతస్కరతఁ దూలి
యును సుదకు నీదరినిఁ దనువ్రాల్చి జనుచు, రంబ! సోమయాజులు చనునట్టిగతికి.

(35) క. సుమనస్సౌరభచోరుం, డు మనోజాస్త్రసహాయుఁడున్ గద! యనిలుం
డమలం బగునీసంపర్కమున జగము శుద్ధిచేయఁ గలిగెడి నంబా!

(36) ఉ. ఈధరఁ గొంతమంది పర మేగఁ బరోపకృతుల్ పొనర్తు రా
ర్యాధృతి యజ్ఞకర్మములు సల్పుదు రింకొకకొంద ఱీజగ
న్నాథుఁడుమాత్ర మంబ! భువనద్వయభారము నిన్నుఁ బూన్చి యే
గాథయు లేక దాసుఖముగా నిదురించుచు నున్నవాఁ డహో.

(37) తే. వ్రాత్యులధములు నగునట్టివారిఁ జేరి, పావనము సేయ నీ కెంతపట్టుదలయొ
నాకు నంతయె పాప మొనర్చుపట్ల, సహజగుణ మేరికైని దుస్త్యజము జనని!

(38) తే. సంజపట్టున నటియించుచంద్రమౌళి, జడలఁ దనవారిప్రోతకు సరిగ లహరు
లనెడిభుజముల నభినయం బమరఁ జేసెనో, నర్తనటనంబు నాతాపమేర్చుఁ దల్లి!

(39) ఉ. అన్నిటి కీవ యుంటి వని యాగడముల్ కడుఁ జేసిచేసి యా
పన్నుఁడనైతి నీవిషమవర్తనఘుండతియుం గు నాకు నీ
మన్ననసున్నయేని యిలఁబ్రగ్గెద నమ్మిక! నిశ్చలానుకం
పోన్నతి మన్నుగాదె! జగ మూడదె? నీవ యెఱుంగుదంబరో!

(40) చ. మగనికిఁ బర్ద్దమందు నడయాడుచు నాడుచు మధ్యమస్య స్నే
హ రసమిళత్తదర్థతనువౌనల పార్శ్వప్రాపటఁ గ
స్ఫురణముచూప నాపె యెు ననూయ కనుంగొనలందుఁ దోపఁ గే
ల రహి నదల్చు నీలహరులన్ జయసీమల నెంతు నంబరో!

అప్ప—ఓహోహో! పట్టణ మంతయు మేడల నెక్కి చూచుచున్నది. ఇయ్యది యకాల ప్రళయమో యనునట్లు తోఁచుచున్నది. ఇప్పటికి నలుబదిమెట్లెక్కినది.

భట్టో—అవును, ఇయత్త లేకుంట చేనెవరును స్నానమొనరింప జంకి వెనుక కేగుచున్నారు కాని అటు చూడుఁడు రాయలుమాత్ర మాతురక బీబీతోఁ గదలక యేదో పెద్ద సన్నాపరుపివలెఁ బఠించుచు నాఘట్టమునఁ దన మేడపరం గూర్చుండి యట్లే చలింపక యున్నవాఁడు. ఇంతకు నిది యాయనకవిత్వమాహాత్మ్యము కాదుకదా?

అప్ప—(అటుచూచివిని) గంగమీఁద నేవో శ్లోకము లిదివఱలోఁ జేసినవో యిప్పుడు జేయుచున్నవియో కాని పఠించుచున్నాఁడు. ఇది హేతు వగునా? ప్రతిదినమును మహర్షిప్రవరులచే రచింపఁబడినశ్లోకములచే నెందఱు నుతించుటలేదు.

భట్టో—అట్లనకుఁడు. చూడుఁడు. ఆయన మొగమున నెట్టిదీక్ష పొడకట్టుచున్నదో.

అప్ప—ఆయనకే కాదు. ఆపెకుఁ గూడ నట్టిదీక్ష యొకన్పట్టుచున్నది. సమీపమునకుఁ బోయి విని పరిశీలింతము రండు. (అట్లొనరించి యచ్చెరువుగా వినుచున్నారు.)

రాయ—

(41) క. ఎందఱు రారంచటికిఁ గో, ర్కెం దీర్తువటన్న యాసఁ గృత్రిమరక్తిన్
జెంద న్నీతోడే నీ, యం దిది సహజంబ నాకనాదిగ జననీ.

(42) క. ఏనీమృత్తికఁ దామ, జ్ఞానమ్ముకి నుదుటఁ దాల్పఁగా విధిలిఖితం
బైనయనిష్టమ్ముడుగునె, దానన నాతాపమెల్లఁ దఱలున్ దల్లీ!

(43) చ. జనపదసక్తులన్ గని యొసంగెడివాసమునాఁ జెలంగుతె
ల్లనికుసుమంబులం దగి విలాసగతిన్ మలినాళిపుంజమున్

దనతనదివ్యసౌరభవిధమ్మునఁ బూతముగా నొనర్చుదే
వనదికిఁ దాపురం దనరుపాదముల్ చెలికొంద్రు నా కగున్.

(44) ఉ. ఎంతకునున్ గరంగని కరీశులు దేవతలన్నఁ గర్మముల్
సంతతనిష్ఠలన్ సలుపఁ జాలిన మేటులుఁ జేయరాని వీ
చింతలఁ గొంద ఱుంచు రిఁకఁ జేరికినిన్ గొననీ జగంబు జ
న్మాంతము సేయునీ స్మరణమంద సమస్తము గాంచి తల్లిరో!

(45) ఉ. పుట్టిన దాదిగాఁ దనువు వోయెడునంతకుఁ బుణ్యకర్మముల్
గట్టినవారిఁ బ్రోవఁ దగు కారుణికుల్ శతముల్ సహస్రముల్
పట్టాకయింతలేని గురుపాతకులన్ గడతేర్చుపాంటె నీ
యట్టికృపాధికుల్ పృథివియందు మఱెందును లేరు జాహ్నవీ.

(46) చ. జనని పయస్స్రగోలి జడసంగతి నాటల నాపఁ బోయి శ్రాం
తనెఱుఁగకే చిరమ్మువెనుఁడీయక యాడితి బుద్ధివచ్చె ని
ద్రను గొననెంతు నంకమునఁ దారిచి పూర్తిగ వారుపీజనం
బున నిదురింపఁజేయుము మిటుమున్నరకం బొనరింప నెన్నఁడున్.

(47) ఉ. గాఫలకేమి వే నదుముగట్టుము లేనెలతోడ గూఢపా
న్నాథుని వాళిఁదాల్పు మొకనాఁటికి "నా కిదియెంత" యంచు నీ
వీపరతోడిపాటు మది హేల యొనర్పుము మంబరో! జగ
న్నాథునినుద్ధరించెడిక్షణం బిది యీతవ వేల? జాహ్నవీ.

(48) చ. వర మభయంబు కుంభమును బద్మము నాలుగు సేతులన్ సుధా
కరశకలంబువాళి సుధఁ గాదనుపుట్టము భూషలున్ సరీ
రరుచికి వన్నెఁ బెట్ట మకరమ్మున నెక్కుడు పేర్మినొప్పనిన్
బరగతిదాయినిన్ దలఁచువారు పరాధిప మంద రంబరో.

(49) ఉ. అంతటఁ జిన్నినవ్వుల గుణాస్యరుచుల్ సుధలై భవాగ్నివి
క్రాంతుల తాప మార్ప నెటు గాంచినఁ జిక్కి లోకక్కెపెట్టు బ
ల్వింతగ నింతయంతనని వెన్నెల నుల్కఁగఁ జేయ డాయు నా
[illegible]ంతనుభార్య నా కిడు భృశంతనుసౌఖ్య మనంతమైతగన్

(50) ఉ. మంగలు జంకు మంత్రములు మ్రాన్పడు దైవతవర్గ మక్కటా!
సంకల గొందులన్ బడు నసార మగున్ సుధ వేయు నేల? పే

రంగుగరుత్తదశ్వములు వ్యర్థముతో భవవహ్నికీలలన్
గందెడినాదుతాపము పొకాలను నీదయలేక తల్లిరో.

భట్టో—(నమ్మికతో) చూచితిరా? యింక రెండుమెట్లెక్కిన రాయ లున్నమెట్టు గూడ మునిఁగెడిని.

అప్ప—అవును ఆ మనకుఁగాని, యాపెకుఁగాని యీభయమించుకయు నున్నట్లులేదే?

భట్టో—వారికెందుకు భయముండవలయును. ఇది వారలమహత్త్వమే కదా? ఆపద్యములు వింటిరా? అవి విని గంగయే మనకుఁడు ఎవ్వరేని యుప్పొంగవలసినదే.

అప్ప—యదనంతరన్యాయముచేఁ దమరన్నట్లూహింపవలసియే యున్నది గాని నిజమునకు మాత్రము సంగీతమునకుఁ జింతకాయలు రాలవు.

భట్టో—మన మసూయచే నట్లనుకొనుమాత్రమే కానిగంగకు నిజమైన పతితపావన రాలన్న బిరుదున్నచో నమ్మహోకపభక్తి కలయుప్పొంగదు? అట్లయినచో వేద శాస్త్రికు లసత్యములే కావలసివచ్చును.

అప్ప—అవును మొన్న మొన్ననే కదా! విద్యారణ్యులవారు కనకధారాస్తవ మొనరించి బంగారువర్షము గురిపించిరని వినుచున్నారము కాని ఆయనకును ఈయనకును యోగ్యతకేమి పాండిత్యమునకేమి హస్తిమశకాంతరముకలదు. నక్కెక్కడ? దేవలోకమెక్కడ?

భట్టో—ఇంకను మీరాయసూయ మొదలంట నశించినదికాదు. భక్తికిని పాండిత్యమునకును గడుదవ్వు ఏపుట్టలో నేపామున్నదో యెవరికెఱుక! పయి కిట్లున్నవారలే మహానుభావులు కావచ్చును. నిత్యతృప్తులవారిని వినుచుంటిమా? లేదా? మన మిట్లు మీనమేషములు లెక్కించుచు నుంటిమేని యింక నొకక్షణములోఁ గాశీ గంగపాలు కాక తీరదు. దానంజేసి మనకిరువురకును నప్రతిష్ఠ శాశ్వతమగును. మన మొనరించినయవమానమునకు రోసికదా! యీయనఘాత్ముఁ డిట్లొనరించుచున్నాఁడు. గంగయుఁ బ్రత్యక్షముగాఁ జెప్పకున్నను మహానుభావుఁడే యని మనకు బోధించుచున్నది. ఇప్పటికి నేఁబది మెట్లెక్కినది. యింకఁ దక్కిన వాపెకు లక్ష్యమా?

అప్ప—కాదు కెప్పుడును భంగముండదు. ఉన్నచో నా నామము నేతిబీరకాయయే కదా! కావ్యతి ఇప కాశీ, అనువృత్త్యప్తికిఁ బ్రళయకాలమందు పయిత మిట్లున్న యెడల నే సార్థక్యము.

భట్టో—మీశాస్త్రార్థములు గట్టిపెట్టుఁడు. భక్తులఁ బ్రోచుపట్ల భగవంతుఁడు శాస్త్రములు చూచువాఁడు కాఁడు. మనమీపాటికి నయ్యనఘునిఁ బ్రార్థింతము పదుఁడు. (బలవంతముగాఁ జేయిపట్టుకొని దగ్గఱగాఁ దీసికొనిపోవును.)

రాయ—

(51) మ. తనచర్మమును బాములుఁ శశియు రుద్రాక్షల్ మొదల్ సర్వము
క్కని మేషమ్మున శంభుఁ డోడి లపముఁ గన్పట్టమిఁ గౌరి సొ
డ్డను సంకింపుడు నాపె నవ్వులయిఁ జూడఁ జూడ జూదంబు గ
ల్చినయా నాఁటి భవన్మహానటన ముచ్ఛేదించు నాకర్మముల్.

భట్టో—అప్పుడే పాదములున్న మెట్టెక్కి పోలుచున్నయది. కౌశిక శోకహారియైనను నితఁడైన నిప్పట్టున నీపాదుసాపట్టితో నట్టేటఁ గలయక తప్పదు.

అప్ప—అవును అట్లే పొడకట్టుచున్నయది. ఉపాయమేమి?

భట్టో—ఇతఁడీసమాధిలో మనమాటలను వినిపించుకొనునట్లు తోఁచదు. ఈపెను బ్రార్థింతము. (ఆపె నుద్దేశించి) అమ్మా! మహాపతివ్రతా! నీకు మేమందఱమును నమస్కరించుచున్నారము. నీభర్త నెట్లైన నీయాగంగామహోపప్లవము వారింపఁ బ్రార్థింపుము.

అప్ప—బాగు సేయక యిట్లొనరింపక తప్పదు.

లవం—(తనలో) అయ్యో! నీచురాలనగు నన్నువీరట్లు ప్రార్థించెదరే! నేనేమి సేయుదును (ప్రకాశము) నాథా! నాథా! (శరీరము స్పృశించి పలుచును).

రాయ—(వినని విధమున)

(52) క. గంగ విభూషితలింగవ, రాంగ సకృత్కృత్తపాంతరాపాంగ లస
ద్భంగ సరోజప్రాంచ, ద్భృంగ మదీయాంగములు పవిత్రము సేయుఁ.

లవం—(గంగకంజలిఘటించి) అమ్మా! నీవైన నామనవి చేకొని నన్నుఁ వీ రభ్యర్థించిన దానికి ఫలము గల్పింపుము.

గంగ—(అంతటితో నాగుచున్నది) (అందఱును నాశ్చర్యపడుచున్నారు)

రాయ—(తనలో) ఏమిది!

(53) ఉ. "గోపికతాళనాన్వయజఁ గొంకక యాతతపత్రనేత్ర నీ
కా పురుషుండు గట్టికొనెఁ గా?" యని శంక యొకింత లేక మా
దాపున కేగుదెంచి యవృథా మరలం జన దేల జాల? మీ
యేపున లోనఁ జేర్చికొను మిందఱు నివ్వెఱఁగంద జాహ్నవీ.

(54) శా. శుద్ధాంతఃకరణుండ నేనిఁ గవితాశూరుండ నేనిన్ గళా
రాద్ధాంతమ్ములఁ బ్రోడ నేని నిను నారాధింతు నేనిన్ బుధ
శ్రద్ధావద్వచనుండ నే నుపనిషత్సారస్వరూపుండ నే
నుద్ధారం బొనరింపుమా? నను మహాయోగీంద్రచూడామణీ.

(55) ఉ. ఎన్నఁడు నించుకేని దొసఁ గెట్టిదొ నేరనివారు నీవు లే
కున్నఁ బవిత్రులే కడు నయోగ్యులఁ బ్రోచినప్రోపు ప్రోపు సం
పన్నుల నేగ సంగవశ భాగ్యవిహీనుల కేగియోగి ము
న్నున్నప్రతిష్ఠ నిల్పుకొను మోజగదంబ! బహూక్తు లేటికిన్.

(56) ఉ. శ్రీ ధరియించు టెప్పు డికఁ? గ్రీవ, శిరమ్మునఁ జంద్రుఁ డేడి? గం
గాధరముల్ జటావశులు గల్పనసేయ వదేమి? నీకు నా
భూధరరాజకన్యకకుఁ బోరడఁప న్వలదే! కటా! జగ
న్నాథుని నుద్ధరించెడిక్షణం బిది యీతడ వేల? జాహ్నవీ.

గంగ—(అట్లే హెచ్చక యుండును) అందఱును నిశ్చేష్టులై యుందురు.)

రాయ—(కొంచెము కోపముతో లవంగిం జూచి)

శా. ఇంకన్ గాల మటంచు నెంచ కెటులో యీనిన్ను నన్నన్ని
ప్పంకావేశులఁ జేయఁబూని కృప నా గీరథీదేవి రా
నుంకించెన్ మనకేమి కేల్మొగిచి యిట్లుండన్ దగుంగాక యే
శాంకాస్యా? బ్రతు కెంత శాశ్వతము? లో నాగాట మింతేటికిన్?

లవం—(భయముతో) నాథా! వీరిమాటకుఁ బ్రతిచెప్పఁజాలక యేనిట్లు ప్రార్థించితిని.

రాయ—వీ రెవరు? (దెసలు పరికించి ఓహో! వీరా, అట్లయిన వీరియెదుట నే మనయా
థార్థ్య మీగంగాముఖమునఁ దేలుంగాక.

(తెరలో)

గంగ—(రత్నభూషణసహితమగు కరద్వయము పైకెత్తి)

(1) తే. ఈజగన్నాథుచే రచియింపఁబడిన, యట్టి పీయూషలహరిఁ దా మహారహంబు
పఠన చేసెడివారికి భాగ్యమబ్బు, సౌఖ్యముల్ గల్గు సుఖముల్ శాంతిఁ జెందు.

(అందఱును నాశ్చర్యముతోఁ జూచుచు విందురు.)

రాయ—(తనలో సంతోషముతో) ఓహో! అంబిక తనదేవతాత్మత్వము గూడ వెల్ల
డిచేయుటయే కాక నాయీగంగాలహరీస్తోత్రమునకుఁ బీయూషలహరి యని కూడ
బిరుద మిచ్చినదే?

(మరల దెరలో)

వత్సా! జగన్నాథ!

(2) శా. సాక్షాద్బ్రహ్మవు నీవు, నీసతి సరస్వత్యంశసంజాత, మి
మ్మాక్షేపించెడివారునుం గలరుగా! యైశ్వర్యపర్యాప్తికై
యాక్షోణీస్థలి ఘనసామ్రాజ్యమునం దేణాక్షి పుట్టెన్, సతీ
త్వాక్షోభం బదిగాక యుండుటకుఁ దాత్పర్యంబు నీరాకకున్.

(భట్టోజీదీక్షితాదులు లోకరి మొగమువంక నొకరుచూచికొనుచు నిశ్చేష్టులై వినుచుందురు.)

రాయ—(తనలో) స్వప్నమునఁ జెప్పినట్లే యిప్పుడును జెప్పుచున్నయది, శక్తి యా యా భేదములచే ననేకగతుల నుండినను నుదకు నొక్కటియే కదా?

లవం—(తనలో) గృహమందుఁ బుట్టినదియనియే చెప్పుచున్నది. కాని సాక్షాత్పుత్రిక యని చెప్పలేదు, సర్వజ్ఞయగునాపె కీకరహస్యము దాఁగునా?

(మరలఁ దెరలో)

తల్లీ! లవంగి!

(3) ఉ. పుట్టినదాది యాపయిని బుద్ధియెఱింగినదాది యెన్నఁడున్
జెట్టయు మాంసభక్షణము చేసియెఱుంగవు నీదుతండ్రి యీ
పట్టపురాజు కాఁడు సుమి? బ్రాహ్మణవర్యుఁడు, మిమ్మునున్ వెలిన్
బెట్టిరిగా? అట్లైన, ననుఁ బెట్టరె? సాహసికుల్ బుధాగ్రణుల్.

లవం—(తనలో) ఇప్పటికి నన్నుఁగూడ విస్పష్టముగాఁ బవిత్రురాలిఁగా సమర్థించినది.

(మరలఁ దెరలో)

ఔనోయి! భట్టోజీ! ఏమోయి? అప్పయ్యా!

(4) చ. చదివితి రేటికీచదువు, సత్త్వము లెవ్వఁగా? యేరితేజ మె
ట్టిదియొ? యెఱుంగఁగావలదె! డీకొని వాద మొనర్చుటే మహా
పదవియొకో! జగత్త్రియము పావన మెవ్వరికల్మి నట్టివా
ఙ్మదవతియున్ విధాతయును మాన్యతకున్ దగరో కొ! యిక్కడన్.

(ఇరువురును నంజలి ఘటించి వడవడ వణఁకుదురు.)

(మరలఁ దెరలో)

(5) తే. బ్రాహ్మణక్షత్రియులయందుఁ బరఁగుతేజ, మెల్లయవనులయం దిప్పుడిమిడె నింక
హూణులనుబొందుఁగలి యుగ మొక్కకొంత, జరగుపిమ్మటమీయాట సాగు టెట్లు?

(6) మ. పయి నేనో సిరియో సరస్వతియొ యంబాదేవియో పేర్మి నిం
డియుకన్ రాణిగ హూణవంశమున జన్మింపన్ వలెన్ నాఁడొకిం
తయు వర్ణాశ్రమధర్మముల్ నడువ "వీధ్యాప్రెట్యమ్ములన్ మానుఁడ
య్య" యటంచున్ లిఖియింపుఁ డీవలు భవిష్యద్గ్రంథసందర్భముల్.

(7) చ. తురగకలఁ బోలె హూణు లొకకుం బనుకన్ గలిగింప రారకే
నగులు కులానువర్తనలు నాఁడె మొనర్తురు వారిమీఁద నె
వ్వాఁడుఁ గనలంగరాదు యుగవైఖరు లట్టులుపోవు దైవతా
దగ మనుగంటు సర్వమును దప్పె నొకింత నని చెప్పనేటికిన్.

(8) చ. బదుల నెపమ్మునన్ బలినెపమ్మునఁ బాట నెపమ్మునన్ ధనం
బడుగక యుబ్బి హోతువుల నూరక బ్రాహ్మణు లొక్క పెట్టుగాఁ
జెడి మతమేదియున్ గనక చేయని చెట్ట యొకింత లేక పో
వుదురు సర్వకర్మములు, వేదములు లప్పుడు దుర్వివాదముల్.

(9) శా. పూర్వాచారపరాయణత్వమున నే పోవంగ మీకిచ్చ యే
నర్వాచీన లోకశ్లాఘ్య యనన్ లా మీకు? మీయంత మీ
గుర్వష్ఠులు సాగఁ జేసికొనుఁ డేగుం డుత్తమంబుంగతుల్
గర్వంబున్ గని యొప్పెంచకుఁ డిదే కొన్నమ్ము గాకుండెడున్.

(10) ఉ. ఇంత వచింపనేల? యిపుడింకొకటున్ వినుచుండ నేను మీ
చెంత వచించుసంగతులె చెప్పుచు రింకొక సక్కి మార్చి "తా
నంతెము నందె రాయలును నంగన నున్ నదిలో" నటందు రీ
పింత లనేకముల్ నోడను వెక్కసమందకుఁ డయ్య వెట్టులై.

(11) ఉ. కొందఱు రాయలుం మిక్కొనెఁ గోమలి నొక్కతె యూవనాన్వయన్
మందులు దానినే యనిరి మానవనాయకు పుత్రియంచుఁ దా
మందురు, నాఁటిరాక యిటియంత రిత్తె యటంచు నవ్వ నర్
గుందకుఁ డిక్కిష్టులను గ్రూరయుగంబిది దీనివాదముల్.

(12) ఉ. ఏమన? మాకు నీగతిని నీయుగమం దగులేటి హితమ్ము మా
కేమియు సంచరించు ద్విజులే కడునిష్టులు, కాల మాపుదు
ర్ధీమహితుల్ భవాదృశులు ద్వేష్యులు, పుణ్యయుగంబు రాక కే
మే మొనరింపఁ జేయుదుము మీ జన సుష్కృతు లెంతలెంతలున్.

(12) తే. ఐదువేలవత్సరముల కగుడు నెంక ,గం బటంచు వచించుపురాణవాక్య
మెఱుఁగుఁడప్పటి కాచార మెల్లఁబోవు, నిలుచుబలల్లెలె నెక్కుడేని సుఁను నెదగి

(13) శా. విద్యావంతులుగూడ ద్రవ్యములనే ప్రేమింతు రాచారముల్
సద్యస్త్యాగ మొనర్తు రంటకు సరస్వత్యంబయే సాక్షి, యీ
దుర్యోగమ్మునకే కదా! యవనియౌ టొప్పెక్ వచోమాత, యే
విద్యల్ నేర్చిన పొట్టకే! యిఁక వృథా వేదమ్ములున్ శాస్త్రముల్.

లవం—(తనలో) నాచాపలమునకు మృదువుగనే శీవాట్లు వైచినది.

భట్టో—దేవీ! మాయపరాధము సైఁచి యనంతర్థరగా దర్శన మొకపరి ప్రసాదింపఁ గోరెదము.

అప్ప—అంబా! దురాగ్రహమ్మున నీభక్తుల కపచారము మొనర్చు టట్లుండె నీ కింత శ్రమ మిచ్చినందులకుఁ గూడ క్షమింప వేఁడెదను.

రాయ—జననీ! అన్తర్ధానరింపవేని యప్పుడు నాచినదానిచే కొంత సేపటికి లే దనెడి యీయుగమునందు "నిక్కముగా గంగ వచ్చిచెప్పెనా, ఏదో యింద్రజాలపట మున్నది" యని గేలి సలుపక మానరు.

గంగ—ఇదిగో ఇచ్చుచున్నాను నిరీక్షింపుఁడు (పటాక్షేపమ్మునఁ బ్రవేశించును.)

(ఎల్లరు నంజలిఘటించి భక్తిపారవశ్యమును గనుపఱతురు.)

(14) గంగ—ఉ. అల్లుఁడవైతి వీజగమునంత సునేలెడి ఘాదుసాకు, నీ
సూక్తులఁ డిచ్చెఁగాదె ప్రభుభోక్త కై కడు మెచ్చి, యీజమీ
నెల్ల నరేంద్రలబ్ధమున కింకొకయర్థ మిదేల? యేలు మీ
హల్లకపాణి ముక్ కవితయై నుచుద్రు నిముఁ గొల్వ నొప్పగన్.

(15) తే. ఆపయిని మీరురువురు సత్యభువనమ్ము, చేరగలరుగాని, నీచేతఁ జేయఁబడిన
గ్రంథములు భువి నున్నంతకాలమును స్మరింపఁ జేసెడిఁగాతఁ గీర్తి యిదెల్ల.

నీకింక ను నావలనఁ గాఁదగుమనోరథం బేమి?

రాయ—కృతార్థునిం జేసితివి. ఐనను ఇదియగుఁగాక.

(భరతవాక్యము.)

తే. రాజులకు వృద్ధి, యగ్రవర్ణస్థులకును,బుద్ధి వేదాలనాసక్తి బుధుల శక్తి,
సకలజనుల కారోగ్యంబు జగతిభాగ్య, మెల్లెడల నుల్లసిల్లు గాదిచ్చు దేల్లు.

పంచమాంకము.

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య. ఇది శ్రీకింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవిశాల కలానిధి బాలసరస్వతీ శతావధాని తిరుపతివేంకటేశ్వర విరచితంబగు పండితరాజంబునఁ బంచమాంకము.

---

# శుద్ధపత్రము.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 1 | 11 | గచే | రగా |
| 5 | 28 | సుగు | ధువు |
| 6 | 5 | చిన | చన |
| 7 | 5 | సాశ్వ | సాత్త్వ |
| 8 | 8 | జమ్ము | జము |
| 12 | 3 | ష్య | శిష్య |
| 12 | 17 | నజ్జ | నఙ్జ |
| 13 | 11 | మల్గ | మగ్గ |
| 14 | 12 | వృధ | వృధా |
| 14 | 13 | లోనోటి | నోటిలో |
| 14 | 28 | డంగు | డను |
| 15 | 13 | వమ్మి | వమి |
| 15 | 16 | రెగు | రెఱుఁ |
| 15 | 19 | నేసు | వేసు |
| 16 | 11 | గుట్టి | గుట్టె |
| 16 | 28 | నుంట | నుంటి |
| 17 | 2 | మొహ | మోహ |
| 19 | 9 | టకుమా | టమా |
| 20 | 16 | చి—శిష్యత్త్రము | శిష్య—చిత్తు |
| 23 | 5 | గోష్ఠ్య | కుక్క |
| 23 | 8 | ఇదు | ఇది |
| 24 | 6 | కుజా | కుజ |
| 26 | 26 | యకు | యకం |
| 26 | 26 | నత్త | న్తత్త |
| 26 | 27 | ఉన్న | ఉన్న |
| 28 | 8 | త్రర | త్రఅ |
| 28 | 29 | జరా | జమీ |
| 31 | 3 | పుపువ్యా | పువ్యా |
| 31 | 22 | అయ | ఆయు |
| 34 | 14 | నేనిక్క | నీవిక్క |
| 43 | 2 | పర్నం | పరుం |
| 44 | 6 | టిపు | టివైపు |
| 14 | 23 | జక్క | జిక్క |
| 54 | 1 | వాని | బాని |
| 55 | 6 | మ్ములతోడ | మ్ముతోడ |
| 55 | 17 | గోను | కోద |
| 55 | 28 | గఁదా | గదా |
| 55 | 29 | మిఁట | మిట |
| 59 | 19 | కరి | కలి |
| 61 | 7 | రాధ | వాద |
| 64 | 10 | దీని | వీసి |
| 65 | 14 | ష్ట | పుడ |
| 68 | 4 | నిష | నిష్ఠ |
| 72 | 26 | దిమి | డిమి |